Published from Ananthapuramu
PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 04 | సంచిక : 80 | శనివారం | అక్టోబర్ 3, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 04 | Issue No : 80 | Saturday | 3 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం..

### కండక్టర్‌గా తమిళనాడు సీఎం విజయ్

చెన్నై : గాంధీ జయంతి సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే 'వెట్రి పయనం' పథకం విస్తరించిన సేవలను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి విజయ్ కండెక్టర్‌గా టిక్కెట్లు ఇచ్చారు. ఈ విస్తరణతో రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా మహిళలు లబ్ధి పొందనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇకపై మహిళలు డీలక్స్, ఎక్స్‌ప్రెస్ వంటి బస్సు సర్వీసుల్లోనూ ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు ఎలాంటి ఆదాయ పరిమితి లేదని, రోజువారీ ప్రయాణాల సంఖ్యపైనా ఆంక్షలు ఉండవని స్పష్టం చేసింది. అధికార పార్టీ తమిళగ వెట్రి కజగం (టీవీకే) నుండి ఈపేరు వచ్చింది. 'వెట్రి' పదానికి విజయమని అర్థం. 'వెట్రి పయనం' అంటే విజయవంతమైన ప్రయాణం అని అర్థం.

# సీమను సిరులసీమగా మారుస్తాం..

### ఉద్యానరంగ అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి

- అగ్రికల్చర్ స్కూల్ ద్వారా వ్యవసాయ రంగంలో నైపుణ్యాలు పెంచుతాం
- కేంద్ర సాయంతో రాష్ట్రాభివృద్ధి-ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సహకారాన్ని మరువలేం
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన సభలో సీఎం చంద్రబాబు
- రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శ్రీకారం
- రిలయెన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన
- మదనపల్లెలో రెండు బృహత్తర ప్రాజెక్టులకు అంకురార్పణ చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గోదావరి-కావేరి నదుల అనుసంధానికి అనుమతివ్వాలని కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు
- తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించమని సీఎంను కోరిన అనంత్ అంబానీ
- అనంత్ అంబానీ ఏపీ ముద్దుబిడ్డ అంటూ ముఖ్యమంత్రి ఆలింగనం



ప్రజాభూమి ప్రతినిధి,మదనపల్లె : కరవుసీమగా పేరున్న రాయలసీమను సిరుల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కూటమిని గెలిపించిన మరుక్షణం నుంచి ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో ఉన్నామని... దాంట్లో భాగంగానే రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఉద్యాన రైతులకు మేలు చేసేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని చెప్పారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం గ్లోబల్ హార్టికల్చర్ హబ్-GHH, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-ISAకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు

వివరాలు 2లో..



## పాఠశాలల్లో అల్పాహార పథకం..

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి.

2 పేజీలో..

## కరవుతో కాదు..అభివృద్ధితోనే రాయలసీమకు కొత్త గుర్తింపు

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి, మదనపల్లె : కరవుతో పోరాడిన రాయలసీమను ఇకపై కరువు సీమగా కాకుండా, ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.



- మిగతా 2లో..

## 70 మంది ప్రభుత్వ వైద్యులపై ఎపి ప్రభుత్వం వేటు..!



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో క్రమ శిక్షణారాహిత్యం, సుదీర్ఘకాల అనధికారిక గైర్హాజరీపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు చేపట్టింది. విధులకు తరచూ గైర్హాజరవుతూ రోగులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న 70 మంది ప్రభుత్వ వైద్యులను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ 70 మందితోనే కాకుండా, వివిధ దశల్లో గైర్హాజరవుతున్న మరొక 193 మంది వైద్యులపై కూడా తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

2లో..



## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు

- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ
- 34 శాతం రిజర్వేషన్ల జీవో కేవలం రాజకీయ గిమ్మిక్కేనని బొత్స విమర్శ
- చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్
- సుప్రీంకోర్టుకు వెళ్తామనడం బీసీలను మళ్లీ మోసగించడమేనని ఆరోపణ

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపోటు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు.

వివరాలు 2లో..

## ఉచ్చు బిగిస్తున్న ఈడీ..

### వివేకా హత్య కేసులో కీలక పరిణామం

- వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డికి ఈడీ నోటీసులు
- ఈ నెల 14న విచారణకు హాజరుకావాలని స్పష్టీకరణ
- రూ.40 కోట్ల డీల్‌పై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు
- గతంలో అవినాష్ రెడ్డి ఇంట్లో రూ.24 లక్షలు స్వాధీనం చేసుకున్న అధికారులు
- సీబీఐ ఛార్జిషీట్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసులో రూ.40 కోట్ల డీల్ జరిగిందనే ఆరోపణలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది.వివేకా హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది.

- మిగతా 2లో..

## గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది



- మంత్రి నారాయణ
- నెల్లూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు హామీ
- కాలేజీలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ భారత్ – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి ప్రజలందరి సహకారం అవసరమని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈరోజు నెల్లూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించి, ఆధునిక క్రికెట్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారాయణ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

2లో..

## అక్టోబరు 13 నాటికి మరో బంగాళాఖాతంలో అల్పపీడనం..

### వాయుగుండంగా మారే చాన్స్

- అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ
- ఈ సీజన్‌లో ఏపీలో 34.9 శాతం మేర వర్షపాతం లోటు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :
నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది.

2 పేజీలో..

## సంపాదకీయం

# జయహో స్మిత్ మచ్చార్!

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని ప్రమాదం తప్పింది. గాల్లో ఉండగానే కో-పైలట్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన భారత సంతతి కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. రక్తమోడుతున్నప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచి, పెను విమాన ప్రమాదాన్ని నివారించి 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. బోయింగ్ 737 మ్యాక్స్-8 విమానం గాల్లో ఉండగా, ఒమన్ జాతీయుడిగా భావిస్తున్న కో పైలట్ అకస్మాత్తుగా కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై కత్తితో దాడి చేశాడు. విమాన నియంత్రణ వ్యవస్థలను ధ్వంసం చేసి, విమానాన్ని కూల్చేందుకు అతను తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో విమానం కేవలం 30 సెకన్లలోనే దాదాపు 14,000 అడుగుల కిందికి దూసుకువచ్చింది. తీవ్ర గాయాలపాలై కిందపడిపోతున్న సమయంలో కూడా కెప్టెన్ స్మిత్ చాకచక్యంగా కాక్‌పిట్ డోర్‌ను అన్‌లాక్ చేసి కేకలు వేశారు. విమానం తీవ్ర కుదుపులకు లోనవడం, అరుపులు వినిపించడంతో అప్రమత్తమైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. కాక్‌పిట్‌లోకి చొరబడిన ప్రయాణికులలో యానివ్ అనే ఇజ్రాయెల్ ప్లంబర్ ప్రధాన పాత్ర పోషించారు. టీవీలో ప్రసారమయ్యే ఎయిర్ డిజాస్టర్స్ కార్యక్రమాలు చూసి విమానాల నియంత్రణపై ప్రాథమిక అవగాహన పెంచుకున్నట్లు చెప్పిన యానివ్, ఇతర ప్రయాణికులతో కలిసి విధ్వంసానికి పాల్పడుతున్న కో-పైలట్‌ను కుర్చీ నుంచి వెనక్కి లాగి బంధించారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్లు, భద్రతా సిబ్బంది వెంటనే కాక్‌పిట్ నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుని విమానాన్ని అదుపు చేశారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. దాదాపు 8 గంటల నిరీక్షణ అనంతరం ప్రయాణికులను మరో ప్రత్యామ్నాయ విమానంలో టెల్ అవీవ్‌కు తరలించారు. గుజరాత్‌కు చెందిన స్మిత్ మచ్చార్ కమర్షియల్ ఏవియేషన్ రంగంలో పదేళ్లకు పైగా విశేష అనుభవం కలిగిన పైలట్. జూన్ 2011 నుండి 2022 వరకు దాదాపు 11 ఏళ్లపాటు భారత విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2022లో డైరెక్ట్ ఎంట్రీ కెప్టెన్‌గా ఫ్లైదుబాయ్‌లో చేరారు. బోయింగ్ 737 విమానాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల్లో ఆయన నిపుణుడు. వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, ఆయన కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. మచ్చర్‌కు కమర్షియల్ విమానయానంలో 13 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఫ్లైదుబాయ్‌లో చేరకముందు ఆయన 11 ఏళ్లకు పైగా స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2011 నుంచి జూన్ 2022 వరకు స్పైస్‌జెట్‌లో విధులు నిర్వహించిన ఆయన సీనియర్ కమాండర్‌గా, లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 2020 నుంచి జూన్ 2022 వరకు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా ఇతర పైలట్లకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. బోయింగ్ 737 విమానాలను 9,500 గంటలకు పైగా నడిపిన అనుభవం మచ్చర్‌కు ఉంది. జూన్ 2022 నుంచి ఫ్లైదుబాయ్‌లో కెప్టెన్‌గా పనిచేస్తూ దుబాయ్‌లో నివసిస్తున్నారు. అక్కడ కూడా పైలట్ల శిక్షణ, విమాన కార్యకలాపాల నిర్వహణలో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విమానయాన భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలు, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే అనుభవం ఆయన కెరీర్‌లో భాగంగా ఉంది. ప్రస్తుతం సెప్టెంబర్ 30న జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన అద్భుత ధైర్యాన్ని ప్రపంచ నేతలు కొనియాడారు. ఓవల్ ఆఫీస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. "స్మిత్ చాలా తీవ్రమైన గాయాలపాలైనా సమయస్ఫూర్తితో వ్యవహరించి రియల్ హీరోగా నిలిచారు. ఇదొక అద్భుతమైన సంఘటన" అని అన్నారు. తీవ్రంగా గాయపడినా వెనకడుగు వేయకుండా ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యానికి నా సెల్యూట్. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్మిత్‌ను అత్యంత నైపుణ్యం కలిగిన వీరుడిగా అభివర్ణిస్తూ, భారత్-ఇజ్రాయెల్-యూఏఈ తరఫున ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తున్నట్లు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి తెలిపారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. గురువారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్న ప్రధాని.. కెప్టెన్ స్మిత్ మచార్‌ను హీరోగా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచలమైన సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెద్ద విషాదాన్ని నివారించిందని అన్నారు. కెప్టెన్ మచార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. మరోవైపు కాక్‌పిట్‌లో గొడవ జరుగుతున్న విషయం గుర్తించిన యానివ్.. వెంటనే అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మరో ప్రయాణికుడితో కలిసి కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. చివరకు లోపలికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు సహకరించారు. ఈ ఘటనలో యానివ్ షర్టుపై రక్తపు మరకలు కనిపించాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విమానం సురక్షితంగా ఇజ్రాయెల్‌కు చేరుకున్న తర్వాత యానివ్ హయూన్ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కలిశారు. ఈ సందర్భంగా నెతన్యాహు అతన్ని అభినందించారు. 'చాలా గొప్ప పని చేశావు. నువ్వు హీరో' అంటూ ప్రశంసించారు. ఆ తర్వాత విమానంలో జరిగిన పరిణామాలను యానివ్ ప్రధానితో పంచుకున్నారు. విమానంలో లైట్లు ఆగిపోవడం, క్యాబిన్ పరిస్థితుల్లో మార్పులు రావడం నుంచి కాక్‌పిట్‌లోకి వెళ్లే వరకు ఏం జరిగిందో వివరించారు. విమానం ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా లైట్లు ఆఫ్ అయ్యాయని ప్లంబర్ గా పనిచేస్తున్న హయూన్ తెలిపారు. అదే సమయంలో క్యాబిన్‌లోని గాలి పీడనంలో మార్పును గుర్తించడంతో విమానంలో ఏదో సమస్య తలెత్తిందని భావించి కాక్‌పిట్ వైపు వెళ్లాననీ చెప్పారు. తనతో పాటు మరో ప్రయాణికుడు కూడా అక్కడికి వచ్చాడని, అతను ఆ సమయంలో డ్యూటీ లేని ఓ పైలట్ అని తర్వాత తెలిసిందని హయూన్ చెప్పారు. కాక్‌పిట్ లోపల ఏదో ఘర్షణ జరుగుతున్నట్లు గుర్తించిన హయూన్, మరో ప్రయాణికుడు తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే కెప్టెన్ స్మిత్ మచ్చర్ గాయపడి స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్నారు. అయినప్పటికీ కెప్టెన్ మచ్చర్ కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేశారు.

# సీమను సిరులసీమగా మారుస్తాం..

నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడులతో మరో రూ.60 వేల కోట్లను సమీకరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్మాగాంధీ ఆశయాన్ని సాకారం చేసే దిశగా రాయలసీమలో చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో కరవుసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఉద్యాన రంగం ప్రాథమిక రంగం వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం సుమారు రూ.1.50 లక్షల కోట్ల జీవీఏ అందిస్తున్న ఈ రంగం ద్వారా మరో రూ.లక్ష కోట్ల జీవీఏను సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించేలా ఈ ప్రాజెక్టులో కార్యాచరణ చేపట్టనున్నామన్నారు. రైతులకు ఉత్పత్తి నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు సమగ్ర మద్దతు అందించడమే హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశమని సీఎం చంద్రబాబు చెప్పారు. పంటల స్థిరీకరణతో పాటు ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. యాపిల్, స్ట్రాబెరీ నుంచి అరటి, అవకాడో, కివీ, ఖర్జూరం వరకు వివిధ రకాల ఉద్యాన పంటలకు ప్రోత్సాహం అందించనున్ననట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలను అభివృద్ధి చేసి రైతులకు మేలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సీడ్ టు షిప్‌మెంట్ వ్యవస్థల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేయనున్నామని సీఎం వెల్లడించారు.

**సాగునీరందిస్తాం..బంగారం పండించండి :** సాగునీరు అందిస్తే రాయలసీమ ప్రజలు బంగారం పండిస్తారని, మార్కెటింగ్ ద్వారా సంపద సృష్టిస్తారని సీఎం పేర్కొన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, రూ.3,500 కోట్లతో హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి కుప్పం వరకు నీటిని తీసుకెళ్లామని చెప్పారు. వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి మార్కాపురానికి, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని అందించామని వివరించారు. మరో రూ.35 వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. రాయలసీమలో హంద్రీ-నీవా, మడకశిర బ్రాంచ్ కెనాల్, మల్లెమడుగు, బాలాజీసాగర్, అప్పర్ పేరూరు తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో సవాళ్లు పెరుగుతున్నాయని సీఎం అన్నారు. గోదావరిలో ఈ ఏడాది కూడా సుమారు 1,600 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, పట్టిసీమ ద్వారా పదేళ్లలో సుమారు 500 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలించామని తెలిపారు. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమకు తరలించడం నదుల అనుసంధానం వల్లే సాధ్యమైందన్నారు. వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. పవర్ గ్రిడ్, రోడ్ గ్రిడ్, డిజిటల్ కనెక్టివిటీ మాదిరిగా వాటర్ గ్రిడ్ అవసరమని చెప్పారు. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంతో రాయలసీమ కరవు తీరడంతోపాటు... దక్షిణాదిలోని 4 రాష్ట్రాల మధ్య నెలకొనే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రిలయన్స్ సంస్థ సహకారంతో మదనపల్లెలో ఏర్పాటు కానున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, ఆధునిక సాంకేతికత, పరిశోధన, కృత్రిమ మేధ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఈ సంస్థను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. ఐఐఎంలో మేనేజ్‌మెంట్ నిపుణులు, ఐఐటీలో సాంకేతిక నిపుణులు, ఐఎస్‌బీలో పారిశ్రామిక నైపుణ్యాలు అభివృద్ధి చెందినట్లే.. ఐఎస్ఏ ద్వారా వ్యవసాయ రంగంలో నాయకత్వ నైపుణ్యాలు కలిగిన నిపుణులను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ఉక్కు మహిళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి, దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అందిస్తున్న సహకారాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం తదితర ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందన్నారు. దేశ నిర్మాణంలో నిర్మలా సీతారామన్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ నెక్స్ట్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్ అని సీఎం అన్నారు. ఓ మహిళే ఇంటిని చక్కగా తీర్చిదిద్దే సత్తా మహిళకు మాత్రమే ఉంటుందని.. అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమెకున్న నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు నిధులు కేటాయించే విషయంలో నిర్మలా సీతారామన్ చూపిన చొరవను.. ఇచ్చిన సహకారాన్ని మరువలేమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి-సంక్షేమం చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తన పెద్ద మనస్సును చాటుకున్నారన్నారు. వ్యవసాయం, ఉద్యాన రంగాల్లో పరిశోధన, ఆధునిక సాంకేతికత, ఏఐ వినియోగంతో పాటు రైతులకు అవసరమైన మద్దతు వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో రిలయన్స్ సంస్థ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. సీడ్ టు షిప్‌మెంట్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో మరింతగా భాగస్వామ్యం కావాలని సూచించారు. తిరుమల శ్రీవారిపై భక్తితో ఈవీ బస్సులను సమకూర్చిన అనంత్ అంబానీ సేవలను సీఎం ప్రస్తావించారు. అలాగే అనంత్ అంబానీ వంతారా వంటి వ్యవస్థను ఏర్పాటు చేసి జంతువులకు సైతం సేవలు అందిస్తున్న గొప్ప పర్యావరణ ప్రేమికుడు అనంత్ అంబానీ అని కొనియాడారు. అనంత్ అంబానీ తన తాత, తండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని వారి బాటలో నడుస్తున్నారని సీఎం చంద్రబాబు చెప్పారు.

**ప్రత్యేక ఆకర్షణగా అనంత్ అంబానీ**

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధాన్ని చాటుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. తనను ఆంధ్రా బిడ్డగా భావించాలని, రాష్ట్రానికి తాను ఏం చేయగలనో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆయనను అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు అనంత్ అంబానీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత ప్రసంగించిన ముఖ్యమంత్రి అనంత్ అంబానీ చెప్పిన మాటలను స్పందించారు. అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా భావిస్తున్నామని సీఎం వేదికపై ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం సందర్భంగా సభలో వక్తల ప్రసంగాలకు ముందు ప్రత్యేక వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, నీటి వనరుల వినియోగం, ఆధునిక సాగు విధానాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలను ఈ వీడియోలో వివరించారు. కార్యక్రమం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మొక్కలను నాటారు. అలాగే ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కరవుతో కాదు..అభివృద్ధితోనే రాయలసీమకు కొత్త గుర్తింపు

మొదటి పేజీ తరువాయి

రైతులకు సాగు నీటి సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు, పంటలను మార్కెట్లకు వేగంగా తరలించేందుకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, అదనపు విలువ లభించేలా ఆధునిక కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పంట ఉత్పత్తి నుంచి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి రాయలసీమ రైతుల ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తోపాటు ప్రపంచ మార్కెట్‌కు చేరేలా చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు. శుక్రవారం మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన మహోత్సవంలో కేంద్ర మంత్రి నిర్మాల సీతారామన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాయలసీమ గొప్ప చరిత్రకు, ప్రత్యేకమైన సంస్కృతికి, ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిన నేల. శ్రీకృష్ణదేవరాయలు పాలించిన ఈ ప్రాంతం ఒకప్పుడు అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంది. ఫ్యాక్షన్ రాజకీయాల ప్రభావంతో అశాంతికి గురైన సందర్భాలు ఉన్నాయి. అభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన ప్రాంతంలో పచ్చని చెట్లను సైతం నరికి వేసిన పరిస్థితులు చూశారు. ఆ పరిస్థితుల నుంచి రాయలసీమను బయటకు తీసుకువచ్చి, అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేశారు. 2024లో మీరు అందించిన ప్రజా తీర్పు ఈ మార్పుకు మరింత బలాన్ని ఇచ్చింది. ప్రజలు ఇచ్చిన ఆ విజయంతోనే ఈ రోజు రాయలసీమలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి కార్యక్రమాలకు బాటలు పడ్డాయి.

**రెండేళ్లలో రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులు :** పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాయలసీమలో గత 2 ఏళ్లలో రూ.8 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. అందులో భాగంగా రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల్లో, అందులో రాయలసీమ ప్రాంతాన 62 వేల ఎకరాల్లో 28 వేల మంది రైతులకు లబ్ధి చేకూరేలా ఉద్యాన పంటల సాగును విస్తరించాం. నీటి సంరక్షణలో భాగంగా దాదాపు 70 వేల ఫామ్ పాండ్లను నిర్మించి, అదనంగా 50 వేల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చాం. రూ.4,500 కోట్లకు పైగా నిధులతో 23 వేలకు పైగా రహదారి పనులను చేపట్టి, 5 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేశాం. ఉపాధి హామీ నిధులతో ప్రాజెక్ట్ జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలను బలోపేతం చేస్తూ, రాయలసీమను నీటి భద్రత ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా ఎన్నో చర్యల చేపట్టాం. తద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలమట్టాలు సగటున 3.6 మీటర్లు పెరిగాయన్నారు.

## పాఠశాలల్లో అల్పాహార పథకం..

జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. "రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే" అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను వైసీపీ అడ్డుకుంటోందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బొత్స మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపవద్దని హితవు పలికారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# ఉచ్చు బిగిస్తున్న ఈడీ..

2025 ఆగస్టులో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసింది. హత్య కోసం కుట్రదారులు సమకూర్చాలనుకున్న రూ.40 కోట్లు ఎక్కడి నుంచి తీసుకురావాలనుకున్నారు? అంత పెద్ద మొత్తాన్ని వారికి ఎవరు అందించారు? అనే కోణంలో ఈడీ ఆరా తీస్తోంది. అలాగే, హత్యలో పాల్గొన్న నిందితులకు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.4 కోట్ల నగదు మూలాలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసింది. 2019 నుంచి నిందితులు, అనుమానితుల బ్యాంకు లావాదేవీలు, నిధుల కదలికలపై



నిశితంగా పరిశీలిస్తోంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఇప్పటికే పలువురిని విచారించింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు ఇతర నిందితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డిలను ప్రశ్నించి వారి నుంచి కీలక వివరాలు సేకరించింది. దీనికి కొనసాగింపుగా గతంలో ఆగస్టు 21న హైదరాబాద్, కడప జిల్లాల్లోని ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భాగంగా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసంలో లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు రెండు లాకర్ల తాళాలు, కొన్ని కీలకమైన దస్త్రాలను కూడా అప్పట్లో సేకరించారు. గత సోదాల్లో లభించిన ఆధారాలు, ఇతర నిందితుల విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగానే తాజాగా అవినాష్ రెడ్డిని ప్రశ్నించాలని ఈడీ నిర్ణయించినట్టు తెలుస్తోంది. వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపు మార్గాలపై అవినాష్ రెడ్డి నుంచి వివరాలు రాబట్టే అవకాశం ఉంది. ఈ పరిణామంతో వివేకా హత్య కేసులో దర్యాప్తు మరోసారి కీలక దశకు చేరుకుంది.

## 70 మంది ప్రభుత్వ వైద్యులపై ఎపి ప్రభుత్వం వేటు ..!

గతంలో మే నెలలోనే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో 51 మంది వైద్యులను విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకుగాను ఉద్యోగాల నుంచి తొలగించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల గైర్హాజరును ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. డీఎంఈ, డీఎస్‌హెచ్ఎస్ అధికారులు సమర్పించిన సమగ్ర నివేదికలను పరిశీలించిన అనంతరం ... సుదీర్ఘకాలంగా అనధికారికంగా విధులకు దూరంగా ఉంటున్న వైద్యులపై ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

## అక్టోబరు 13 నాటికి మరో బంగాళాఖాతంలో అల్పపీడనం..

అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 - సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది

స్వచ్ఛాంధ్ర కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా ఒక రోజు కేటాయిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. "గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించింది. గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే, మేం వాటన్నింటినీ క్లియర్ చేస్తున్నాం" అని ఆరోపించారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. పట్టాల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం పేదలకు శాశ్వత నివాస పత్రాలు అందిస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు.



# మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డు

❖ మోపిదేవి బాలికల హాస్టల్ కు స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డు ❖ పెదప్రోలు అంగన్వాడీ కేంద్రానికి స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డు




ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర 2026 అవార్డుకు ఎంపికయింది.అంగన్వాడి విభాగంలో మోపిదేవి మండలంలోని పెదప్రోలు పంచాయతీ శివారు ప్రశాంత్ నగర్ అంగన్వాడి కేంద్రానికి స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర అవార్డు దక్కింది. శుక్రవారం గాంధీ జయంతి సంద ర్భంగా మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ బోలెం నాగమణి చేతుల మీదుగా మోపిదేవి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, బాలికల హాస్టల్ వార్డెన్ యాసం శివ నాగలక్ష్మి, పెదప్రోలు అంగన్వాడి కార్యకర్త కాకి లక్ష్మీ తిరుపతమ్మ లు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం, మోపిదేవి బాలికల హాస్టల్, పెదప్రోలు అంగన్వాడి కేంద్రాలకు స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర అవార్డులు రావడం పట్ల ఆయా శాఖల ఉద్యోగులు, గ్రామాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం, మోపిదేవి లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్



# సత్యసాయి పద్య సూక్తుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :
మచిలీపట్నం ఈడేపల్లిలోని భగవాన్ సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి పద్య సూక్తుల పోటీల బహుమతి ప్రదానోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర విద్యా విభాగం సూచనల మేరకు ఆగస్టులో పాఠశాల స్థాయిలో, సెప్టెంబర్ 6న పట్టణ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.పట్టణ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతులను ఆరేపల్లి వార్షిక లక్ష్మీనిర్మల హైస్కూల్‌కు చెందిన చిరంజీవి, బాలాజీ విద్యాలయానికి చెందిన గొడుగు సాయి వర్షిణి, సాయి పబ్లిక్ స్కూల్‌కు చెందిన టి.ఆదిత్యన్, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌కు చెందిన పి.కారుణ్య, బాలాజీ విద్యాలయానికి చెందిన ఏ.ఋషికా సాధించారు. ద్వితీయ బహుమతులను రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌కు చెందిన పి.మేధస్వి, సాయి పాఠశాలకు చెందిన వై.నాగతేజ, జవహర్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎం.వివేక్, బాలాజీ విద్యాలయానికి చెందిన టి.సాయి శ్రీహర్ష సాధించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.రాంజీ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థుల్లో విలువలను పెంపొందించే విధంగా జీవన విధానాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. చిన్న వయస్సులోనే పిల్లలకు నైతిక విలువలను అందిస్తే వారి ఎదుగుదలతో పాటు విలువలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న సత్యసాయి సేవా సంస్థల కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ నవంబర్‌లో నిర్వహించనున్న పుట్టపర్తి యాత్రకు తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

జిల్లా విద్యా విభాగ మహిళా సమన్వయకర్త డి.సాయిజ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విలువలను వెలికితీయడమే పద్య సూ క్తుల పోటీల ప్రధాన లక్ష్యమన్నారు. ఐదేళ్ల వయస్సు నుంచే చిన్నారులు విలువలతో కూడిన పద్యాల ను చెప్పడం అభినందనీయమని, భవిష్యత్తులో వారే సమాజానికి విలువలను అందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ మాట్లాడుతూ సత్యసాయి విద్యా విధానాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలను మరింతగా పెంపొందించవచ్చున్నారు. సమితి సమన్వయకర్త అనుమకొండ వెంకటేశ్వరరావు అతిథులను పరిచయం చేసి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. కార్యక్రమాన్ని సోమేశ్వరీ దేవి నిర్వహించగా, విద్యా విభాగ సమన్వయకర్తలు పి.వరప్రసాద్, కళ్యాణి, సేవాదళ్ జాయింట్ సమన్వయకర్త వై.రాజమోహన్, ఎం.బి.రామ్మూర్తి, దార సూర్యచంద్ర రావు, మల్లంపల్లి శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, సుందరి కాళికాదేవి తదితరులతో పాటు భక్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సోనోవిజన్ కాదు సోది విజన్...!!!

❖ కస్టమర్లను మాయ చేసి అమ్మకాలు.?? ❖ 1వ నెలలో లాయిడ్ వాషింగ్ మెషిన్ కొనుగోలు.. ❖ 10వ నెలలో వాషింగ్ మెషిన్ మాకు వద్దంటూ గొల్లపూడి సోనోవిజన్ దగ్గర వదిలి వెళ్ళిన కస్టమర్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
విజయవాడ రూరల్ మండలం ఆంధ్ర ఆసుపత్రి పక్కన ఉన్న సోనోవిజన్ ఎలక్ట్రానిక్ షో రూమ్ లో భవానిపురానికి చెందిన ఓ కస్టమర్ జనవరి నెలలో వాషింగ్ మెషిన్ కొందామని కుటుంబంలో కలిసి సోనోవిజన్ షోరూం కి వెళ్ళరు.ఆ షోరూమ్ లో వాషింగ్ మిషిన్లు చూసి ఎల్ జి. కంపెనీకి చెందినది వాషింగ్ మెషిన్ కొందామని కస్టమర్ అనుకున్నాడు, అక్కడ ఉన్న సోనోవిజన్ సిబ్బంది ఎల్ జి.కంపెనీ మంచిది కాదని, లాయిడ్ కంపెనీ బాగా వర్క్ చేస్తుందని కస్టమర్ కి మాయ మాటలతో వారి మైండ్ సెట్ ను మార్చేసి లాయిడ్ వాషింగ్ మెషిన్ ని అంట కట్టారు, అది సోనోవిజన్ కాద, సోది విజన్ అని కస్టమర్ వాపోయారు. కొన్న వెంటనే పది రోజుల వ్యవధిలో వాషింగ్ మెషిన్ రిపేర్ వచ్చింది, కస్టమర్ కేర్ కి కాల్ చేసి కాల్ బుక్ చేయగా ఆ వర్క్ మాత్రం సరిగ్గా వర్క్ చేయలేదు, కొన్ని పార్టు పోయాయని, నెల రోజులు గడిపారు మరొకసారి బోర్డు కాలిపోయిందని లాయిడ్ కంపెనీ లో స్టాక్ లేవంటూ మరొకనెల రోజులు గడిపారు,ఆ తరువాత మరొక సమస్య వచ్చింది ఇలా నాలుగు సార్లు కస్టమర్ కి లాయిడ్ సర్వీసింగ్ సెంటర్ వారికి కొంత మనస్పర్ధలు ఏర్పడి, కస్టమర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా కస్టమర్ లాయిడ్ కంపెనీ వాషింగ్ మెషిన్ తో విసుక్కుపోయి ఇప్పటికీ వాషింగ్ మెషిన్ కొని పది నెలలు అవుతుంటే ఆరు నెలలు వాషింగ్ మెషిన్ ని పక్కన పెట్టామని, లాయిడ్ కంపెనీ వాషింగ్ మెషిన్ వల్ల చాలా ఇబ్బందులు పడ్డామని, గొల్లపూడి లోని సోనోవిజన్, యాజమాన్యం మాత్రం కంపెనీ వారే చేయాలని మాకు ఏమి సంబంధం లేదని మీరు కస్టమర్ కేర్ తోనే మాట్లాడుకోవాలని బదులిచ్చారు, కానీ విసుగెత్తి పోయిన కస్టమర్ మాత్రం లాయిడ్ కంపెనీ వాషింగ్ మెషిన్ మాకు వద్దంటూ గొల్లపూడి లోని సోనోవిజన్ వద్ద విడిచిపెట్టి అసహనంతో వెళ్ళిపోయారు. సోనోవిజన్ షోరూంలో కొన్ని పనికిరాని బ్రాండ్లు ప్రజలకు అంట కడుతున్నారని, సోనోవిజన్ కున్న మంచి పేరు చెడిపోతుందని, కస్టమర్లు ఆవేదన చెందుతున్నారు.సోనోవిజన్ లో పనిచేస్తున్న వర్కర్లు సరిగ్గా స్పందించడం లేదని ఒకటి కొందామని వెళితే వారు బలవంతం గా ఇంకొకటి అంటగట్టే విధంగా వారి ప్రవర్తన ఉందంటూ కస్టమర్లు వాపోతున్నారు. పండుగ ఆఫర్లు తో సోనోవిజన్ ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తుందని, సోనోవిజన్ షోరూమ్ లో నాసిరకం బ్రాండ్లు కొనకూడదని బయట కొన్ని షోరూమ్ ల లో రేట్లు తక్కువగా ఉన్నాయని, సోనోవిజన్ షోరూంలో రేట్లు బాగా ఎక్కువగా ఉన్నాయని,సోనోవిజన్ షోరూమ్ లో ఎలక్ట్రానిక్ వస్తువులు కొంటే మన ఇల్లు గుల్ల అయి, బ్యాంకు ఖాతాలకు బొక్క తప్పదని అది సోనోవిజన్ కాదు సోది విజన్ అని కస్టమర్లు వాపోతున్నారు.



# గర్భిణీలకు వేడుకగా సీమంతం

## వైఎస్సార్ కాలనీలో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవాలు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలు 1, 2లో శుక్రవారం అంగన్‌వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి, వారికి చీరలను అందజేశారు. సీమంతం కార్యక్రమానికి చీరలను అందించిన జాలిపర్తి గోపాలకృష్ణ కి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ సీ డీ పీ ఓ భానుమతి, సూపర్‌వైజర్ మేరీ హెలెన్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఏ ఎన్ ఎమ్ లు, ఆశా కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గర్భిణులు, తల్లులు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం పట్ల అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్రను సీడీపీఓ భానుమతి వివరించారు.

# మహాత్మా గాంధీ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం: విక్కుర్తి



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం చల్లపల్లిలోని మహాత్మా గాంధీ స్మృతి వనంలో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చల్లపల్లి లోని నారాయణరావు నగర్‌లో గాంధీ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు.అనంతరం విక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ సత్యం, అహింస, శాంతి మార్గాలను ఆయుధాలుగా చేసుకుని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారని అన్నా రు. సామాన్య ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేసి, దేశ ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించిన మహనీ యుడు గాంధీజీ అని పేర్కొన్నారు. ఆయన చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా



నిలుస్తున్నాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి



మచిలీపట్నం,
ప్రజాభూమి ప్రతినిధి :
మచిలీపట్నంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, పాఠకులతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీరం వెంకటరమణ మాట్లాడుతూ.. సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని భారత స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. ధర్మం, శాంతి, సత్యం, అహింస మార్గాల్లో గాంధీజీ చూపిన బాట నేటికీ సమాజా నికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారత ప్రజలను ఏకం చేయడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని, శాంతియుత నిరసనలు, శాసనోల్లంఘన ఉద్యమాల ద్వారా అహింసాయుత పోరాటాన్ని ముందుకు నడిపారని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా శాంతి, సహనం, అహింస విలువలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా గుర్తించిందని పేర్కొన్నారు.అసిస్టెంట్ లైబ్రేరియన్ కె.వి.వి.ఎన్. బసవేశ్వరరావు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ త్యాగాలను స్మరించుకోవడంతో పాటు సత్యం, అహింస, న్యాయం వంటి విలువల పట్ల ప్రతి ఒక్కరూ తమ నిబద్ధతను పునరుద్ఘాటించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న పాఠకులు మాట్లాడు తూ.. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘన నివాళులర్పించారు.

# బీసీ కులాలకు చట్టబద్ధ రక్షణ కల్పించాలి

## అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :
కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని కృష్ణా జిల్లా బి. సి సంక్షేమ సంఘ శేకుబోయిన సుబ్ర హ్మణ్యం అధ్యక్షతన మచిలీపట్నం కార్యాలయంనందు బీసీ సంక్షేమ సంఘ నాయకులు కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేసినారు .ఆంధ్రప్రదేశ్‌లోని 139 బీసీ కులాలకు సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో సముచిత ప్రాతిని ధ్యం కల్పించేందుకు శాశ్వత చట్టబద్ధ రక్షణ కల్పించాలని బీసీ వర్గాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేసి, ఆ తీర్మాన ప్రతిని పార్లమెంటుకు పంపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకువచ్చి బీసీల హక్కులకు చట్టబద్ధ భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.బీసీలకు సంబంధించిన అంశాల్లో కేవలం ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు), ప్రకటన లు లేదా తాత్కాలిక నిర్ణయాల ద్వారా శాశ్వత



పరిష్కారం లభించదని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 139 బీసీ కులాలు, ఇతర వెనుకబడిన వర్గాలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలగాలంటే పార్లమెంట్ ద్వారా చట్టం చేయడం అవసరమని స్పష్టం చేశారు.దేశంలోని పలు రాష్ట్రాల్లో బీసీలకు అధిక శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న విషయాన్ని వారు ప్రస్తావించారు. కొన్ని రాష్ట్రాల్లో 60 శాతం, 70 శాతం, 80 శాతం వరకు రిజర్వేషన్లు అమలవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీల జనాభా, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు సముచిత అవకాశాలు దక్కేలా రిజర్వేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.రాష్ట్రంలోని 139 బీసీ కులాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపడం ద్వారా సమస్యను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టి బీసీలకు రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని అన్నారు.ఈ అంశంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో చర్చించి, బీసీలకు సంబంధించిన డిమాండ్లను కేంద్రం ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో బీసీల హక్కులకు అనుకూలంగా చట్టం తీసుకువచ్చేందుకు కృషి చేస్తే రాష్ట్రంలోని 139 బీసీ కులాలు ప్రభుత్వానికి అండగా నిలుస్తాయని వారు తెలిపారు.బీసీలకు శాశ్వత ప్రయోజనం కలిగించేలా రాజకీయాలకు అతీతంగా ఈ అంశాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన తగిన ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జన్ను గోవిందు,భోగి రెడ్డి సుభాని,నరిశెట్టి రత్తయ్య,పి సాంబయ్య, నీల పాల కృష్ణ, బి నాగరాజు,దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 3 అక్టోబరు 2026


## గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి

-ఎమ్మెల్యే చింతమనేని



ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు

అహింస, శాంతి, సత్య మార్గాల్లో సాగి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీ కీలక పాత్ర పోషించారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పెదవేగి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి "జోహార్ మహాత్మా గాంధీ" అంటూ నినాదాలు చేశారు. గాంధీజీ చూపిన అహింసా మార్గం నేటి తరానికి ఆదర్శమని, ఆయన కలలుగన్న గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛత సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పలువురు స్థానిక కూటమి నాయకులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

## దెందులూరు లో పోలీసు సిబ్బందికి దేహదారుఢ్యం కొరకు కవాతు.



ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు

పెదవేగి ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజశేఖర్ యొక్క ఆధ్వర్యంలో దెందులూరు ఎస్ఐ వెంకట కుమార్ దెందులూరు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు శిక్షణ ను నిర్వహించారు.ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు డీఎస్పీ కె వి వి ఎన్ వి ప్రసాద్ యొక్క ఆదేశాల మేరకు, పెదవేగి ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజశేఖర్ యొక్క ఆధ్వర్యంలో దెందులూరు ఎస్.ఐ. వెంకట కుమార్, దెందులూరు పోలీస్ స్టేషన్ సిబ్బందితో కవాతుల నిర్వహించి సిబ్బంది యొక్క దేహదారివ్యం మనోస్థైర్యం కల్పించేలాగా కవాతును నిర్వహించిన అనంతరం కేసుల యొక్క దర్యాప్తు సమయంలో పోలీసు సిబ్బంది నిర్వహించే విధివిధానాలు పై క్షేత్రస్థాయిలో దర్యాప్తు లో పాటించవలసిన మెలకువలను గురించి ఎస్ఐ గారు సిబ్బందికి అవగాహనను కల్పించినారు.నేరాల దర్యాప్తులో సాంకేతిక చట్టపరమైన నాణ్యతను పెంచేందుకు, క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది మరింత అప్రమత్తంగా, నైపుణ్యంతో వ్యవహరించేలా దెందులూరు పోలీసులు ఈ సరికొత్త శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర ఆదేశాల మేరకు, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ వై. ప్రసాద్ రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జి. ముని రాజా ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అడ్మిన్ ఎస్పీ వై.ప్రసాదరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్ బందర్‌లో జన్మించిన గాంధీజీ, సత్యం, అహింస, ధర్మం, సేవలను తన జీవితాంతం ఆచరించారని ఈ సందర్భంగా కొనియాడారు.స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలకు నాయకత్వం వహించి, సామాజిక సమానత్వం, పరిశుభ్రత, పేదల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు.ప్రజల పట్ల గౌరవం, న్యాయం పట్ల నిబద్ధత, బలహీన వర్గాల పట్ల సానుభూతి, నిజాయితీ, క్రమశిక్షణ వంటి గాంధీజీ ఆశయాలు పోలీసు సేవకు మార్గదర్శక సూత్రాలుగా ఉండాలని సూచించారు.అనంతరం అదనపు ఎస్పీ అడ్మిన్ వై.ప్రసాదరావు సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వెంకటేష్, ఏ ఆర్ ఎస్ ఐ లు సిబ్బంది, పోలీస్ ప్రధాన కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో హీల్‌కు ద్వితీయ స్థానం

-సామాజిక సేవా విభాగంలో సీబీఎస్ఈ పాఠశాలల్లో విశిష్ట గుర్తింపు



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

భారతదేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహణలో ఉన్న 33,163 సీబీఎస్ఈ పాఠశాలల్లో ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ పాఠశాల సామాజిక సేవా విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ అత్యుత్తమ పాఠశాలగా విశిష్ట గుర్తింపు పొందిందని హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ తెలిపారు. ఢిల్లీలోని ద్వారకా కేంద్రంలో గతవారం నిర్వహించిన జాతీయ సీబీఎస్ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో బ్రెయిన్‌ఫెడ్ సంస్థ వ్యవస్థాపకుడు కె.వి. బ్రాహ్మం చేతుల మీదుగా హీల్ అకడమిక్ డైరెక్టర్ యు. మణికుమారి, ఉప ప్రధానోపాధ్యాయుడు ఎం. హరీష్ పురస్కారాన్ని స్వీకరించారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వేలాది మంది నిరుపేద బాలలకు ఉచిత విద్య, వసతి సౌకర్యాలను కల్పిస్తూ విద్యారంగంతో పాటు సామాజిక సేవలోనూ హీల్ పాఠశాల విశేష సేవలందిస్తోందన్నారు. సీబీఎస్ఈ పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, పాలక మండలి సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు ఎం. కవిత, ఉపాధ్యాయ బృందం, సిబ్బందిని అభినందించారు. హీల్ పాఠశాల అభివృద్ధికి నిరంతరం ఆర్థిక సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## వాకర్స్ క్లబ్, పాలకొల్లు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుక

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



వాకర్స్ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కొత్త కుళాయి చెరువు వద్ద మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర రావు మరియు సభ్యులు బాపూజీ చిత్రపటానికి పువ్వులు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కానుకొలను శ్రీనివాసరావు గాంధీ మహాత్ముని విశిష్ట వ్యక్తిత్వాన్ని, సత్యాగ్రహం,అహింసా విధానాల తో పోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన తీరును వివరించారు. క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ వాకర్స్ చే శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భం గా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించిన రాయకుదురు ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు ను క్లబ్ తరపున సత్కరించారు. కార్యక్రమం లో క్లబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, కోశాధికారి పోతుల ఉమా శంకర్ రావు, నంబూరి గంగాపవన్, ధనాని సూర్య ప్రకాష్, దాసరి వెంకటేశ్వరరావు, కాపా చిరంజీవి, మేకా త్రిశూలపాణి, చామా శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో వాకర్స్ పాల్గొన్నారు. స్వీట్స్ పంపిణీ తో వేడుక ముగించారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌లో నమో సేవా గాథ

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



మహాత్మా గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పాలకొల్లు కెనాల్ రోడ్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సమరయోధులు అందించిన సేవలను స్మరించుకున్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'నమో సేవా గాథ' కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బుర్రకథ కళా ప్రదర్శనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాజీవితం, దేశ సేవకు సంబంధించిన అంశాలను కళాకారులు బుర్రకథ రూపంలో ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొల్లి కొండ ప్రసాద్, ఉన్నమట్ల కబర్ది, రావూరి సుధ, జక్కంపూడి కుమార్, వేరుకొండ దుర్గాప్రసాద్, గవర పవన్ నాయుడు, చెరుకూరి శ్రీనివాసరావు, నాళం బాబీ, బొక్కా నరసింహమూర్తి, పసుపులేటి నందబాబు,పలివెల భాస్కర్,చందాని లక్ష్మీనారాయణ, బేతిరెడ్డి మల్లికార్జున రెడ్డి,కోరాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం



బుట్టాయిగూడెంలో జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి, మాజీ ప్రధానమంత్రి, గౌరవనీయులు లాల్ బహుదూర్ శాస్త్రి 122వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్య పోరాటంలో అహింస మరియు సత్యాగ్రహం అనే రెండు ఆయుధాలతో పోరాటం చేశారని గుర్తు చేశారు. ఉప్పు సత్యాగ్రహం,దండి మార్చ్, సహాయ నిరాకరణ ఉద్యమం, విదేశీ వస్తువుల బహిష్కరణ,క్విట్ ఇండియా ఉద్యమం లాంటి కార్యక్రమాలతో భారతజాతిని ఏకతాటిపై నిలిపిన గొప్ప నాయకుడిగా గాంధీ మహాత్ముని కొనియాడారు. భారత్ మేకింగ్ ఇండియా నినాదంతో లోకల్ ఫర్ లోకల్ నినాదంతో స్వదేశీ వస్తువులను వాడాలనే నినాదంతో ముందుకు సాగుతున్న తరుణంలో జాతిపిత మహాత్మా గాంధీ ఈ జాతికి సూచించిన ఆచరణీయమైన అంశాలను ప్రతి ఒక్కరు పాటించాలని, సహోదరు భావాన్ని చాటి చెప్పాలని, కుల మతాలకు అతీతంగా భారతజాతి కలిసిమెలిసి జీవిస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి గూట్ల ధర్మరాజు, నందిన సతీష్, ఎల్ఆర్ కృష్ణ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగిరిపల్లి ప్రాథమిక వైద్యశాలకు స్వచ్ఛ హాస్పిటల్ అవార్డు

### జిల్లాస్థాయి పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ టీనా



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఏలూరులోని సి.ఆర్.రెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్వచ్ఛ హాస్పిటల్ అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ టీనా కు ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ టీనా మాట్లాడుతూ, ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ పురస్కారం వైద్యులు, సిబ్బంది సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా పేర్కొన్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ టీనాను ఈదర, సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్, డాక్టర్ సాయి సుధ, డాక్టర్ మంజుల దేవి, డాక్టర్ సంధ్యా ప్రియా, డాక్టర్ మహితతో పాటు ఆసుపత్రి సిబ్బంది, వెల్‌నెస్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## గాంధీజీ ఆశయాలను సాకారం చేద్దాం: రెడ్డి అప్పలనాయుడు

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



జాతిపిత మహాత్మా గాంధీ అన్ని తరాలకు ఆదర్శప్రాయుడని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోన్--2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు.గాంధీ జయంతి,మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఏలూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. సత్యం, అహింస మార్గంలో గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత,నిజాయితీ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని,ఆయన ఇచ్చిన "జై జవాన్--జై కిసాన్" నినాదం స్ఫూర్తిదాయకమన్నారు.కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నారా శేషు,రాఘవయ్య చౌదరి, సిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీ, శాస్త్రి ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకం

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి స్థానిక పెద్ద కొఠాయి సెంటర్లోని పూజ్య బాపూజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద శుక్రవారం మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని ఆగిరిపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చలువాది వెంకటరత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ సత్యం, అహింసా మార్గాలను అనుసరిస్తూ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రజలకు సత్యనిష్ఠతో కూడిన జీవన విధానాన్ని చూపించారని తెలిపారు. లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత, నిజాయితీ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని, ఆయన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ, శాస్త్రి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించి దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జూలూరు చంద్రమౌళీశ్వరరావు, మడుపల్లి గోపాల్, వై శ్రీరామచంద్రమూర్తి దూపగుంట్ల ప్రసాద్, పాతూరు రవి, చక్రధర్, సగ్గుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి : ఎంపిపిఎస్



ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి.

మండలంలోని తుమ్మగూడెం ఎంపీపీ ఎస్ ఉర్దూపాఠశాల విద్యార్థులు జాతిపిత మహాత్మా జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసి, విగ్రహాన్ని పూల మాలతో అలంకరించడం జరిగిందఅని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంప వెంకట్రావు తెలియజేసినారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఆయన పాటించిన సత్యం, అహింస సిద్ధాంతాలు మానవ జీవితాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉండాలని ఉంటాయని, ఆయన బాటలో నడవడం వలన మానవులు హింసను వీడి శాంతి, ప్రేమ, సోదర భావాలు పెంపొందుతాయని విద్యార్థులకు తెలియజేసినారు. కాబట్టి పెద్దలకు తల్లిదండ్రులకు, అందరికీ జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియ చేసినారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పెద్దలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంప వెంకట్రావు పాల్గొన్నారు .

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలు.



ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు

ఆదిత్య డిగ్రీ కళాశాలలో మహాత్మా గాంధీజీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ సత్యం, అహింసా సిద్ధాంతాలను పాటిస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫణికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. హరి బాబు, ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ఎ ఏం సి మాజీ చైర్మన్ గాంధీభవన్ రాజు పుట్టినరోజు వేడుకలు

-శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



ప్రజా భూమి ప్రతినిధి-పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మాజీ ఏఎంసీ చైర్మన్, ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ సంస్థఅధ్యక్షులు,గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన నేత బోనం వెంకట నరసయ్య చినబాబు, సిఐ కోలా రజనీ కుమార్, ఎస్సై పృథ్వీరాజ్,ఆక్వా రైతు సంఘం నాయకులు, కాస్మోక్ కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ సంస్థ ప్రతినిధులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## బుట్టాయగూడెం పంచాయతీకి జిల్లాస్థాయి స్వచ్ఛ అవార్డు.



ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

మండలంలోని బుట్టాయగూడెం పంచాయతీ జిల్లాస్థాయి స్వచ్ఛ అవార్డు 2026 అందుకున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. జ్యోతి తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం ఏలూరు లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డ్స్ జిల్లా స్థాయి 2026 బుట్టాయగూడెం గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి జె.కిరణ్ కుమార్ అందుకున్నారు. బుట్టాయగూడెం పంచాయతీకి స్వచ్ఛ అవార్డు సాధించడంలో కృషిచేసిన పంచాయితీ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్ ను డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం రాజు, డివిజనల్ పంచాయతీ అధికారి ఏ వి.సుబ్బారాయన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. జ్యోతి, ఎఫ్ టి సి టి పి ఆర్ సి గుడివాడ నాగేశ్వరావు, వివిధ పార్టీల నేతలు, గ్రామస్తులు, తదితరులు అభినందించారు.

# రుద్రం కోటలో గాంధీ జయంతి వేడుకలు

- ప్రతి ఒక్కరు గాంధీ మార్గంలో నడవాలి
- రుద్రంకోట కూటమి నాయకుల ఆకాంక్ష



**ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.**
సమాజంలో ప్రతి ఒక్కరు గాంధీ మార్గం అయిన సత్యం, ధర్మం, అహింస బాటలో నడవాలని రుద్రంకోట కూటమి నాయకులు ఆకాంక్షించారు . గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం రుద్రంకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్ డబుల్యూ ఎస్ జగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళిళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో ఒకరయిన గాంధీని ప్రజలు మహాత్ముడు, జాతిపిత అని పిలుస్తారు. అందుకు కారణం సహాయ నిరాకరణ, సత్యాగ్రహము అతని ఆయుధాలు అని అన్నారు. తరువాత గ్రామంలోని వివిధ శాఖలా వారు పనుల వివరాలను చదివి గ్రామస్థులకు వినిపించడం జరిగింది. గ్రామ అభివృద్ధి గురించి కూటమి నాయకులు మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం తో గ్రామాలు అభివృద్ధి జరుగుతుందని,ఏపీ లో పల్లె ప్రగతి 3.0తో రూపురేఖలు మారానున్నాయి అని అన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వంలో రుద్రంకోట గ్రామం ఎంతో లబ్ది పొందుతుందని ప్రతి ఒక్క గ్రామ సమస్యను పరిష్కరించడం జరుగుతుంద అన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, మరియు కూటమి నాయకులు కొవ్వల క్రాంతి కుమార్, శావిలి సుభాష్ చంద్ర బోసు,అమరవరపు వెంకటేశ్వర్లు, కొఠారి సత్యనారాయణ, గుండారపు శివ క్రిష్ణ, పూజారి సీతారామరాజు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**
గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య పరిరక్షణతో పాటు నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఎంపీడీవో అబ్దుల్ సలాం అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యం లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర, స్వచ్ఛ రథం, దసరా ఆఫర్, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నిర్వహణ కేంద్రాలకు తరలించడం, నీటి ఎద్దడి నివారణ, నీటి పొదుపు, పీ4 కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి వృథాను అరికట్టి భవిష్యత్ అవసరాలకు నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించి, నీటి సంరక్షణపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని ఈదులగూడెం, చొప్పరమెట్ల, పోతవరపాడు, చిన్న ఆగిరిపల్లి గ్రామాల్లో జరిగిన ప్రత్యేక గ్రామసభల్లో ఎంపీడీవో అబ్దుల్ సలాం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రత్యేక అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాభూమి ప్రతినిధి-కుక్కునూరు**
అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ ఎర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కుకునూరు మండలంలోని పెదరాయగూడెం, అమరవరం, దామరచర్ల గ్రామాల్లో అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు గాంధీ విగ్రహాలకు అంగన్వాడీ సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు .ఈ సందర్భంగా ఎర్నాం సాయికిరణ్ మాట్లాడుతూ 2019 నుంచి అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్ల వేతనాలు పెరగలేదని ఈ కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. అంగన్వాడీలకు వివిధ యాపులు తీసుకువచ్చి పని భారం పెంచారని తెలిపారు. వేతనాల పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించిన నేపథ్యంలో 2024 జులైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ కాపీ ఇచ్చిన ఇప్పటివరకు అమల చేయలేదన్నారు. 2026 మార్చి రెండున నిర్వహించిన ఆందోళన అనంతరం మార్చి 10న ఐసిడిఎస్ మంత్రి అంగన్వాడీ యూనియన్ నాయకులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన నేటికి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. అంగన్వాడి పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీలు వారి కుటుంబ సభ్యులకు వితంతు వృద్ధప్య పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అర్హులైన అంగన్వాడీ కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అంగన్వాడి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వేతనాల పెంపుపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎర్రం సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ కుకునూరు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, వందన ,మాధవి, దుర్గా, ప్రబామణి అంగన్వాడీలు లక్ష్మీకాంత, రాధ, సంధ్య, వసుంధర ,యేసు మని ,వీణ ,భారతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతకు గుర్తుగా ప్రతిభా పురస్కారం

-జిల్లాలో 70 మందికి.



**ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా**
స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, పారిశుద్ధ్యం రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 70 మంది వ్యక్తులు, సంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం ఏలూరు లోని సర్. సి.ఆర్.రెడ్డి కళాశాల ఆడిటోరియం లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందించారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావులు విజేతలకు ప్రశంసాపత్రం, మెమెంటోలను అందించారు.

## సర్‌పై కన్నెర్ర



**ప్రజాభూమి ప్రతినిధి-కుక్కునూరు**
దేశంలో ఓట్లు చోరీ అయ్యేలా చేపట్టిన సార్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ కుక్కునూరు మండలంలో వామపక్షాలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు కొద్దిసేపు ఆందోళన చేశారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించడం కోసమే కేంద్ర ప్రభుత్వం సర్ ప్రక్రియ విధానానికి పూనుకొందని తక్షణమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాత్మా గాంధీ చిత్రపటానికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, కురాకుల బాబురావు , నాగేష్ ,సోమరాజు ,ఉంగా, మారయ్య ,సతీష్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రరావు, మండల కార్యదర్శి ఎర్నం సాయికిరణ్ , వలీపాషా, బాబు, రమేష్ ,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

## మంత్రి కొలుసు పార్థసారథి



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**
నూజివీడు పట్టణానికి, జిల్లాకి రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన కోట మహిషాసుర మర్ధని అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలోని పైడి అప్పారావు కళ్యాణ మండపంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ. పార్టీలకు, అతీతంగా జరిగే అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. కమిటీ సభ్యులందరూ సమన్వయంతో, సమిష్టిగా కృషిచేసి మైసూరు అమ్మవారి ఉత్సవాలను తలదన్నేలా ఉత్సవాలు జరగాలని దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లా, రాష్ట్రం నలుమూలలా అమ్మవారి ప్రాముఖ్యతను, గొప్పదనాన్ని చాటి చెప్పేలా ఉత్సవాలు జరగాలని అన్నారు. మంత్రి హామీ
సంబరాలకు అవసరమైన ఖర్చులో కొంత మేర కొలుసు పెదరెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 3 లక్షలు మరియు తన స్నేహితుల ద్వారా లిరూ. 4 లక్షలు అందజేస్తానని హామీ ఇచ్చారు. 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో మరింత ఘనంగా నిర్వహించి దేశంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. వచ్చే ఏడాది సంబరాలకు అవసరమైతే రూ. 5 కోట్లు అయినా ప్రభుత్వం నుండి మంజూరు చేయించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా తెలుగు సినీ ప్రముఖులైన అక్కినేని నాగార్జున, చిరంజీవి, వెంకటేష్ వంటి ప్రముఖులను నూజివీడు సంబరాలకు తీసుకొచ్చి ఘనంగా సత్కరించి రంగరంగ వైభవంగా అమ్మవారి సంబరాలను సతీ సమేతంగా అందరూ జరుపుకోవాలని మంత్రి అన్నారు. కమిటీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ, పోలీస్, రవాణా, మున్సిపల్, శానిటేషన్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అభివృద్ధి కమిటీ సభ్యులందరూ కలిసి సమన్వయంతో సమిష్టిగా కృషిచేసి అమ్మవారి సంబరాలుఅంబరాన్నంటేలా జరుపుకోవాలని, అందరి సహాయ సహకారాలు అందించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, మున్సిపల్ కమిషనర్ ఫీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల ఆశయసాధనకు బిజెపి పునరంకితం



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**
జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల ఆశయసాధనకు పునరంకితమౌతామని నూజివీడు బిజెపి శ్రేణులు ప్రతిజ్ఞ బునారు. గాంధీ, శాస్త్రీల జయంతి సందర్భంగా స్థానిక చిన్నగాంధీ బొమ్మ సెంటర్ లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా భారత మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహుదూర్ శాస్త్రి జయంతినిపురస్కరించుకొని బిజెపి శ్రేణులు అయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు మహనీయుల దేశానికీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపూడి రాజశేఖర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు శివరాజు వసుధరదేవి,బిజెపి జిల్లా కోశాధికారి, బి ఎల్ ఏ వన్ మాటూరి రవికాంత్, కొండయ్య సత్రం చైర్మన్ మాటూరి ప్రసాద్,ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాగంటి వాసు మాస్టారు, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ మానూరి ప్రసాద్,జిల్లా నాయకులు భావరాజు పుల్లారావు, అంబటి మల్లేశ్వరరావు, రాయపాటి లీలా విజయ జ్యోతి, పట్టణ ప్రధాన కార్యదర్శులు దోసపాటి మల్లిఖార్జున జగదీష్, దద్దనాల రవికిషోర్, ఉపాధ్యక్షురాలు అనంతలక్ష్మి పార్టీ నాయకులు కంచర్ల కృష్ణ,షేక్ రఫీ, దూస సత్యనారాయణ, విజయలక్ష్మి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**
నూజివీడు పట్టణం గాంధీనగర్ లో సుమారు 5 ఎకరాల 30 సెంట్ల కామన్ సైట్ గతంలో పార్కు కోసం కేటాయించగా ఇప్పటివరకూ ఎలాంటి అభివృద్ధి లేక నిరుపయోగంగా ఉన్న విషయం తెలుసుకున్న మంత్రి కొలుసు పార్థసారథి, మూడు రోజుల క్రితం పార్కు అభివృద్ధి పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు మూడు రోజుల నుండి అభివృద్ధి పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది పనులను, పార్క్ ప్రాంగణాన్ని మంత్రి నేడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాంగణం మొత్తం పరిశీలించి దాని ఆవశ్యకత, చరిత్రను అధికారులను అడిగి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. స్థానికుల విజ్ఞప్తి ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో దగ్గరలో ఎలాంటి పార్కు లేదని, పార్కు అభివృద్ధి చేస్తే అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని, పట్టణ ప్రజలకు ఆహ్లాదంగా ఉంటుందని త్వరలో అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. మంత్రి హామీపార్కు అభివృద్ధికి తగినంత మూలధనం, మౌలిక సదుపాయాలు సాధ్యమైనంత త్వరలో సమకూర్చి అభివృద్ధి చేసే బాధ్యత నాదని, అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ప్రభుత్వం నుండి అందజేస్తానని, పార్కుకు ఉన్న అడ్డంకులు త్వరలో తొలగించి నిధులు అందిన వెంటనే అభివృద్ధి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వట్లూరు బి ఆర్ అంబేద్కర్ గురుకులానికి ప్రతిభ పురస్కారం



**ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు.**
స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, పారిశుద్ధ్యం రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచినందుకుగాను గుర్తింపుగా ఏలూరు జిల్లా పెదపాడు మండలం వట్లూరులో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు ప్రతిభ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ కె వైట్రీ సెల్వి, కళాశాల ప్రిన్సిపల్ దాసరి మేరీ ఝాన్సీరాణికి సి ఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలకు పురస్కారం లభించడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు

## విబిజి రాంజీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి.



**ప్రజాభూమి ప్రతినిధి-చాట్రాయి**
ప్రతి చేతికి పని - ప్రతి కుటుంబానికీ భరోసా, ప్రతి గ్రామానికీ అభివృద్ధి - ప్రతి ఇంటికీ సంతోషం ఇచ్చే పథకమే “వీ బీ జీరామ్ జీ”అని నూజివీడు నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాస రావు అన్నారు. శుక్రవారం చాట్రాయి మండలం, చనుబండ గ్రామంలో స్వర్ణ గ్రామం 1 వద్ద “వీ బీ జీరామ్ జీ” ప్రారంభ గ్రామ సభ లో చనుబండ పీ ఏ సీ ఎస్ చైర్మన్ మోరంపూడి శ్రీనివాస రావు ముఖ్య అతిధిగా పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించబడింది. జాతి పిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఉపాధి కూలీల జీవనోపాధికి, గ్రామ మౌళిక వసతుల కల్పన కోసం,చేయవలసిన పనులు గుర్తించాలని మోరంపూడి అన్నారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామానికి అవసరమైన ఉపాధి పనులు గుర్తించాలని ఎఫ్ ఏ కి, టీ ఏ కి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఏ, టీ ఏ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీదిరాల మారేశ్వర రావు, కందుల కృష్ణ, బుర్రి శ్రీకర్, నెక్కకళపు వెంకటేశ్వర రావు, మోదుగు ముత్తయ్య, విస్సంపల్లి రాజా, స్వర్ణ గ్రామం 2 కార్యదర్శి గోపాలకృష్ణ, టీ ఏ కృష్ణ, ఎఫ్ ఏ తాతయ్య బాబు, మోరంపూడి రమేష్, బొట్టు దుర్గారావు, సచివాలయాల సిబ్బంది, వీ ఎం బీ కె లు, ఉపాధి కూలీలు, గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## ఎంఎల్సి ఎన్నికల్లో (మున్నూరు)కాపులకు అన్యాయం.

-పులి శ్రీరాములు తీవ్ర ఆగ్రహం.

**ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.**



తెలంగాణ శాసన మండలి కి రెండు స్థానాలకు జరుగనున్న పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల్లో రెండు స్థానాలకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని ఎంపిక చేయటం పట్ల కాపుసంక్షేమ సేవాసంఘ ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల అద్యక్షులు పులి శ్రీరాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక స్థానానికైనా కాపు/బీసి/ఎస్సీ/మైనారటీ వర్గాల వారికి కేటాయించాలని పులి శ్రీరాములు డిమాండ్ చేశారు. తన నిర్ణయం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఏమి సందేశం ఇస్తారు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గణనీయంగా ఉన్న కాపు/ మున్నూరు కాపులకు జరుగుతున్న విధివిధానాలను గుర్తించి గవర్నర్ కోటాలో అయినా న్యాయం జరిగేలాగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పులి శ్రీరాములు డిమాండ్ చేశారు.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకున్న డాక్టర్ నవ్య జీవన్.



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**
గాంధీ జయంతి సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డును లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం. నవ్య జీవన్ జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ. రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్పర్సన్ పీతల సుజాత. జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బాల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ పిహెచ్ సి సిబ్బంది సహకారంతో అవార్డు రావడం జరిగిందని సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ జి దినేష్. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు. పీహెచ్ఎన్ పి.ఎలిజిబెత్. సీనియర్ అసిస్టెంట్ రమేష్ బాబు. ఫార్మసిస్ట్ పివి స్వామి. సూపర్వైజర్లు ఎస్.కె అమలేశ్వరరావు. గంగాభవాని. ఉదయచందర్. పి హెచ్ సి సిబ్బంది. హెల్త్ అసిస్టెంట్లు. ఏఎన్ఎంలు. ఎం ఎల్ హెచ్ పి లు. ఆశా కార్యకర్తలు తదితరులు డాక్టర్ నవ్య జీవన్ కి అభినందనలు తెలియజేశారు.

## నూజివీడులో గాంధీ జయంతి రోజున కూడా మాంసం అమ్మకాలు.

-మన్నించు మహాత్మా.



**ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.**
నూజివీడు పట్టణంలో గాంధీ జయంతి రోజున కూడా యదేచ్ఛగా మాంసం విక్రయాలు దుకాణదారులు నిర్వహించారు. అహింస ద్వారా స్వతంత్రం తెచ్చిన గాంధీజీ జయంతి రోజున మాంసం విక్రయంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్వతంత్ర పోరాటంలో గాంధీ చేసిన సేవలకు గుర్తించి ప్రజల ఇవ్వాల్సిన కనీస మర్యాదలు కూడా వ్యాపారదారులకు కానరావడం లేదు. పట్టణంలో యదేచ్ఛగా మాంసం అమ్ముతున్న దుకాణాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడంతో ఈ తంతుగా సాగింది. మాంసం దుకాణదారులు నిరభ్యంతరంగా మున్సిపల్ అధికారుల కు మామూళ్ళు ఇచ్చామని మాకు ఎటువంటి జరిమానాలు గాని విధించారని బహిరంగంగానే తెలుపుతున్న షాపుల యాజమాన్యం. దీనిపై పట్టణంలో పలువురు తీవ్ర విమర్శలు గుప్పెత్తిస్తున్నారు. గ్రామంలో జరిగిన మాంసం అమ్మకాలను నివారించిన అధికారులు ఎవరూ లేరని చెప్పవచ్చు.



## ఖైదీలు సత్ప్రవర్తన కలిగి జనజీవన స్రవంతిలో కలవాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు సత్ప్రవర్తన కలిగి తిరిగి జనజీవన స్రవంతిలో కలవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీజీ 157 వ జయంతి సందర్భంగ అనంతపురం జిల్లా సెంట్రల్ జైల్ నందు ఏర్పాటు చేసిన ఖైదీల దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీలకు మంచి మంచి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఖైదీలందరూ సత్ప్రవర్తన కలిగి త్వరగా జైలు జీవితం నుంచి జనజీవన స్రవంతిలో కలిసేందుకు కృషి చేయాలన్నారు. ఇక్కడ జరిగే లైవ్లీ హుడ్ యాక్టివిటీస్ లో ప్రతి ఒక్కరూ పాల్గొని జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత తన కాళ్ళ మీద తాము నిలబడి స్వయంగా జీవితం గడిపే ప్రయత్నం చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం తరఫునుంచి చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఖైదీలు జైలు జీవితం అనంతరం బయటకు వచ్చిన తర్వాత పరిశ్రమలు స్థాపించుకుని ఉన్నత స్థాయికి వెళ్లేందుకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మహాత్మా గాంధీ జైలు జీవితం గడిపే సమయంలో ఎన్నో పుస్తకాలు చదివి అపారమైన జ్ఞానాన్ని పొందడం జరిగిందని అదే విధంగా ఖైదీలు అందరూ ఇక్కడ ఉన్న లైబ్రరీలో మంచి పుస్తకాలు చదివి ఉన్నతమైన పౌరులుగా ఎదగాలన్నారు. ఖైదీలకు జిల్లా పోలీసు యంత్రాంగం ద్వారా కావలసిన పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ద్వారా ఖైదీలు ఉచిత న్యాయం పొందవచ్చునని ఈ అవకాశాన్ని పేద ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైలు అధికారులు ఖైదీల నేర ప్రవృత్తి వదిలి పరివర్తన చెంది సత్ప్రవర్తనతో తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపే విధంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఖైదీలు పోలీస్ అధికారులు ఇచ్చే సూచనలు సలహాలు తప్పక పాటించాలన్నారు. ఖైదీలు తెలిసి తెలియక చేసిన తప్పుకు కుటుంబ సభ్యులందరినీ వదిలి జైలు జీవితం గడుపుతున్నారని ఒకసారి తమ కుటుంబ సభ్యులను గుర్తుచేసుకొని బయటికి వచ్చిన తర్వాత సమాజంలో మంచి ప్రవర్తనతో ప్రతి ఒక్కరితో కలిసి మెలిసి జీవించాలని కోరుకుంటున్నానన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్, మాట్లాడుతూ జిల్లాలో లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ద్వారా ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతోందన్నారు. ఇక్కడ ఉన్న ఖైదీలు ఉచిత న్యాయ సేవలు పొందేందుకు పోలీస్ అధికారుల ద్వారా తమను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమానికి ముందు అతిథులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఇలియాస్ భాష, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్, డిడిఎంకే అనురాధ, జిల్లా జైలు సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, జైలు అధికారులు, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

## 2027-28 ప్రణాళికలో భాగంగా గ్రామ సభలు

ప్రజాభూమి, పుట్లూరు.



అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా వి బి జి రాంజీ లో 2027-28 ప్రణాళిక లో పనులు గుర్తింపు లో భాగంగా గ్రామ సభలను నిర్వహించడం జరిగినది. ఈ గ్రామ సభల యంద ఎంపీడీవో అలివేలమ్మ కంది కాపుల గ్రామపంచాయతీ నందు గ్రామ సభ నిర్వహించి ఉపాధి హామీ పనుల గురించి మరియు నీటి వినియోగం పైన ప్రతిజ్ఞ చేయడం జరిగింది . అదేవిధంగా చెర్లోపల్లి గ్రామపంచాయతీ నందు కూడా గ్రామ సభకు హాజరు కావడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ఎంపీడీవో మరియు ఏపీఓ తులసిప్రసాద్, ఈసీ అంజన్ కుమార్ ,సాంకేతిక సహాయకుల వెంగల్ రెడ్డి రెండు గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులుమరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు క్షేత్ర సహాయకులు మునీంద్ర మరియు హరినాథ్ స్థానిక నాయకులు బ్రహ్మయ్య ఉపాధి శ్రామికులు మహిళ సంఘ సభ్యులు హాజరై ఈ సంవత్సరం జరిగినటువంటి పనుల గురించి చర్చించి వచ్చే ఆర్థిక సంవత్సరం 2027-28 లో భాగంగా పనుల గుర్తింపు గురించి కన్వర్జెన్స్ డిపార్ట్మెంట్లో పనుల గురించి చర్చించడం జరిగింది.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పుట్లూరు విద్యార్థులు

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి హర్ష, పి ఆదిత్య ఎస్ జి ఎఫ్ ఐ జిల్లాస్థాయి బాక్సింగ్ క్రీడా పోటీలలో అండర్ 14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎన్నికైనట్లు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎంఈఓ లు శ్రీదేవి, ప్రేమ్ కుమారులు కోరారు. పుట్లూరు మండల ఖ్యాతిని పెంచాలని పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు కోరారు.

## వైసీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి

### - ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాగోళ్ల ప్రభుదాస్

ప్రజా భూమి నార్పల



మండల కేంద్రంలోని గాంధీ సర్కిల్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాగోళ్ల ప్రభుదాస్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్రల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నేటి సమాజం కూడా నడవాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీజీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. సత్యం, అహింస, శాంతి విలువలను జీవితంలో ఆచరించడమే గాంధీజీకి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు మీనుగు రామాంజనేయులు, ఎట్టి తిరుపాలు, బూసి రామాంజనేయులు, తాడిమర్రి కుల్లాయి స్వామి, చిగిచెర్ల రామయ్య, జయకృష్ణ, కుల్లాయప్ప, పెద్దిరాజులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలి

### -పని భారం తగ్గించి వేతనాలు పెంచాలి

### -గాంధీజీకి విన్నవించిన కార్యకర్తలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



అంగన్వాడి కార్యకర్తలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం సిఐటి యూ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర సిఐటియూ పిలుపు మేరకు హిందూపురం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి విఆర్ రాము, హిందూపురం ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ, అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లకు 2019 నుండి ఇప్పటివరకు వేతనం పెరగలేదన్నారు. మరో వైపు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయయని, అంగన్వాడీలకు రకరకాల యాప్ లు తెచ్చి పనిభారం పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని అనేక పోరాటాలు చేసిన ఫలితంగా 2024 జులై నెలలో వేతనాలు పెంచుతామని, మినిట్స్ ప్రతి ఇచ్చారని, 2026 మార్చి2 ఆందోళన తర్వాత 10వ తేదీన ఐసిడిఎస్ మంత్రి అంగన్వాడి యూనియన్ నాయకులతో ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, అయితే నేటికీ పట్టించుకోలేదని వాపోయారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగస్తులకు పిఆర్సి వేస్తామని ప్రకటించినారని, అంగన్వాడి వారికి వెంటనే వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశా కార్యకర్తలు సెక్టర్ శైలజ, నాగమ్మ, సునందమ్మ, అరుణా, దేవి, హేమలత, మమత, రాజమ్మ, భవాని, సరోజమ్మ, జబీనా, టాటా ఏసీ యూనియన్ హిందూపురం నాయకులు మోహన్ గోపాల్, సివిల్ సప్లై యూనియన్ జిల్లా నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి ఘన నివాళి

### ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజా భూమి శింగనమల



అనంతపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు,అర్పించాను సత్యం, అహింస, శాంతి, సమానత్వం, సేవ వంటి విలువలను తన జీవితంలో ఆచరించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.స్వాతంత్ర్య సమరంలో అహింసా మార్గంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఆయన సేవలు దేశ చరిత్రలో,చిరస్థాయిగా నిలిచిపోతాయి.దేశ అభివృద్ధికి గ్రామాలే బలమైన పునాదులని గాంధీ విశ్వసించారు. గ్రామాలు స్వయం సమృద్ధిగా ఎదగడంతో పాటు ప్రజలే తమ గ్రామాల అభివృద్ధిలో,భాగస్వాములు కావాలన్నది ఆయన గ్రామ స్వరాజ్య ఆలోచన. గాంధీ ఆశయాలను కేవలం జయంతి స్మరించుకోవడం కాకుండా,సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా భావం వంటి విలువలను మన జీవితాల్లో ఆచరించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను అభివృద్ధి చేసి, బలమైన గ్రామీణ వ్యవస్థను నిర్మించేందుకు మనమంతా కలిసి ముందుకు సాగుదాం.

## ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యం

### -4న మెగా జాబ్ మేళా

### -సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా సూర్య ఫౌండేషన్, అక్షయ కల్పవృక్ష సేవాసమితి, నిపుణ హ్యూమన్ డెవలప్ మెంట్ సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు జ్ఞాన ప్రకాష్, గురునాథ్, కార్తీక్, చారు కీర్తి మాట్లాడారు. నిరుద్యోగ యువతను ఆదుకోవాలని ఉద్దేశంతో ఆయా సంస్థలు దేశంలోని 18 రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందూపురం ప్రాంతంలో నిరుద్యోగ యువతను ఆదుకోవాలని ఉద్దేశంతో ఈ జాబ్ మేళా ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 4వ తేదీన పట్టణంలోని ఎస్.డి.జి.ఎస్ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై కు చెందిన 50కు పైగా ప్రముఖ కంపెనీలు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్హత మొదలుకొని పీజీ స్థాయి వరకు చదువుకున్న నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15 వేలం నుండి రూ.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఐటిఈఎస్, కోర్ ఇంజనీరింగ్, బ్యాంకింగ్, ఫార్మా, రిటైల్, ఎఫ్.ఎం.సి.జి, మోర్ వంటి కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. హిందూపురం పరిసర ప్రాంతాల్లోని యువత ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం ఎందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, మిశ్రమల్, రమేష్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్‌కు శ్రీకారం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



రాయలసీమ అభివృద్ధి చరిత్రలో మరో కీలకమైన ముందడుగు పడింది. అన్నమయ్య జిల్లా మదనపల్లి, బి.కె పల్లి నుంచి "హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పాటు, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేసిన సందర్భంగా అనంతపురం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి పాల్గొన్నారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.1 లక్ష కోట్ల అభివృద్ధి ప్రణాళికను ప్రభుత్వం చేపట్టడం రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే కార్యక్రమం. ఉద్యానవన పంటలకు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అనంతపురం జిల్లా ఈ కార్యక్రమం ద్వారా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పంటల నాణ్యత, దిగుబడి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల సూచనలు, మార్కెటింగ్ సదుపాయాలు రైతులకు అందుబాటులోకి రావడంతో పాటు, వారి పంటలకు మెరుగైన ధర లభించేలా చర్యలు తీసుకోనున్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయంలో ఆధునిక మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల దిగుబడి పెంపు, మార్కెటింగ్ తదితర అంశాల్లో రైతులకు మరింత నైపుణ్యం అందే అవకాశం ఉందన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పరిధిలో 10 జిల్లాల్లో 200కు పైగా క్లస్టర్ల ద్వారా సుమారు 5,500 గ్రామాల్లో ఉద్యానవన సాగును విస్తరించడం, ప్రస్తుతం ఉన్న సుమారు 6 లక్షల ఎకరాల సాగును 15 లక్షల ఎకరాలకు పెంచడం వంటి లక్ష్యాలు నిర్దేశించారు. అదేవిధంగా పంటల రవాణా కోసం రహదారులు, సాగునీటి వసతుల విస్తరణ, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, విలువ జోడింపు కేంద్రాలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, పంట కోత అనంతర నష్టాలను తగ్గించి రైతులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించనున్నారు. కరువు సీమగా పేరొందిన రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతూ, రైతన్నల ఆదాయం పెంచి వారి ముఖాల్లో చిరునవ్వులు నింపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, రాయలసీమ సర్వతోముఖాభివృద్ధికోసం కార్యక్రమం కీలకమైన అడుగుగా నిలవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## జాతిపితకు ఘన నివాళులు అర్పించిన ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా అనంతపురం నగరంలోని క్లాక్ టవర్ సమీపంలో, అలాగే కొత్తఊరు కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమాల్లో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి తో కలిసి పాల్గొని జాతిపితకు ఘన నివాళులు అర్పించారు. కొత్తఊరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మచ్చా నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా గాంధీజీ చూపిన అహింస, సత్యం, శాంతి మార్గాలను స్మరించుకున్నారు. భారతదేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్రల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీజీ అడుగుజాడల్లోనే నేటి సమాజం కూడా సమస్యల సాధన కోసం పాదయాత్రల మార్గంలో ప్రయాణిస్తోందన్నారు. గాంధీజీ మన మధ్య భౌతికంగా లేకపోయినా, ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయి. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం మాత్రమే కాకుండా, ఆయన బోధించిన సత్యం, అహింస, శాంతి విలువలను మన జీవితాల్లో ఆచరించడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మచ్చా నర్సింహులుతో పాటు పలువురు వైశ్య ప్రముఖులు, నాయకులు, వెంకటేశ్వర్ రెడ్డి, బంధువుకు రాజా, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో మెలగాలి

### -సీనియర్ సివిల్ జడ్జి హేమలత

ప్రజాభూమి,
హిందూపురం టౌన్



ఖైదీలు ఉపకారాకారం నుండి బయటకు వెళ్లిన తర్వాత మంచి ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జ్ హేమలత సూచించారు. శుక్రవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఉపకారాగారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఖైదీల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎన్నో రకాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తరచూ కారాగారాలకు రావడం వల్ల కుటుంబ గౌరవ మర్యాదలు దెబ్బతినడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదురవుతాయన్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సహాయం అందించేందుకు మండల న్యాయ సేవా సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటినుండి కారాగారంలో ఉంటున్నారు, కరాగరంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి తోడు భోజనం, ఉపకారగార సిబ్బంది వ్యవహార శైలి, వైద్య సదుపాయం తదితరు అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా ఖైదీలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార అధికారి హనుమప్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, న్యాయవాది ఆశ, పర లీగల్ వాలంటీర్లు సురేష్, చంద్రకాంత్, లోక్ అదాలత్ సిబ్బంది రాజా, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మండల ఎన్నికల ప్రత్యేక అధికారిగా శివానంద నాయక్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం మండల ఎన్నికల ప్రత్యేక అధికారిగా శివానంద నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. పెనుకొండ డివిజన్ లో ఏపీడిగా పనిచేస్తున్న శివానంద నాయక్ ను మండల ఎన్నికల అధికారిగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి దామోదరమ్మ, వివిధ పంచాయతీలకార్యదర్శులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివానంద నాయక్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తన పరిధికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## పోషకాహారంతోనే తల్లి, బిడ్డల ఆరోగ్యం

### ఘనంగా పోషణ ఉత్సవం వేడుకలు-ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ ఉత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో చల్లా లలితమ్మ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో కీలకమని తెలిపారు. రోజువారీ ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తప్పనిసరిగా తీసుకోవాలని,సూచించారుచిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని వివరించారు.పోషణ ఉత్సవం సందర్భంగా పోషకాహారం ప్రాధాన్యత, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై తల్లులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం,చేసుకోవాలని,సూచించారుకార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు ఆర్. కృష్ణవేణి, మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు భారతీ, అప్రమీల, ఆదిలక్ష్మి, రుషింగమ్మ,రామాంజనమ్మ, సుబ్బరత్నమ్మ, ఆశా కార్యకర్తలు పద్మావతి, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ హార్టికల్చర్ హబ్‌తో ఉద్యాన రంగానికి ఊతం

### -వ్యవసాయ అధికారి ఎన్ అన్వేష్ కుమార్

ప్రజా భూమి శింగనమల



రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్ కార్యక్రమ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని శుక్రవారం శింగనమల రైతు సేవా కేంద్రంలో రైతులు వీక్షించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేసినట్లు ఉద్యానశాఖ అధికారి ఎం. శైలజ తెలిపారు. మదనపల్లిలో నిర్వహించిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరుల సమక్షంలో ప్రారంభించిన సందర్భంగా రైతు సేవా కేంద్రం ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఉద్యాన అధికారి శైలజ మాట్లాడుతూ శింగనమల క్లస్టర్‌లో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపు, పంటల వైవిధ్యీకరణ, ఉత్పాదకత--నాణ్యత పెంపు, సూక్ష్మ నీటిపారుదల, పంటకోత అనంతర నిర్వహణ, విలువ జోడింపు, బ్రాండింగ్, వ్యవసాయ యాంత్రీకరణ, నర్సరీలు, మార్కెట్ మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై దృష్టి సారించనున్నట్లు వివరించారు. మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్, మండల ప్రజాప్రతినిధులు మసూలు చంద్రన్న, మసూలు ప్రకాష్, వెంకటేశు, సురేంద్ర, తిరుపతయ్య, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఉమా, పవన్ కుమార్, సంధ్య, నేత్ర, అనిత, మునికుమార్‌తో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మగాంధీ 157 వ జయంతివేడుక



ప్రజా భూమి పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి పూలమాలవేసి, మహాత్మా గాంధీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.డి విజయ జ్యోతి మాట్లాడుతూ అహింసే ఆయుధంగా, స్వాతంత్ర మహాసంగ్రామాన్ని జయించిన యోధుడు, భారతావనిని ఏకతాటిపైకి తెచ్చి, స్వాతంత్రం సిద్ధించే వరకు అహర్నిశలు శ్రమించి, అనేకసార్లు జైలు పాలైన కూడా అవిశ్రాంతంగా స్వాతంత్రం కోసం పోరాడి, బ్రిటిష్ బానిసత్వం నుంచి భారత జాతికి విముక్తి కల్పించిన గొప్ప నాయకుడు అని ఆయన కొనియాడారు. నేటి కాలంలో ఆయనను కూడా శంకిస్తున్నటువంటి కుహనాశక్తులు రాజ్యమేలుతున్నాయని ఓట్లను దొంగలించి రాజ్యాంగ వ్యవస్థను రాజ్యాంగ స్ఫూర్తిని కూడా దెబ్బతీస్తున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి సాధించినటువంటి స్వాతంత్రాన్ని పూర్తిగా నిరుపయోగం చేసే విధంగా ఈరోజు ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధ సంస్థలు సైతం ప్రభుత్వాల చేతుల్లోకి వెళ్లి పనిచేయడం చాలా బాధించదగ్గ అంశమని, వీటి పైన అందరూ కలిసి పోరాడాలని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని మహాత్మా గాంధీ కోరుకున్న టువంటి రాజ్యాన్ని మరల భారతదేశంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్క పౌరుడు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పోరుమామిళ్ల మండల అధ్యక్షులు డాక్టర్ అన్వర్, జవహర్ బాల మంచ్ జిల్లా అధ్యక్షుడు పుల్లారు భాష, కాశీనాయన మండల పార్టీ అధ్యక్షులు పుల్లారు ఖాజావలి,బి.కోడూరు మండల అధ్యక్షుడు గుర్రప్ప మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదా పీర్,నాయబ్ రసూల్ , సయ్యద్ ,మహబూబ్ బాషా, సయ్యద్ పీర్, నాగరాజు,ముజాహిద్, సోహెల్, సాజిద్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విశ్వ మానవుడు.. శాస్త్రి నిరాడంబర నేత

**- కామరాజ్ కింగ్‌మేకర్‌గా పేరుగాంచారు**

**- ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. డా. తులసి రెడ్డి**



ప్రజాభూమి, వేంపల్లె

అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి, కామరాజ్ నాడార్ వర్ధంతి సందర్భంగా ఈ రోజుకు విశిష్ట ప్రాధాన్యం ఉందని రాజ్య సభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ 157వ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా వారి సేవలను తులసిరెడ్డి స్మరించుకున్నారు. గాంధీ విశ్వ మానవుడని, అహింసను ఆయుధంగా చేసుకుని స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. సత్యం, అహింస, సత్యాగ్రహం ఆయన బోధనల్లో ప్రధానమైనవన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం, గ్రామ స్వరాజ్య సాధనతోనే గాంధీజీకి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందన్నారు. నీతి, నిజాయితీ, నిరాడంబరతకు లాల్‌బహదూర్ శాస్త్రి నిలువెత్తు నిదర్శనమన్నారు. 1965 భారత్--పాక్ యుద్ధంలో దేశాన్ని విజయపథంలో నడిపించారని, ఆయన ఇచ్చిన జై జవాన్--జై కిసాన్ నినాదం నేటికీ స్ఫూర్తినిస్తోందన్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, భారతరత్న కామరాజ్ నాడార్ 51వ వర్ధంతి సందర్భంగా తులసిరెడ్డి ఆయన సేవలను కొనియాడారు. తొమ్మిదేళ్లపాటు తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసిన కామరాజ్ నీతి, నిజాయితీ, నిరాడంబరతకు ప్రతీకగా నిలిచారని, భారత రాజకీయాల్లో కింగ్‌మేకర్‌గా పేరుగాంచారని తెలిపారు. ఈ ముగ్గురు మహనీయుల జీవన విధానం, ఆశయాలు ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు, ప్రతి భారతీయుడికి ఆదర్శం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, వెంకటేశు, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం కాశినాయన మండల అధ్యక్షుడిగా శంఖవరం ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాభూమి పోరుమామిళ్ల : శ్రీ అవధూత కాశినాయన మండల బీజేవైఎం (భారతీయ జనతా యువ మోర్చా) నూతన అధ్యక్షుడిగా వరికుంట్ల గ్రామానికి చెందిన శంఖవరం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీజేవైఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేవైఎం జోనల్ ఇంచార్జ్ సుబ్బరాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుసిరెడ్డి మనోహర్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు బిజెపి కాశినాయన మండల అధ్యక్షుడు బిజీవేముల నారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు నూతనంగా ఎన్నికైన శంఖవరం ప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో యువ మోర్చా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రసాద్ నేతృత్వంలో నూతన కమిటీ అంకితభావంతో పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నిక విజయవంతం కావడానికి మరియు ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నికకు బీజేపీ మండల అధ్యక్షుడు బిజీవేముల నారాయణ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుసిరెడ్డి మనోహర్ రెడ్డి ప్రత్యేకంగా సహకరించి, సమన్వయం చేశారు. తన ఎన్నికకు సహకరించిన పెద్దలు బిజీవేముల నారాయణ రెడ్డికి, బుసిరెడ్డి మనోహర్ రెడ్డికి, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు కార్యకర్తలకు నూతన అధ్యక్షుడు శంఖవరం ప్రసాద్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, కాశినాయన మండలంలో బీజేవైఎం,బిజెపి పార్టీ బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఎదురు భాస్కర్ రెడ్డి,ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు మునీంద్ర యాదవ్,పవన్, జిల్లా కార్యదర్శి గురయ్య మండల పరిధిలోని పలువురు బీజేపీ, బీజేవైఎం సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్పీలు సీఎంకు పోస్టుకార్డుల ద్వారా వినతి



ప్రజాభూమి, పులివెందుల

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించి, శ్రమకు తగ్గ వేతనం అందించాలని కోరుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధి ఆర్పీలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టుకార్డుల ద్వారా వినతి పత్రాలు పంపారు. శుక్రవారం ఇస్లాం పురంలోని పోస్టాఫీసు వద్ద వారు పోస్టుకార్డులను పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన జీతాన్ని ప్రభుత్వం అందించాలని, ప్రతి నెలా జీతాలు నేరుగా వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని కోరారు.స్పష్టమైన హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, తమ కుటుంబాలకు భద్రత కల్పించే విధంగా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ కార్డులు ప్రభుత్వానికి చేరిన వెంటనే డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

## బీసీ రిజర్వేషన్లపై ప్రతిపక్షాల రాద్ధాంతం తగదు

**- బీసీలకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



ప్రజాభూమి, వేంపల్లె

బీసీ రిజర్వేషన్లపై ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం తగదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. రిజర్వేషన్ల అంశంపై రాజకీయ విమర్శలకు బదులు వాస్తవాలు, చట్టపరమైన అంశాల ఆధారంగా మాట్లాడాలని సూచించారు. బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యం కూడా సామాజిక న్యాయంలో కీలకమని తెలిపారు. బీసీలకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారి ప్రాతినిధ్యం తగ్గకుండా రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కోర్టు తీర్పులు, సమకాలీన గణాంకాలు, చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. బీసీల హక్కులు బలహీనపడకుండా, చట్టపరంగా నిలిచే విధంగా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీలను నిర్ణయాధికారంలో భాగస్వాములుగా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు.

## నక్కసుబ్బరాయుడిని పరామర్శించిన వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పట్టణం బలిజ సంఘ వీధిలో నివాసం ఉంటున్న నక్క సుబ్బరాయుడు అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని మున్సిపల్ వైసీపీ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వరప్రసాద్, గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ మాజీ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, సోపాల వీర, రవిశంకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రబల్లి హరిజనవాడలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం



ప్రజాభూమి, పులివెందుల

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పులివెందుల మండలం ఎర్రబల్లి హరిజన వాడలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వై. నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పరిసరాలను శుభ్రం చేశారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.స్వచ్ఛ భారత్ అనేది కేవలం కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని, గాంధీజీ చూపిన మార్గాన్ని ఆచరించాలని నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు కోడిమూర్తి శ్రీరాములు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి విష్ణు యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, రాయలసీమ ఎస్టీ నేత శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**గాంధీ ఆశయాలతోనే సమాజ అభివృద్ధి: వైఎస్ మనోహర్ రెడ్డి**



ప్రజాభూమి, పులివెందుల

అహింసను ఆయుధంగా, సత్యాన్ని మార్గంగా చేసుకుని కోట్లాది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన గొప్ప నేత జాతిపిత మహాత్మా గాంధీ అని మున్సిపల్ వైసీపీ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసీపీ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింస, సహనం, మానవత్వం, సామాజిక బాధ్యత వంటి మహోన్నత విలువలను ఆచరించి వాటి శక్తిని ప్రపంచానికి చాటిన గొప్ప నాయకుడు గాంధీజీ అని, ఆయన జీవితం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హెచ్. గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ మాజీ చైర్మన్ చింతకుంట సుధాకర్ రెడ్డి, దీరంగుల చంద్రమౌళి పాల్గొన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ నాయకులు కూడా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ ప్రసాద్, రాయుడు, శ్రీరాములు, కోళ్ల భాస్కర్, నగర్ గుట్ట నాగరాజు, ఆర్టీసీ జయరాములు, మాజీ కౌన్సిలర్ నాగరాజు, కొంగనపల్లె మురళి, కొంగనపల్లె రవి, ఫక్రుద్దీన్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖైదీలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి - జడ్జి చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల

ఖైదీలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం. చంద్రశేఖర్ రెడ్డి సూచించారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పులివెందుల సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు.ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా న్యాయవాదులను నియమించి సహాయం అందిస్తామని, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 హెల్ప్ లైన్ నంబర్ వినియోగించుకోవాలని తెలిపారు.ఖైదీలు మంచి ప్రవర్తనతో మెలగాలని, విడుదల తర్వాత గౌరవప్రదంగా జీవించాలని హితవు పలికారు. వారానికి ఒకసారి వైద్యుడు జైలును సందర్శించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం ఖైదీలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది డి. శివరాజు, జైలు సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దారు కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



ప్రజాభూమి, సిద్ధవటం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సిద్ధవటం మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. అహింస, శాంతి, గ్రామ స్వరాజ్యం వంటి గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా రెవెన్యూ శాఖ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువలేమన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## భాకరాపేటలో మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జన్మదిన వేడుకలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని భాకరాపేటలో మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. పత్రికా విలేకరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజేశ్వరి రెడ్డి కేక్ కట్ చేసి మీడియా ప్రతినిధులకు పంచిపెట్టారు. అనంతరం విలేకరులు ఆమెను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరి రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు తనకు కల్పించాడని, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన జన్మదిన వేడుకలను నిర్వహించిన విలేకరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బెటాలియన్‌లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**-సత్యం, అహింస మార్గంలో గాంధీజీ చూపిన బాటను ఆదర్శంగా తీసుకోవాలి**



ప్రజాభూమి, సిద్ధవటం: కమాండెంట్ కె. ఆనందరెడ్డి ఆదేశాల మేరకు బెటాలియన్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి 11వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి. రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై, ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ సత్యం, అహింస అనే ఆయుధాలతో గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలోకీలకపాత్ర పోషించారని, సత్యం, అహింస, హరిజనోద్ధరణ వంటి ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## భాకరాపేటలో హైవే వెంబడి పారిశుద్ధ్య పనులు



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలోని భాకరాపేట గ్రామంలో కడప--చెన్నై జాతీయ రహదారికి ఇరువైపులా శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో హరిత రాయబారుల ద్వారా రహదారి వెంబడి పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచితే సీజనల్ వ్యాధులను నివారించవచ్చన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ పనులు చేపడతామని తెలిపారు. చిరు దుకాణాల యజమానులు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను డ్రైనేజీ కాలువల్లో వేయకుండా సహకరించాలని సూచించారు. గ్రామంలో చెత్త సేకరణకు వచ్చే గ్రీన్ అంబాసిడర్ వాహనాల్లోనే చెత్త వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ మేడ సాయిబాబా, దినేష్, జగదీష్, వినోద్, మురళి తదితర సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైసీపీ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి హాజరై గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, శాంతి సామరస్యాలకు గాంధీజీ చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని అన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాభూమి,పులివెందుల

రోడ్డు విస్తరణ పనుల కారణంగా శనివారం పులివెందుల రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ కే. రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు రోడ్డు విస్తరణ పనులు లలో భాగంగా కనంపల్లి, మోతునూతలపల్లి, కే. వెలమవారిపల్లి, వెంకటాపురం, కదిరి రింగ్ రోడ్డు పరిధిలో విద్యుత్ సరఫరా లో అంతరాయం కలగనుందని, కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## మహాత్మా గాంధీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ శిరోధార్యం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.



జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ శిరోధార్యమని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణలతో కలిసి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ఎల్లవేళలా అనుసరణీయమని తెలిపారు. దేశ పురోగతికి ఆయన అందించిన సేవలు, ఆశయాలను ప్రతి ఒక్కరూ పునికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొని మహాత్మునికి నివాళులు అర్పించారు.

## ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యం!

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.



శ్రీ వరసిద్ధి వినాయక ఆటో డ్రైవర్స్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నుకున్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆటో స్టాండ్‌కు చెందిన ఆటో ఓనర్లు, డ్రైవర్లు కలిసి శ్రీ వరసిద్ధి వినాయక ఆటో డ్రైవర్స్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ను ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధగుంట సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 83 మంది ఆటో ఓనర్లు, డ్రైవర్లు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా మహేష్‌బాబు, అధ్యక్షుడిగా వాసు, ఉపాధ్యక్షుడిగా రాముడు, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఆటో ఓనర్లు, డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో ఓనర్లు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అసోసియేషన్ తరఫున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అందరి సహకారంతో పారదర్శకంగా, ఐకమత్యంతో అసోసియేషన్‌ను ముందుకు తీసుకెళ్లి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధగుంట సుధాకర్‌రెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఆటో ఓనర్లు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణిగుంటలో మహాత్మగాంధీ జయంతిలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



మహాత్మగాంధీ జి జయంతిని పురస్కరించింది రేణిగుంట పట్టణంలోని బస్టాండ్ కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి రేణిగుంట పట్టణ టిడిపి నాయకులు కర్పూరం హారతి, కొబ్బరికాయ సమర్పించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జై బోలో మహాత్మాగాంధీకి జై నినాదాలతో హోరెత్తించారు, బస్టాండ్ కూడలి లో ప్రయాణికులకు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్ప నాదన్, మైనార్టీ నాయకు నవాబ్, కన్నా రెడ్డి, నాటక అకాడమీ డైరెక్టర్ లువియానా మేరీ, ఏలుమలై రెడ్డి, సుమన్, అంబికాపతి యాదవ్, ఎస్సీ సెల్ శ్రీవారి మణి,విద్యాసాగర్, నాగేశ్వరరావు, రంగనాయకులు, వేణు, పట్టణ ప్రజలు, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ ( స్కిమ్స్) కళాశాలలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిద్దెల హరి గారు హాజరై, మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ ఆశయాలు, సత్యం, అహింస, గ్రామ స్వరాజ్యం, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.అనంతరం మిద్దెల హరి గారు మరియు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. గీతాదేవి గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ జీవిత చరిత్ర, దేశం కోసం ఆయన చేసిన మహోన్నత సేవలు, సమాజ అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం గురించి వివరించారు. గాంధీజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగాలని వారు విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని గాంధీజీకి ఘనంగా నివాళులు అర్పించారు.

## మహాత్మా గాంధీకి ఘన నివాళులు తలపా దామోదరం రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

మహాత్మా గాంధీ గారి 157 వ జయంతి సందర్భంగా తొట్టంబేడు మండల రెవెన్యూ కార్యాలయం నందు గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి బ్రిటిష్ వారి బానిస సంకెళ్లను తెంచి స్వేచ్ఛ వాయువులను అందించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని వారి జీవితం భావి భారత పౌరులకు ఒక మార్గదర్శకమని ప్రపంచ దేశాలకు శాంతిని బోధించిన గొప్ప ధార్శానికుడు మహాత్మా గాంధీ ని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, కాంగ్రెస్ నాయకులు బత్తయ్య, సుధా యాదవ్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ జయంతి స్ఫూర్తితో పరిశుభ్రమైన, సుందరమైన తిరుపతిని నిర్మిద్దాం

- స్వర్ణాంధ్ర సాధనలో స్వచ్ఛాంధ్రకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి -:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్
- స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ప్రజా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ








ప్రజా భూమి ప్రతినిధితిరుపతి

మహాత్మా గాంధీ చూపిన సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ గత 16 సంవత్సరాలుగా అక్టోబర్ 2న వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛత, సుందరీకరణ, వాయు కాలుష్య నివారణలో స్థానిక సంస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తిరుపతి నగరం 2024, 2025 సంవత్సరాల్లో వరుసగా దేశవ్యాప్తంగా టాప్--3లో నిలవడం విశేషమని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర--స్వచ్ఛతా హి సేవా అవార్డులు--2026లో భాగంగా తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి నగర పాలక సంస్థ కమీషనర్ జయకృష్ణ, టిటిడి బోర్డు సభ్యులు మన బాక లక్ష్మి, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దడం ద్వారానే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని, స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గౌరవ ముఖ్యమంత్రి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద శ్రమదానం, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని యంత్రాలు, వాహనాలు సమకూర్చినా, యంత్రాంగం ఎంత సమర్థవంతంగా పనిచేసినా ప్రజల భాగస్వామ్యం లేకుండా స్వచ్ఛత సాధ్యం కాదని అన్నారు. ప్రజలు, వ్యాపారులు, హోటళ్లు, మార్కెట్లు, కార్యాలయాలు వ్యర్థాలను సక్రమంగా సేకరించి వర్గీకరించడంలో సహకరించాలని సూచించారు. తిరుపతి నగరంలో ప్రతిరోజూ సుమారు 250 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, ప్రస్తుతం 70 నుంచి 80 టన్నుల వ్యర్థాలను మాత్రమే స్థానికంగా ప్రాసెస్ చేయగలుగుతున్నామని, మిగిలిన వ్యర్థాలను శ్రీరామపురం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రతి ఇంటి నుంచే వ్యర్థాల వర్గీకరణ ప్రారంభం కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేరు చేసేందుకు రోజుకు కనీసం 10 నిమిషాల సమయం కేటాయించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యర్థాలను పూర్తిస్థాయిలో రీసైక్లింగ్, ప్రాసెసింగ్ చేసి ఎటువంటి అవశేషాలు మిగలకుండా నిర్వహించినప్పుడే నగరాన్ని పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా తీర్చిదిద్దగలమని తెలిపారు. తిరుపతి జిల్లాలోని రామాపురంలో సుమారు రూ.300 కోట్లకు పైగా వ్యయంతో 600 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని, 2027 డిసెంబర్ లేదా 2028 జనవరి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. తిరుపతితో పాటు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో వ్యర్థాల నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లను అందుబాటులోకి తీసుకువచ్చి, రాబోయే రెండేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్త కుప్పలు లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.పరిసరాల అపరిశుభ్రత వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు తమ ఇళ్లు, వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలందరూ నిద్రించే సమయంలోనే విధులకు హాజరై నగరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అసమానమైనవని జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్పొరేషన్, పంచాయతీల పారిశుధ్య సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆరోగ్య పరిరక్షణకు తరచూ హెల్త్ చెకప్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. విధుల సమయంలో పారిశుధ్య సిబ్బంది మాస్కులు, గ్లౌజులు, సేఫ్టీ కోట్లు తదితర రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.స్వచ్ఛత కోసం విశేష కృషి చేసిన కార్యాలయాలు, హోటళ్లు, ఎన్జీవోలు, విద్యాసంస్థలు, పారిశుధ్య సిబ్బందిని స్వచ్ఛతా హి సేవా అవార్డులు--2026తో సత్కరిస్తున్నామని, వారి సేవలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. గాంధీ జయంతి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, వీధి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలని, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సుందరమైన తిరుపతి నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.తిరుపతి నగరపాలక కమీషనర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ భారత్ మిషన్' స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. స్వచ్ఛాంధ్ర సాధన ద్వారానే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఇంటి నుంచి ప్రతి వీధి వరకు, నగరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా మలచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగరాన్ని నిర్మించుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహాత్మా గాంధీ ఆశయాలు, జీవిత సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి 'వికసిత భారత్' సాధనలో భాగంగా స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి, పారిశుధ్య నిర్వహణలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, తిరుపతి నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం జిల్లా స్థాయిలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల సిబ్బందికి స్వచ్ఛతా హి సేవా అవార్డులను జిల్లా కలెక్టర్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్జీవోలు, విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక 51వ వార్షికోత్సవం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



263 మంది విద్యార్థులకు రూ.80 లక్షల ఉపకార వేతనాలు అందిస్తోంది.గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందిస్తున్న శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘ 51వ వార్షికోత్సవ వేడుకలు పేటమిట్టలోని మంగళ్ విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పాటూరి రాజగోపాల్ నాయుడు గారి ఆశయాలకు అనుగుణంగా డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు స్థాపించిన ఈ సంస్థ, గత 51 సంవత్స రాలుగా దాతల సహకారంతో ప్రతిభావంతులైన విద్యార్థులకు విద్యా సహాయాన్ని అందించారు. 51వ వార్షికోత్సవం సందర్భంగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, సీఏ తదితర కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 263 మంది విద్యార్థినీ, విద్యార్థులకు దాదాపు రూ.80 లక్షల విలువైన ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా అమర రాజా సంస్థల అధినేత డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల ప్రతిభకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని స్థిరపడిన అనంతరం మరింతమంది పేద విద్యార్థులకు సహాయం చేయాలని సూచించారు. సంస్థకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే ఆశయం: డా. గౌరినేని రమాదేవి అన్నారు అన్నారు డా. గౌరినేని రమాదేవి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ప్రతిభావంతుడైన విద్యార్థి తన లక్ష్యాన్ని వదులుకోకూడదనే ఉద్దేశంతో విద్యా సహాయ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా డా. పి. కృష్ణయ్య (రిటైర్డ్)కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. పి. కృష్ణయ్య చైర్మన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు డా. గౌరినేని రమాదేవి, కార్యదర్శి మహదేవ నాయుడు, కార్యవర్గ సభ్యులు సతీష్ రాళ్లపల్లి, బాలాజీ కిరణ్, ప్రణీత్ సుధీర్, డా. ప్రసాద్, ఉమాకాంత్, పేటమిట్ట మాజీ సర్పంచ్ గల్లా రాధాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, దాతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గాంధీ ఆశయాలతో గ్రామ స్వరాజ్యానికి బాటలు

### వాకాడు మండలంలో ఘనంగా 157వ గాంధీ జయంతి -- పలు గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలు వాకాడు మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.గాంధీజీ పాటించిన సత్యం, అహింస, గ్రామ స్వరాజ్య సిద్ధాంతాలను స్మరించుకున్నారు. అదేవిధంగా వాకాడు మండలం నెల్లిపూడి గ్రామ పంచాయతీలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారి, ప్రత్యేక అధికారి సి. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. గ్రామ ప్రజలకు గాంధీ జయంతి ప్రాముఖ్యతతో పాటు గ్రామ సభ ఉద్దేశం, ప్రాధాన్యత, అజెండాలోని అంశాలను వివరించారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

**వాకాడు సచివాలయం--1లోనూ ప్రత్యేక గ్రామ సభ**

పంచాయతీ కార్యదర్శి ప్రవల్లిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభ ప్రాముఖ్యత, ప్రజల భాగస్వామ్యం, గ్రామ సమస్యల పరిష్కారంలో గ్రామ సభల పాత్రపై చర్చించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను గ్రామ సభ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని సూచించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు కొండారెడ్డి నందగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సభలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని, గ్రామ ప్రజల సమస్యలను నేరుగా చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు ఇవి చక్కటి వేదికలని అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనకు ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కొండారెడ్డి నందగోపాల్ రెడ్డి, కాటంరెడ్డి రామలింగారెడ్డి, అన్నమేటి చంద్రయ్య, మండల సర్వేయర్ గోపీనాథ్, ఏపీవో విజయమ్మ, వీఆర్వో నెల్సన్, పంచాయతీ అభివృద్ధి అధికారి స్వర్ణ, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన గ్రామ సభల్లో గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు గ్రామ సభల్లో చురుకుగా పాల్గొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అధికారులు, నాయకులు పిలుపునిచ్చారు.



# యుగ పురుషులు గాంధీజీ - లాల్ బహదూర్ శాస్త్రులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన యుగపురుషుడు మహాత్మా గాంధీ అని, అలాగే భారతదేశ రెండవ ప్రధానమంత్రిగా పనిచేసిన లాల్ బహుదూర్ శాస్త్రి నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి, నిరాడంబరతలకు ప్రతీక అని డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ అన్నారు. అక్టోబర్ 2వ తేదీ శుక్రవారం ఎస్వీఏ ప్రభుత్వ కళాశాల, శ్రీకాళహస్తిలో గాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి వేడుకలు విజయవంతంగా జరిగాయి. కళాశాల ఎన్.ఎస్.ఎస్. ఎన్ సి సి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ ప్రసంగిస్తూ గాంధీజీ స్వాతంత్ర ఉద్యమాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చారని అన్నారు..గాంధీజీ ఒకవైపు స్వాతంత్ర పోరాటం చేస్తూ, మరోవైపు అంటరానితనం నిర్మూలన, స్త్రీ పురుష సమానత్వం, కుల మత రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే మనదేశ రెండవ ప్రధానిగా పనిచేసిన లాల్ బహుదూర్ శాస్త్రి అధికారాన్ని హోదాగా కాకుండా బాధ్యతగా భావించారని, జై జవాన్ జై కిసాన్ అనే నినాదాలను సృష్టించి మనదేశ వీర సైనికులకు, రైతులకు గౌరవాన్ని ప్రకటించారని అన్నారు. గాంధీజీ అహింసా సిద్ధాంతాలు భారతదేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక శాంతి ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయని ఇతర వక్తలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ టి. గంగారాం , ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. సునీత, డాక్టర్ టి. సుధీర్, ఎన్ సి సి అధికారి డాక్టర్ భాస్కర్ మరియు డాక్టర్ సి. బాపనయ్య,టి. నరసింహులు, డాక్టర్ పి. వేణుగోపాల్, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ కందేరి శ్రీదేవి, ఎస్. పద్మావతి, డాక్టర్ పి. వరలక్ష్మి, డాక్టర్ పరంధామయ్య, డాక్టర్ జి. హన్న తదితర అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లా కారాగారంలో ఘనంగా "ఖైదీల సంక్షేమ దినోత్సవం"

## ఖైదీల సంక్షేమానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం

## తప్పుల నుంచి మార్పు పొంది సమాజంలో మంచి జీవితాన్ని గడపాలి: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

### ఆర్థిక ప్రయోజనాల కోసం చేయని నేరాలను నెత్తికెత్తుకోవద్దు.... సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి,

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా కారాగారంలో "ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (ఋూూ) సెక్రెటరీ మరియుసీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి, జైలు సూపరింటెండెంట్ వెంకటరెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ఖైదీ సోదరులకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు తదితర కారణాలతో కొంతమంది నేరాలకు పాల్పడి జైలుకు వచ్చినప్పటికీ, ప్రస్తుతం వారి సంక్షేమం, పునరావాసం, భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ వ్యవస్థ, పోలీసు శాఖ, సివిల్ అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో ఖైదీల సంక్షేమానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. జైలులో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని గుర్తించి పరిష్కరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. న్యాయపరమైన అంశాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ వ్యవస్థ




ద్వారా అవసరమైన సహకారం అందుతుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బెయిల్ లేదా ఇతర సంక్షేమ అవసరాలకు ఇబ్బందులు ఎదురైతే సంబంధిత వివరాలతో తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. జైలులో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, వంటగది, వినోదం/రీక్రియేషన్ సదుపాయాలు వంటి ఏవైనా అవసరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఖైదీలలో నిజమైన పరివర్తన రావాలంటే గాంధీజీ బోధించిన సత్యం, అహింస సిద్ధాంతాలను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక మార్గాలకు దూరంగా ఉంటూ, కేవలం ఆర్థిక లాభాల కోసం ఇతరులు చేసిన నేరాలను తమ నెత్తిపై వేసుకోవద్దని స్పష్టం చేశారు. ఖైదీలు జైలు నుంచి విడుదలైన అనంతరం తిరిగి సమాజంలోకి వెళ్లి మంచి జీవితాన్ని గడపాలని, భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఋూూ సెక్రెటరీ మరియు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఖైదీల సంక్షేమ కార్యక్రమానికి హాజరు కావడం సంతోషకరమన్నారు. పుట్టుకతో ఎవరూ ఖైదీలు కారని, పరిస్థితులు, సందర్భాల కారణంగా తప్పులు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని, ఏదైనా సమస్య ఎదురైతే చట్టపరమైన మార్గాలను అనుసరించి కోర్టును ఆశ్రయించాలని సూచించారు. ముఖ్యంగా చీణూూ, ూూజూూ వంటి కేసులకు సంబంధించి చట్టాలను ఉల్లంఘించకుండా, మహిళలు మరియు బాలికల పట్ల గౌరవంతో వ్యవహరించాలని సూచించారు. జైలు కేవలం శిక్ష అనుభవించే ప్రదేశం మాత్రమే కాదని, ఖైదీలలో పునరావాసం, సంస్కారం, మార్పు తీసుకురావడం కూడా దాని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం ద్వారా టైలరింగ్, ఎలక్ట్రీషియన్ తదితర రంగాల్లో ఉచిత శిక్షణా కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ వెంకటరెడ్డి మాట్లాడుతూ, గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు సబ్ జైలు బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతోందని, అనంతరం ప్రత్యేక కారాగారంగా, 2012 మార్చి 29న జిల్లా కారాగారంగా స్థాయి పెంచబడిందని వివరించారు. జైలులో పురుషులు, మహిళా ఖైదీలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖైదీల కోసం 6 పడకల ఆసుపత్రి, వైద్యులు, ఫార్మాసిస్ట్, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఖైదీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో ఖైదీలను బయట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి రిమ్స్, సిమ్స్ తదితర ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలతో ఉన్న మహిళా ఖైదీలకు అవసరమైన పోషకాహారం అందిస్తున్నామని చెప్పారు. జైలులో లైబ్రరీ, శుద్ధి చేసిన తాగునీరు వంటి సదుపాయాలు కల్పించామని, వివిధ పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ఖైదీలకు ప్రార్థనలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నామని జైలు సూపరింటెండెంట్ తెలిపారు. ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైదీల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వివిధ క్రీడా, వ్యాసరచన తదితర పోటీలలో ప్రతిభ కనబరిచిన ఖైదీలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం శ్రీధర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగయ్య, జయసింహ, భాష, రామకృష్ణంరాజు, కార్యక్రమంలో జైలు సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న సి.ఇ.సి. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**- 2023 ఎన్నికల కమిషన్ నిబంధనలు సవర్ణ చట్టం రద్దు చేయాలి.**
**- ఎన్.ఐ.ఆర్. బదులుగా ఎన్.ఎన్.ఆర్. తీసుకురావాలి - సిపిఎం**

ప్రజా భూమి ప్రతినిధి జమ్మలమడుగు రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి యేతర రాజకీయ పార్టీలు, ఇండియా కూటమి పార్టీలు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు అక్టోబర్ 2 దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాల్లో కేంద్రపాలిత ప్రాంతాల్లో రాజ్యాంగ విరుద్ధంగా వివరిస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి రాజీనామా చేయాలని ఆందోళన లో భాగంగా జమ్మలమడుగు పట్టణంలోనీ గాంధీ విగ్రహం కు పూలమాల వేసి నిరసన కార్యక్రమం చేసినట్లు స్థానిక సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి జి.ఏసుదాసు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఎన్నికల కమిషన్ నిబంధనలు సవరిస్తూ చేసిన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విరుద్ధ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ భిన్నంగా, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే న్యాయస్థానాల్లో విచారించేటువంటి నిబంధనను తొలగించడం నియంతృత్వ ధోరణికి అవకాశం కల్పించడమే అన్నారు. ఎస్.ఐ.ఆర్. రద్దుచేసి ఎస్.ఎస్.ఆర్. తీసుకురావాలని కోరారు. ఓటు నమోదు, ఓటు తొలగింపు ప్రక్రియలో ఫారం-6 ప్రజాస్వామ్య విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా పౌరులను రెండుగా విడగొట్టి, ఓటు ఉన్న పౌరులు, ఓటు లేని పౌరులుగా మారుస్తోందని ఈ నిబంధ నను వెంటనే తొలగించాలన్నారు. జడ్- జనరేషన్ ఓటర్లు దేశవ్యాప్తంగా రెండు కోట్ల 50 లక్షలు




నమోదు చేయలేదని, 13 కోట్ల ఓటర్లు తొలగించారని, మహిళ ఓటర్ల సంఖ్యను గణనీయంగా తొలగించారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని త్వరితగతిన విచారించి తీర్పు ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ త్రిసభ్య కమిటీ లోని ఇద్దరు మెజారిటీ సభ్యుల నిర్ణయానికి భిన్నంగా బిజెపి రాజకీయ ఎన్నికల ప్రయోజనాల కోసం, కేంద్ర ఎన్నికల ప్రధాన ఉన్నతాధికారి నిర్ణయాలు చేయటం, అమలు చేయటం అప్రజాస్వామ్యకమైన చర్య అయినందున కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఏ. వినయ్ కుమార్, నరేంద్ర, దస్తగిరి విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు హరిబాబు ఖాదర్ లు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మునికి ఘన నివాళులు అర్పించిన కలెక్టర్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: గాంధీ జయంతి సందర్భంగా చిత్తూరు జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం మాదిరిగానే గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు ముఖ్యమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 2న రాయలసీమ ప్రాంతంలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్కు సంబంధించిన కార్యక్రమం నిర్వహించడంతో పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో స్వచ్ఛత అవార్డుల ప్రదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీలు, స్వయం సహాయక సంఘాలు (ూూ+లు), ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమంగా పనిచేసిన వారిని గుర్తించి సత్కరించడం ద్వారా స్వచ్ఛత కార్యక్రమాల్లో మరింత ఉత్సాహాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటీలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. మహాత్మా గాంధీ దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, పరిశుభ్రతతో ఆదర్శవంతమైన సమాజంగా ఎదగాలని ఆకాంక్షించారని గుర్తుచేశారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నెలా పలు కార్యక్ర



మాలను చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 10 ఈ-ఆటోలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వీటి ద్వారా మున్సిపాలిటీ విస్తరణ ప్రాంతాల్లో చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని తెలిపారు. చిత్తూరు ప్రజలకు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేస్తూ, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఎంతో కష్టపడుతున్నారని అన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను నిర్దేశించిన డస్ట్‌బిన్లలోనే వేయాలని, బస్‌స్టేషన్, మార్కెట్ ప్రాంతాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచే పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారని, వారు శుభ్రం చేసిన ప్రాంతాల్లో తిరిగి చెత్త వేయడం వల్ల వారి పనిభారం పెరుగుతుందని తెలిపారు. ప్రజల సహకారంతోనే పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా 'స్వచ్ఛత'ను మన బాధ్యతగా భావించి, చిత్తూరు పట్టణాన్ని పరిశుభ్రతలో ఆదర్శంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ప్రజలను కోరారు.

# జలజీవన్ మిషన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి

ప్రజా భూమి ప్రతినిధి ప్రొద్దుటూరు



జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5న పొద్దుటూరుకు రానున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి శుక్రవారం పరిశీలించారు. శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాలతో కలిసి పొద్దుటూరులోని అమృత్ నగర్, మున్సిపల్ లేఅవుట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, సభా వేదిక, పైలాన్ తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఎక్కడా లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఎపి షేక్స్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ సి భావన, జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమీషనర్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేనపార్టీ నాయకులు,ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుని మర్యాదపూర్వకంగా కలిసిన చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్.

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్ తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన జనసేన పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ని శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్సీ నాగబాబు కి కొట్టే సాయి ప్రసాద్ అందజేశారు. స్వామివారి ఆశీస్సులు నాగబాబు పై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన



పార్టీ నాయకులు జయప్రకాష్, కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, పర్వతాల హరి, ఢిల్లీ బాబు,చంద్ర శేఖర్, గిరి,గణేష్, హరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

# గుండుపాలెం రామాలయంలో భక్తిశ్రద్ధలతో రుద్రార్చన, సిందూర అర్చన

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో గుండుపాలెం గ్రామంలోని గాంధీ బొమ్మ ఎదురుగా ఉన్న శ్రీ రామాలయంలో శుక్రవారం రుద్రార్చన, సిందూర అర్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో గ్రామానికి చెందిన సుమారు 35 మంది మహిళలు పాల్గొన్నారు. కుటుంబాల శ్రేయస్సు, గ్రామ ప్రజల సుఖసంతోషాలు, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షిస్తూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వర్రె రాజశేఖర్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, ఆలయ పూజారి, గ్రామ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు ప్రతి పౌరుడిలో దేశభక్తి, జాతీయ భావన పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. దేవభక్తి, దేశభక్తి సమాజ శ్రేయస్సు, దేశ ఐక్యతకు దోహదపడే విలువలని పేర్కొన్నారు. యువతలో జాతీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు గ్రామస్థాయిలో దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 'వందేమాతరం' వంటి దేశభక్తి గీతాలను



సామూహికంగా ఆలపించడం ద్వారా దేశం పట్ల బాధ్యత, గౌరవ భావనను పెంపొందించవచ్చని తెలిపారు. రుద్రార్చన, సిందూర అర్చన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను విహెచ్‌పీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బురగడ్డ శ్రీనాథ్, జిల్లా ప్రభారి పీవీఎస్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న గుండుపాలెం గ్రామ మహిళలు, భక్తులు, ఆలయ పూజారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లోని ఆలయాలను ఆధ్యాత్మిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ మహిళలు, యువత, గ్రామ ప్రజలను ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని వారు సూచించారు. ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా భక్తి, సామాజిక ఐక్యత, జాతీయ చైతన్యం మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు.

# గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దాం

### -మండల ప్రత్యేక అధికారిణి గంగాభవాని

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రాపురం జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని మండల ప్రత్యేక అధికారిణి గంగాభవాని కోరారు. శుక్రవారంనెన్నూరు స్వర్ణ గ్రామ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి వేడుకలలో పాల్గొని జాతిపితకు పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి



మార్గాలు ఎల్లప్పుడూ ఆచరణీయమని తెలిపారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను, ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండలంలో 11 స్వర్ణ గ్రామ, ఎంపీడీవో, తహశీల్దార్, రక్షక బట నిలయం, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, వెలుగు కార్యాలయాలలో గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించి, స్వర్ణ గ్రామ కార్యాలయాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పులిరాం సింగ్, తహశీల్దార్ యు మధుసూదన్ రావు, ఎస్సై భక్తవత్సలం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో మమత, విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు, ఏపీవో సుజాత, ఏపిఎం గురుమూర్తి, టిడిపినాయకులు డి బిందు మాధవి, కే మధుసూదన్ రెడ్డి, గుణసుందరి, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, ఝాన్సీ, కోనేటి హరి, సురేష్, సుమలత, ధన్య, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కల్కి భగవాన్ అంతిమయాత్రలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి ఆనం....

**ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు..**
**నివాళులర్పించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, వన్‌నెస్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు శ్రీ కల్కి భగవాన్ (విజయ్ కుమార్ నాయుడు) అంతిమయాత్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు.కల్కి భగవాన్ సెప్టెంబర్ 29న చెన్నైలో పరమపదించిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు పోలీస్ గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. తిరుపతి జిల్లా వరదయ్య



పాళెం మండలం, బత్తలవల్లం గ్రామంలోని ఏకం క్షేత్రంలో నేటి సాయంత్రం అంతిమ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కల్కి భగవాన్ పార్థివదేహానికి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆధ్యాత్మిక రంగంలో కల్కి భగవాన్ అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, ఎమ్మెల్యే విజయ్ శ్రీ, ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు

# తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి

**తండ్రిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి**

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి తండ్రి మద్దెల ముని కృష్ణయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ, ప్రస్తుతం చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యంగా కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి నేడు చెన్నైలోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ఎంపీ తండ్రి మద్దెల ముని కృష్ణయ్యని ఆప్యాయంగా పరామర్శిం



చి, ఆయన ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య సేవలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో ఇంటికి తిరిగిరావాలని, ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీ మద్దెల గురుమూర్తిని, వారి కుటుంబ సభ్యులను కలసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాశ్ రెడ్డి తదితర వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ తొలగిపోవాల్సిందే

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

ప్రజాస్వామానికి, పౌర హక్కులకు గొడ్డలిపెట్టుగా మారిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే బాధ్యతల నుంచి తొలగిపోవాలని ఇండియా కూటమినేతలు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఇండియా కూటమినేతలు శుక్రవారం సీఈసీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక పెండ్లి మండపం వద్ద కేంద్ర ఎన్నికల సంఘానికి, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలన్నారు. తొలగించిన 13 కోట్ల ఓట్లను పునరుద్ధరించాలని కోరారు. పాత ఫారం-6ను యధావిధిగా కొనసాగిస్తూ వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. సవరించిన ఫారం-6 మూలానా గిరిజనులు, వలస కూలీలు, మైనార్టీలు, జెన్ జీ యువత ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నిటికీ బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోధర్ రెడ్డి, కరీముల్లా, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, కుమార్, వెలివేంద్రం, అన్వర్ బాషా, సిపిఐ నేతలు ముంచందు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

### - గ్రామీణాభివృద్ధికి ప్రజలు భాగస్వాములు కావాలి

### - డిడిఓ వెంకట సుబ్బయ్య



ప్రజాభూమి, వేంపల్లె

వికసిత్ భారత్--జీ రామ్‌జీ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకుని గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని పులివెందుల డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డిడిఓ) వెంకట సుబ్బయ్య కోరారు. శుక్రవారం స్థానిక పట్టణంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వికసిత్ భారత్--జీ రామ్‌జీ ఉపాధిహామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిడిఓ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్న ఉపాధిహామీ పథకాన్ని అర్హులైన కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో చేపట్టే ఉపాధిహామీ పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అలిరెడ్డిపల్లి, కుమ్మారాంపల్లి సచివాలయాల్లోనూ గ్రామసభలు నిర్వహించి ఉపాధిహామీ పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, పంచాయతీ ఈఓ కవిత, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏపీఓ పార్వతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

### - హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి వల్లెపు గణేష్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతనెల 28న నల్లపురెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయికి విద్యార్థి ఎంపిక కావడం హర్షణీయమని హెచ్‌ఎంతో పాటు విద్యార్థి తండ్రి, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ వల్లెపు బుజ్జి, ఫిజికల్ డైరెక్టర్లు నిశాల్, ప్రమీలకుమారి తెలిపారు. 150 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని హెచ్‌ఎం తెలిపారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాన్ని సొంతం చేసుకోవాలని, పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి

### - హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి- ఎస్సై తిరుపాల్ నాయక్



ప్రజాభూమి, వేంపల్లె

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై తిరుపాల్ నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వచ్చే ప్రతి సందర్భంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నిత్యపూజయ్య, నాయబ్ రసూల్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

### ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన: సీఐ పురుషోత్తంరాజు



ప్రజాభూమి, పులివెందుల

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల అర్బన్ సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆర్. తుమ్మలపల్లి గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళలు, బాలికల భద్రత, దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పిల్లలు చదువుపై శ్రద్ధ పెట్టి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు.

## వైకాపా నేతలకు గుర్తింపు కార్డుల పంపిణీ

### కార్డులు అందచేసిన ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పులివెందులలో వైకాపా నాయకులకు గుర్తింపు కార్డులను ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం పులివెందుల వైఎస్ఆర్ ఆడిటోరియంలో మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి, మాజీ జడ్పీటీసీ కోకటం వెంకట బయపురెడ్డి, పీసీబీ మాజీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డిలకు గుర్తింపు కార్డులను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు కల్పించాలనే ఉద్దేశంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గుర్తింపు కార్డులతో బాధ్యత మరింత పెరుగుతుందని, ప్రజల్లో మమేకమై పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# మహాత్మా...! ప్రభుత్వానికి సద్బుద్ధి ప్రసాదించాలి..

### -విజయవాడ ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులపై కేసులు ఎత్తివేయాలి -గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల వినూత్న నిరసన



ప్రజాభూమి, హిందూపురం టౌన్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు గాంధీ జయంతి సందర్భంగా వినూత్న నిరసన చేపట్టారు. శుక్రవారం హిందూపురంలో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు. శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హిందూపురంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ చూపిన శాంతియుత మార్గంలో తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల విజయవాడ ధర్నా చౌక్‌లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మహాధర్నా నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. సెప్టెంబర్ 27న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన సచివాలయ ఉద్యోగుల మహాధర్నాలో తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన ఉద్యోగులపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని వారు తప్పుబట్టారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం గళం వినిపించిన ఉద్యోగులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో కీలకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వారి డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గాంధీజీ జయంతి రోజున ఆయన విగ్రహానికి వినతిపత్రం సమర్పించడం ద్వారా శాంతియుత పద్ధతిలో తమ నిరసనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఉద్యోగులు తెలిపారు. గాంధీజీ చూపిన అహింసా మార్గంలోనే తమ హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం, లేపాక్షి, పరిగి మండలాలకు చెందిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు - 2026 జిల్లా స్థాయి కార్యక్రమం

### - : పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్..

### - : జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖల పరిధిలో వివిధ కేటగిరీలలో అవార్డులు పొందిన 71 మందికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను అందజేసిన ఎంపీ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, తదితరులు..







ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న అలెగ్జాండర్ హోటల్ లో గురువారం స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు – 2026లో భాగంగా జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, "భారతదేశ అభివృద్ధి అద్దాల మేడల్లో కాదు, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంది" అనే ఆయన ఆలోచనను వివరించారు. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ గారు 'వికసిత్ భారత్ 2047' ద్వారా గ్రామీణ ప్రాంతాలు మరియు అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుండగా, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు 'స్వర్ణాంధ్ర 2047' విజన్ ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు 'పల్లె పండుగ' ద్వారా వేలాది కిలోమీటర్ల రోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణాన్ని ప్రారంభించారని, రూ.11,500 కోట్లు గ్రామీణ మౌలిక సదుపాయాల కోసం విడుదల చేశారని తెలిపారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గారు నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తూ లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారని, దీని ద్వారా దాదాపు 20 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' తరహాలోనే, మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ప్రారంభించి, రైతుల్లో నాయకత్వ లక్షణాలు మరియు హార్టికల్చర్, అగ్రికల్చర్ రంగాలలో కొత్త టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. హార్టికల్చర్ రంగాన్ని గ్లోబల్ స్థాయిలో నిలిపేందుకు రూ.1 లక్ష కోట్లు కేటాయించగా, అందులో రూ. 40,000 కోట్లు ప్రభుత్వం నుండి, రూ. 60,000 కోట్లు ప్రైవేట్ భాగస్వామ్యంతో కేటాయించారని చెప్పారు. అనంతపురం జిల్లాలో 28 రకాల పండ్ల తోటలు సాగవుతున్నాయన్నారు. జిల్లాలో పాఠశాలలు, దేవాలయాలు, ఎన్జీవోలు, ఆఫీసులు, బస్టాండ్లు, పంచాయతీ భవనాలను శుభ్రంగా నిర్వహిస్తూ, స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వివిధ సంస్థలు, వ్యక్తులకు ఈ రోజు అవార్డులు ప్రదానం చేయడం జరిగిందని తెలిపారు. అనంతపురం జిల్లా నీటిని పొదుపుగా వాడుకుంటూ, డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత రెండు సంవత్సరాలుగా జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని, ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన వారికి ఈరోజు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను అందించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎన్జీవోలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన సుమారు 71 మందిని 22 కేటగిరీలలో గుర్తించి అవార్డులు ప్రదానం చేశామన్నారు. గత ఒక సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాల ఆధారంగా ఆసక్తి ఉన్నవారు స్వయంగా నామినేట్ చేసుకునే అవకాశం కల్పించారని, ఆ వివరాలను పరిశీలించిన తరువాత టాప్ కేటగిరీల వారిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించి విజేతలను ఎంపిక చేశారన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి, రాబోయే 3-4 నెలల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నామన్నారు. కోడ్ ద్వారా ప్రతి ఇంటా చెత్త సేకరణ విధానాన్ని మెరుగుపరిచేందుకు ఈ పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నామన్నారు. అవార్డులు సాధించిన విజేతలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి మాట్లాడుతూ మన ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మరియు అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు మాత్రమే శుభ్రంగా ఉండటం కాదని, మన ఇళ్లతో పాటు వీధులు, గ్రామాలు మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, ప్రజల సహకారం లేకపోతే పూర్తి ఫలితం రాదని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా, తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని, అప్పుడే బలమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. మనకోసం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాల కోసం కూడా ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నా ఇల్లు - నా బాధ్యత, నా వీధి - నా బాధ్యత, నా ఊరు - నా బాధ్యత, నా ఆంధ్రప్రదేశ్ - మన అందరి బాధ్యత అనే సంకల్పంతో అందరం కలిసి స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖల పరిధిలో వివిధ కేటగిరీలలో అవార్డులు పొందిన 71 మందికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ఎంపీ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నాగరాజు నాయుడు, డిఈఓ అయూబ్ హుస్సేన్, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, డిఎంహెచ్‌ఓ డా.కె.వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పిడి సాజిదాబేగం, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, ఆయా శాఖల అధికారులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

# అరటి రైతుకు ఎకరాకు రూ 50 వేలు పరిహారం ఇవ్వాలి

### -దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించిన ఎంపి అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

అకాల వడగండ్ల వాన, ఈదురు గాలుల వల్ల నష్ట పోయిన అరటి రైతులకు ఎకరాకు రూ 50 వేలు ఇన్ పుట్ సబ్సిడీని ప్రభుత్వం అందించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కోరారు. ఈదురు గాలులతో మండలంలోని తాళ్లపల్లి, నందిపల్లె, కుప్పాలపల్లె, టి. వెలమవారిపల్లె, బక్కన్నగారిపల్లె గ్రామాల్లో 400 ఎకరాల్లో అరటి పంట నెలమట్టం అయ్యింది. ఈనేపథ్యంలో తాళ్లపల్లె, కుప్పాలపల్లె, టి. వెలమవారిపల్లె ప్రాంతాల్లో నెలమట్టమైన అరటి పంటను శుక్రవారం కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి పరిశీలించారు. అలాగే అరటి పంట సాగు చేసిన బంక సోమశేఖర్ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, ప్రసాద్ రెడ్డితో పాటు పలువురి రైతులతో పంట నష్టంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాళ్లపల్లె ,కుప్పాలపల్లె ,బక్కన్నగారి పల్లె, టి.వెలమవారిపల్లె గ్రామాల్లో అరటిపంటకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో కోత కోసి మార్కెట్ కు వెళ్లాల్సిన అరటి గెలలు ఈదురు గాలులకు నేలకు వరగడం చాలా బాధకరమని తెలిపారు. వడగండ్ల వాన, ఈదురు గాలులకు నాలుగు గ్రామాల్లో దాదాపు 500 ఎకరాలు వరకు అరటి పంట ధ్వంసం కావడంతో రైతుకు తీరని నష్టం జరిగిందని తెలిపారు. క్రాప్ ఇన్సూరెన్స్ విధానంలో లోపాలు ఉండడంతో పాటు నిబంధనలు పూర్తిగా లోపభూయిష్టంగా ఉన్నట్లు చెప్పారు.

**వాతావరణ ఆధారిత స్టేషన్ నమోదుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు.**

గ్రామాల్లో 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తే వేంపల్లెలో ఉన్న వాతావరణ ఆధారిత స్టేషన్ లో కేవలం 5 నుండి 6 కిలోమీటర్ల వేగమే నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఆ వాతావరణ ఆధారిత స్టేషన్ రీడింగ్ ద్వారా భీమాను నిర్ణయించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాలను, భీమా కంపెనీలను ఎంపి ప్రశ్నించారు. ఇన్సూరెన్స్ కంపెనీలు నిబంధనలు పేరుతో పంటల బీమాలో కోతలు కోయడం తగదని తెలిపారు. ఎకరాకు రూ 3 వేలు పంటల భీమా కింద ప్రీమియం రైతులు చెల్లిస్తున్న రైతుకు భీమా ఇస్తున్న సమయంలో మాత్రం 50 కిలోమీటర్ల వేగంతో గాలి వీస్తేనే ఇన్సూరెన్స్ ఇస్తామని చెప్పడం అన్యాయమని తెలిపారు. నష్టపరిహారం ఇచ్చే సమయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని లోపాలను సరిదిద్ది ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా నష్టపోయిన ప్రతి రైతుకు పంటల భీమా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నెలవారిన అరటి గెలలు ఒక్కోకటి 30 కిలోలు ఉన్నాయని తెలిపారు. రైతుకు జరిగిన నష్టాన్ని చూస్తే బాధను కల్గిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి భారీ నష్టం జరిగినప్పుడు ప్రభుత్వాలు ముందుకు వచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. అరటి సాగు రైతుకు సగటున ఎకరాకు రూ 2 లక్షల వరకు ఖర్చు అవుతున్నదని తెలిపారు. అదే విధంగా భీమా విషయంలో కూడ గడిచిన 2 సంవత్సరాల నుండి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. మళ్లీ మరోక్క సారి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లుతున్నమని తెలిపారు. రైతులపై భారం అనేది పెట్టకుండా ఇన్సూరెన్స్ కంపెనీలు, ప్రభుత్వాలు ఒక్కసారి ఆలోచించాలని కోరారు. రైతులకు నష్టం జరిగింది కాబట్టి కచ్చితంగా నష్ట పోయిన అరటి రైతులను ప్రభుత్వం, భీమా కంపెనీలు ఆదుకోవాలని కోరారు. లోపాన్ని సరిచేసి నష్ట పోయిన ప్రతి రైతుకు పంటల భీమాను అందించాలని గట్టిగా ప్రభుత్వాన్ని కోరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, వైసీపీ బిసి జిల్లా ప్రధాన కార్య దర్శి కొట్లూరు సుదర్శన్, వైసీపీ నేతలు ఉత్తమారెడ్డి, ప్రసాద్ రెడ్డితో పాటు రైతులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలకు కూటమి ప్రభుత్వం నిదర్శనం- మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి



ప్రజాభూమి, జమ్మలమడుగు

మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ సింగం రెడ్డి నాగేశ్వర రెడ్డి జమ్మలమడుగు పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాత్మా గాంధీ కలలు కన్న స్వరాజ్యం ఈ రోజు కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామం గ్రామ స్వరాజ్యంగా అద్భుతంగా ఉందని, అలాగే దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతీ గ్రామంలో పట్టణవసతులు కల్పించాలన్న ఆయన కలకూడా నెరవేరిందని ఆయన తెలిపారు అలాగే మోరగుడి పీహెచ్సీ సెంటర్లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్వర్ రెడ్డి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మరియు జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి ఆదేశాల మేరకు మొరుగుడి ప్రైమరీ హెల్త్ సెంటర్ లో మొక్కలు నాటి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో హెల్త్ సెంటర్ డాక్టర్లు సిబ్బంది, మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.వెంకట్రామి రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# డిప్యూటేషన్ హెచ్‌ఎంలతో పాఠశాలల్లో ఇబ్బందులు

### బోధనతో పాటు పరిపాలనా బాధ్యతలు.. ఎఫ్ఏసీ హెచ్‌ఎంలపై అదనపు భారం
### డీడీఓ అధికారాలు కల్పించాలని మండల ప్రజల డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి, అడ్డతీగల:

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుండటంతో ఎఫ్ఏసీ హెచ్‌ఎంలపై అదనపు భారం పడుతోంది. ఒక హెచ్‌ఎం జిల్లా కేంద్రంలో, మరో హెచ్‌ఎం పక్క మండలంలో ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయా పాఠశాలల్లో ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వహిస్తున్న హెచ్‌ఎంలు బోధనతో పాటు పాఠశాల పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించాల్సి వస్తోంది.రోజువారీగా పలు తరగతులకు పాఠాలు బోధించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, చిక్కీలు, గుడ్లు, బియ్యం తదితర సామగ్రికి సంబంధించిన ఇండెంట్లు, నెలవారీ శాలరీ బిల్లులు, ఇతర పరిపాలనా పనులను కూడా చూసుకోవాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు బోధించాల్సిన సమయంలో పాఠశాల నిర్వహణ పనుల కోసం సమయం కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**డీడీఓ అధికారాలు డిప్యూటేషన్ హెచ్‌ఎంల వద్దే..**రెగ్యులర్ హెచ్‌ఎంలు డిప్యూటేషన్‌పై వెళ్లినప్పటికీ డీడీఓ అధికారాలు వారి వద్దే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల టీసీలపై సంతకాలు, శాలరీ బిల్లులు, ఇండెంట్లు తదితర కీలక వ్యవహారాల కోసం డిప్యూటేషన్‌పై వెళ్లిన హెచ్‌ఎంలను సంప్రదించాల్సి వస్తోంది. ఇందుకోసం పాఠశాల సిబ్బంది జిల్లా కేంద్రం లేదా సంబంధిత కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**టీసీల కోసం విద్యార్థుల ఎదురుచూపులు..**విద్యార్థులు లేదా తల్లిదండ్రులు టీసీల కోసం పాఠశాలకు వచ్చినప్పుడు సంబంధిత సంతకం అవసరం కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డిప్యూటేషన్‌పై వెళ్లిన హెచ్‌ఎం పాఠశాలలో అందుబాటులో లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో టీసీలు వెంటనే అందించలేని పరిస్థితి నెలకొంటోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థుల తదుపరి విద్యాభ్యాసానికి అవసరమైన టీసీలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**ఎఫ్ఏసీ హెచ్‌ఎంలకు డీడీఓ అధికారాలు ఇవ్వాలి..**ప్రస్తుతం పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఏసీ హెచ్‌ఎంలకు డీడీఓ అధికారాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు. డీడీఓ అధికారాలు అందుబాటులో ఉంటే టీసీలు, శాలరీ బిల్లులు, ఇండెంట్లు తదితర పరిపాలనా పనులు పాఠశాల స్థాయిలోనే సకాలంలో పూర్తయ్యే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. విద్యార్థుల బోధనకు ఆటంకం కలగకుండా పాఠశాలల పరిపాలన సజావుగా సాగేందుకు ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.




# భీముడుపాకలులో ఘనంగా గాంధీ జయంతి

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

మండలంలోని భీముడుపాకలులో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి అడ్డతీగల మండల టీడీపీ అధ్యక్షుడు జర్త వెంకటరమణరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వంకా సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలొజు విశ్వారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జర్త వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, సేవా స్ఫూర్తి వంటి గాంధీజీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కను నాటారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించి భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో సింగోజి చెల్లారావు, సింగోజి శ్రీను, చదువు రామకృష్ణ, పులగం వెంకటరమణ, మాడి బాలరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ లో సత్తా చాటిన సోములగూడెం ఆశ్రమ పాఠశాల బాలికలు

### 4 బంగారు పతకాలు, ఫుట్ బాల్ లోనూ రాష్ట్ర స్థాయికి ఎంపిక

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

2026-27 స్కూల్ గేమ్స్ లో భా గంగా ఉమ్మడి జిల్లా స్థాయి పోటీ లు కాకినాడలో జరిగాయి. సెప్టెంబర్ 30న జరిగిన ఫుట్ బాల్ పోటీలు, అక్టోబర్ 1న జరిగిన కుస్తీ పోటీలలో సోములగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కుస్తీలో 4 బంగారు పతకాలు, అండర్-17 విభాగంలో 40 కేజీల్లో 10వ తరగతి బి. సరిత, 43 కేజీల్లో 10వ తరగతి బి. శ్రావణి బంగారు పతకాలు సాధించారు. అండర్-14 విభాగంలో 30 కేజీల్లో 8వ తరగతి కె. దివ్య, 42 కేజీల్లో 9వ తరగతి కె. సరిత బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నలుగురు కుస్తీలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఫుట్ బాల్ లోనూ ప్రతిభ అంతేకా కుండా 9వ తరగతి విద్యార్థిని కె. సరిత ఫుట్ బాల్ పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఒకే విద్యార్థిని రెండు క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం విశేషం. విద్యార్థుల విజయంపై పీడి లు శివకుమార్, భద్రమ్మ, ప్రధానోపాధ్యాయులు మురళీ మనోహర్ రావు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.







# స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

### రాజవొమ్మంగిలో 'స్వచ్ఛ రథం' ప్రారంభించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజా భూమి,రాజవొమ్మంగి:



రాష్ట్ర కూటమి ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' లక్ష్యంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద ఎంపీడీవో లోకుల యాదగిరేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని 'స్వచ్ఛ రథం' వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడమే ఈ రథం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలోనూ తిరుగుతూ ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్, గాజు సీసాలు, స్టీల్, అల్యూమినియం వంటి పొడి చెత్తను బరువును బట్టి సేకరిస్తారని వివరించారు. దానికి ప్రతిఫ లంగా ప్రజలకు అవసరమైన సబ్బులు, షాంపూలు, పంచదార సహా 17 రకాల నిత్యావసర సరుకుల ను నిర్ణీత ధరల ప్రకారం అందజేస్తారని వెల్లడించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజ లంతా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.అంగన్‌వాడీ అంటే నా కుటుంబం: ఎమ్మెల్యే శిరీషాదేవిఅనంతరం రాజవొమ్మంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఎమ్మెల్యే శిరీషాదేవి యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ప్రాజెక్టులోని 103 కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫామ్‌లను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. "అంగన్‌వాడీ అంటే నా స్వంత కుటుంబం లాంటిది. గతంలో అంగన్ వాడీ వర్కర్‌గా సేవలు అందించి, నేడు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం నా అదృష్టం" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉద్యోగులు, వర్కర్లు, హెల్పర్లకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా వట్టిగడ్డలోని తన క్యాంపు కార్యాలయానికి వచ్చి తెలియజేయవచ్చని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, ముప్పన సావిత్రి, సీడీపీఓ అనంతలక్ష్మి, ఈవోపీఆర్డీ విజయ్ కుమార్, గ్రామ వార్డు సచివాలయ అధికారి పైడిరాజు, పంచాయతీ అభివృద్ధి అధికారి పి. చరణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వైయస్సార్సీపి నాయకుల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి, వి.ఆర్.పురం.

వైయస్సార్సీపి మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో రేకపల్లి గ్రామంలో గాంధీ జయంతి వేడుకలను, శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన నాయకులలో గాంధీజీ అగ్ర గన్యుడని, ప్రజలు అతనిని మహాత్ముడని జాతిపితని గౌరవిస్తారని, సత్యము అహింస గాంధీజీ నమ్మే సిద్ధాంత మూలాలని సత్యాగ్రహము సహాయ నిరాకరణ ఆయన ఆయుధాలని, కొల్లాయి కట్టి చేత కర్ర బట్టి నూలు వడికి మురికి వాడలు శుభ్రం చేసి, అన్ని కులాలు మతాలు ఒకటేనని చాటి చెప్పిన మహాత్ముడు గాంధీజీ అని మనమంతా ఆయన అడుగుజాడల్లో నడవాలని గాంధీజీ కన్నా కలలు సాకారం కావాలంటే, గ్రామ స్వరాజ్యం రావాలంటే అంటే మళ్లీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ముత్యాల మురళి, మండల జనరల్ సెక్రెటరీ మోడెమ్ నరేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్యాల రాంబాబు, శ్రీరామగిరి దేవస్థానం మాజీ చైర్మన్ రేవు బాలరాజు, ఆర్టిఐ విభాగం మండల అధ్యక్షుడు ముత్యాల జయరాజు, ఎస్ సి సెల్ నాయకుడు మాచర్ల వెంగళరావు, సోషల్ మీడియా అధ్యక్షుడు పలివెల పవన్, సాయి మండల ఎగ్జిక్యూటివ్ నెంబర్ కాపారపు నాగు, మండల కమిటీ మెంబర్ సోడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన టీడీపీ నాయకులు

ప్రజాభూమి ప్రతినిధి, వి.ఆర్.పురం.



జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, మండల ఎంపీడీవో ఇమాన్యుల్ శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ మాట్లాడుతూ గాంధీజీ ఆలోచనలు కేవలం రాజకీయ స్వాతంత్ర్యానికే పరిమితం కాలేదు. అణగారిన వర్గాల అభ్యున్నతి, అస్పృశ్యత నివారణ, మత సామరస్యం, మహిళా సాధికారత వంటి సామాజిక సంస్కరణలకు ఆయన ప్రాధాన్యతనిచ్చారనీ, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, ప్రకృతి ప్రేమికుడు సవలం రాజేంద్రప్రసాద్, బీరకాయ ప్రకాష్ రావు, ముత్యాల చంద్రశేఖర్, జెడ్పి హై స్కూల్ చైర్మన్ ముత్యాల సీతామహాలక్ష్మి, వైస్ చైర్మన్ మోదుగు వెంకన్నబాబు, చక్రపాణి, బింగి విష్ణు, గూటాల శ్రీను సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మహాత్మునికి నివాళి సమష్టి బాధ్యత: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాభూమి,రాజవొమ్మంగి:

మహాత్మా గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పిలుపునిచ్చారు. గాంధీజీకి నివాళులు అర్పించడం యావత్తు జాతి సమష్టి బాధ్యత అన్నారు.రాజవొమ్మంగి మండలం గడువోకుర్తి పంచాయతీ చీడిపాలెంలో శుక్రవారం గాంధీజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం, సేవాభావం వంటి గాంధీజీ ఆశయాలను ప్రజలు ఆచరణలోకి తీసుకురావాలని కోరారు. సర్వమత సమ్మేళనం, స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణం విషయంలో గాంధీజీ చూపిన మార్గం నేటికీ ఆదర్శప్రాయమన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

సేవా సంకల్ప్ అభియాన్–సేవా మేరా యోగ్‌దాన్ కార్యక్రమంలో భాగంగా చీడిపాలెంలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పల్లె పండుగ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి బాటలు వేయవచ్చని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, సీనియర్ టీడీపీ నాయకులు గణజాల తాతారావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, బారంగి అనుదీప్, చెక్కా పండుబాబు, ఎలిశెట్టి అప్పలరాజు, పంచాయతీ నాయకులు ముర్ల వీరబాబు, చలుమర్తి బన్ను, రెడ్డి వెంకటరమణ, పడాల కాటమరాజు, సూరిశెట్టి సురేష్, వాడపల్లి గంగరాజు, చెక్కా లోవరాజు, APO శ్రీనివాస్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణదొర, పంచాయతీ కార్యదర్శి, VRO, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 30 కిలోల గంజాయి పట్టివేత

### ఆరుగురు అరెస్ట్.. రూ.1.50 లక్షల విలువైన గంజాయి స్వాధీనం కారు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్




ప్రజాభూమి ప్రతినిధి,అడ్డతీగల




గంజాయి అక్రమ రవాణాపై అడ్డతీగల పోలీసులు కొరడా ఝుళిపించారు. వేటమామిడి గ్రామ శివారులో గురువారం నిర్వహించిన తనిఖీల్లో 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.50 లక్షల విలువైన గంజాయితోపాటు హ్యుందాయ్ ఆరా కారు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అడ్డతీగల సీఐ ఎం. గజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ బి.వినోద్, ఈగల్ టీమ్ సిబ్బందితో కలిసి వేటమామిడి శివారులోని జీడిమామిడి తోటల పరిసరాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. వై.రామవరం వైపు నుంచి రెండు బైక్‌లు, హ్యుందాయ్ ఆరా కారులో వచ్చిన వ్యక్తులు పోలీసులను గమనించి వాహనాలను వెనక్కి తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించారు.అప్రమత్తమైన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరవింద్ అనే వ్యక్తి గంజాయి బ్యాగ్‌ను పడేసి అటవీ ప్రాంతంలోకి పరారైనట్లు పోలీసులు తెలిపారు.



NDPS చట్ట నిబంధనల మేరకు తహసీల్దార్ కె.తేజస్విని, వీఆర్వో బేతం శిరీష, వీఆర్ఐ అరగాటి వెంకటరెడ్డి సమక్షంలో సోదాలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

**బెంగళూరు, విజయవాడకు తరలింపు...**నిందితులు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి బెంగళూరు, విజయవాడ ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఆరు ప్యాకెట్లలో ఉన్న 30 కిలోల గంజాయిని కారు, బైక్‌లపై తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.ఈ కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి NDPS చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# అడ్డతీగలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

ప్రజాభూమి,ప్రతినిధి, అడ్డతీగల



మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం స్వప్నకుమారి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ప్రపంచానికి చాటిచెప్పిన సత్యం, అహింస, సేవా మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలోకి తీసుకువచ్చి సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ ఎంపీపీ అన్నం సత్తిబాబు, దంగేటి సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ పుడికి ఆదిలక్ష్మి, సతీష్, బీర వెంకటలక్ష్మి, తెలుగు యువత అధ్యక్షుడు రాజా కాళ్ల లక్ష్మణ్ రమణ, చోళ కృష్ణారెడ్డి, నరసయ్య తదితరులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

మండలంలోని బొడ్డంక గ్రామపంచాయతీలో సంస్కరణ ఉత్సవంలో భాగంగా ప్రత్యేక గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి వీవీవీ కుమార్ అధ్యక్షతన, పంచాయతీ అభివృద్ధి అధికారి కే. అశోక్ ఆధ్వర్యంలో సభ జరిగింది.ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం చేపడుతున్న వివిధ సంస్కరణలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ప్రజలందరూ సహకరించాలని అధికారులు కోరారు. ఇ వి ఆర్ ఎస్ కాల్స్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, BIN-BAG విధానం ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు సహకరించాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకుడు కట్టా రాఘవ (టీడీపీ), పాతర సీతామహాలక్ష్మి (జనసేన మహిళా–పెసా అధ్యక్షురాలు), లోతే దుర్గాప్రసాద్ (జనసేన కార్యకర్త), ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్–2026లో పోలవరం జిల్లాకు 47 అవార్డులు

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్–2026లో పోలవరం జిల్లాకు వివిధ విభాగాల్లో అవార్డులు ఎంపికయ్యాయి. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్రా అవార్డ్ 2026 ప్రధానోత్సవ కార్యక్రమం లో ఆయా విభాగాల వారీగా అవార్డు పొందిన వారి వివరాలు:

స్వచ్ఛ గ్రామ పంచాయతీ – ఇందుకూరు – వి. సత్యనారాయణ; కోనలోవ – డి.ఎస్.ఎస్.వి.ఎస్. మూర్తి;నెల్లిపూడి – యాదల నానాజీ;జడ్డంగి – ఆర్. కిషోర్;ఐ పోలవరం – వి. వినోలి.

గ్రామ పంచాయతీలు...లక్ష్మీ పురం, అడ్డతీగల , చింతూరు, రంపచోడవరం, వై.రామవరం.

స్వచ్ఛ పాఠశాలలు...పి.పి.ఎస్. పట్టి – బి ముత్తయ్య ;జి.ఎ.హెచ్.ఎస్. దేవరపల్లి డి నాగేశ్వర రావు;జి.ఎ.హెచ్.ఎస్. ముసురుమిల్లి – ఎమ్ బాలరాజు;జి.ఎ.హెచ్.ఎస్. (బాలికలు) యర్రగొడ్డ –. కె పాపని;ఎం.పి.ఎ.ఎస్. పెదపులెంపాడు కె అదయ్య,

స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రాలు..తుంగముడుగుల కేంద్రం; పి. వెంకటలక్ష్మి;పాములేరు – సూత్రం పోతమ్మ;దుసరిపాము – జి లక్ష్మీపద్దే గూడెం – పి లక్ష్మి కుమారి;తోటకూర పాలెం – కె రాములక్ష్మి,

స్వచ్ఛ ఆసుపత్రులు...సీ హెచ్ సీ రంపచోడవరం – డా వి.సూర్య ప్రకాష్ ;అడ్డతీగల సిహెచ్సి – డా పి. మహేష్ రెడ్డి;కూనవరం సి హెచ్ సి –; డా కె మహేష్ బాబు;పీహెచ్‌సీ మారేడుమిల్లి – డా. నాగమా చైతన్య;పీహెచ్‌సీ రేఖపల్లి – డా. ఆర్. స్వర్ణలత;జెడ్డంగి పి హెచ్ సి వి ప్రమీల;పి హెచ్ సి ఇందుకూరు పేట డా టి డేవిడ్ రిడ్లర్;పి హెచ్ సి గంగవరం డా కె ఎస్ శ్వేత దేవి;పి హెచ్ సి సీతపల్లి డా ఎమ్. కెవిన్.

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు...ఐటీడీఏ కార్యాలయం – జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్;గ్రామ పంచాయతీ, రంపచోడవరం – జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్;ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ – జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్.

స్వచ్ఛ రైతు బజార్...పచోడవరం రైతు బజార్ఎం. కృష్ణమోహన్.

స్వచ్ఛ వసతి కేటగిరి వర్గం...స్వచ్ఛ వసతి గృహం (సాంఘిక సంక్షేమం) – ఎస్‌డబ్ల్యూటీహెచ్ గౌరీదేవి పేట – అనుభవం దుర్గాపవన్‌కుమార్ స్వచ్ఛ వసతి గృహం (బీసీ సంక్షేమం) – పి దుర్గా భవాని, స్వచ్ఛ వసతి గృహం (గిరిజన సంక్షేమం) – జీటీడబ్ల్యూఏస్ (బాలికలు), చింతూరు – వాడపల్లి లక్ష్మీ

ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్–సుప్పంపాడు – ఎం. రామన్నదొర;ఐ పోలవరం – పి గంగా చలం;నెల్లి పూడి– ఏ లక్ష్మణ్ రావు; జెడ్డంగి – జె వీర రాఘవులు ;కోనలోవ – సిహెచ్. వీరబాబు ;

స్వచ్ఛ పర్యాటక ప్రదేశాలు, వారసత్వ ప్రదేశాలు– పొల్లూరు జలపాతం – డీ దాసు;

స్వచ్ఛ దేవాలయాలు, ఆధ్యాత్మిక సంస్థలు– శ్రీ గండి పోచమ్మ అమ్మవారి ఆలయం, ఏటపాక మండలం – జి.వి.ఎల్. లక్ష్మీకుమార్, కార్యనిర్వహణ అధికారి;

స్వచ్ఛ రథం – ఎటిపాక మండలం ప్రగల్ల రమేష్

సామాజిక మాధ్యమ ప్రభావశీలి – పోలవరం జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి ఎం. లక్ష్మణాచార్యులు.

# స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

## గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు–2026 ప్రధానోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రంపచోడవరం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు–2026 ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా






జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జిల్లా పంచాయతీ అధికారి గొర్లె భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్రా అవార్డ్ 2026 కార్యక్రమంలో ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి, పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, ప్రజాప్రతినిధులు, నూతనంగా బాధ్యతలు స్వీకరిం చిన ఐఏఎస్ అధికారులు, వివిధ శాఖల అధికా రులు, సిబ్బంది, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

**స్వచ్ఛత ప్రతి పౌరుడి బాధ్యత: కలెక్టర్ కె. దినేష్ కుమార్**

కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం, స్వేచ్ఛ లభించడం వెనుక గాంధీ జీతో పాటు ఎంతోమంది త్యాగధనుల కృషి ఉందన్నారు. వారు కలలుగన్న భారతదేశాన్ని నిర్మించే బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని పేర్కొన్నారు. గాంధీజీ బోధించిన ముఖ్యమైన విలు వల్లో పరిశుభ్రత కూడా ఒకటని, స్వాతం త్ర్యం తో పాటు పరిశుభ్రతకు కూడా సమాన ప్రాధా న్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపా రు. 2014 నుంచి స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రజలందరికీ సుపరిచితమైందని, ప్రజల భాగ స్వామ్యం తోనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర కార్య క్రమాలు విజయవంతమవుతాయని చెప్పారు. స్వచ్ఛాం ధ్ర–స్వర్ణాంధ్ర విజన్–2047 సాధించా లంటే ముందుగా మన గ్రామాలు, పట్టణాలు, పర్యాటక ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**చెత్తను పడేసే ముందు ఒక్క క్షణం ఆలోచించాలి..**పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్లాస్టిక్, గాజు సీసాలు, ఇతర వ్యర్థాలను ఇష్టారీతిన పడేయడం వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు, ముఖ్యంగా పశువులకు తీవ్ర నష్టం కలుగుతోందని కలెక్టర్ తెలిపారు.చెత్తను బయట పడేసే ముందు “ఒక్క క్షణం ఆలోచించి” సరైన చెత్తబుట్టలో వేయడం ప్రతి ఒక్కరి అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత కోసం కోట్లాది రూపాయల నిధుల కంటే ప్రజల్లో బాధ్యత, స్వయం క్రమశిక్షణ పెరగడం ముఖ్యం అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు, ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తాయని తెలిపారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

**ప్రతి నెల ఒక పర్యాటక ప్రాంతంలో శ్రమదానం..**ఏజెన్సీ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి నెల ఒక పర్యాటక ప్రాంతాన్ని ఎంపిక చేసి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం ద్వారా పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు.చెత్త వేసిన తర్వాత దానిని తొలగించడం కంటే, చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం ఎంతో సులభమని చెప్పారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రతి పౌరుడి బాధ్యతగా భావించినప్పుడే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు.

**స్వచ్ఛతలో జిల్లా పురోగతి..**స్వచ్ఛత కార్యక్రమాల అమలులో జిల్లా గతంతో పోలిస్తే గణనీయమైన పురోగతి సాధించిందని కలెక్టర్ తెలిపారు. ఆరు నెలల క్రితం అందిన అభిప్రాయాల ప్రకారం జిల్లా 26వ స్థానంలో ఉండగా, అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ప్రస్తుతం 14వ స్థానానికి మెరుగుపడిందన్నారు.జిల్లాలో ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాలను పునరుద్ధరించి తిరిగి పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందించడం ద్వారా మరింత మంది స్ఫూర్తి పొందేలా చేస్తున్నామని పేర్కొన్నారు.

**స్వచ్ఛతను జీవిత విధానంగా మార్చాలి - ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి**

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా “స్వచ్ఛతా హి సేవా” కార్యక్ర మాన్ని నిర్వహించడం గొప్ప సందేశాన్ని ఇస్తోందన్నారు. గ్రామాలు, ఇళ్లు, కార్యాల యాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహాత్మా గాంధీతో పాటు దేశ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సేవలు, ఆశయాలను స్మరిం చుకుని వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పరిశుభ్రత అలవా టును చిన్ననాటి నుంచే పిల్లల్లో పెంపొందించాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో పోలవరం జిల్లాను పరిశుభ్రతలో అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

**రంపచోడవరాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం:- ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**

ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నా రు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యం తో ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపా రు. పారిశుధ్యం, రహదారులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయడం వల్ల మంచి పురోగతి సాధిస్తున్నామని చెప్పారు.

దుకాణాలు, ఇళ్ల వద్ద చెత్తబు ట్టలు ఏర్పాటు చేసుకుని వ్యర్థాలను వాటిలోనే వేయాలని ప్రజలకు సూచించారు. పరిశుభ్రత విష యంలో పదేపదే నిర్లక్ష్యం చేసే వారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. పారిశుధ్య నిర్వహ ణలో మెరుగైన సేవలు అందించిన వారికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందించడం అభినందనీయమన్నారు.

**ప్రతిభ కనబరిచిన వారికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు**..స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచిన 47 మంది అవార్డు గ్రహీతలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీతలను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, అవార్డు గ్రహీతలు, సిబ్బంది స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, కార్యాలయం, గ్రామం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఇతరులకు కూడా ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

**రంపచోడవరం సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ మాట్లాడుతూ**..దేశ స్వాతంత్ర్యం కోసం ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాలు నిర్వహించి స్వాతంత్ర్య సాధనకు కృషి చేసిన మహాత్మా గాంధీని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నూతన పోలవరం జిల్లాను స్వచ్ఛ పోలవరం జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని, పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి ముందుకు సాగాలని ఆయన అన్నారు.

**చింతూరు సబ్ కలెక్టర్ నరేంద్ర పడాల్ మాట్లాడుతూ**.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలకు చెందిన మొత్తం 47 మందికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందుకోవడం అభినందనీయమన్నారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములై సమాజానికి ఆదర్శంగా నిలిచిన వారిని గుర్తించి సత్కరించడం ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.

**రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత మాట్లాడుతూ** .. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అంటువ్యాధుల వ్యాప్తిని నివారించి ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చూడవచ్చన్నారు. పోలవరం జిల్లాలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్లు పృథ్వీ రాజ్ కుమార్, సీహెచ్. నరేంద్ర పడాల్, మైనార్టీ బోర్డు డైరెక్టర్ షేక్ సుభాని, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మండయ్య, సత్యనారాయణమూర్తి, మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వర రావు, జిల్లా పర్యాటక అధికారి జి. దాసు, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, ఏపీవో జనరల్ డీఎన్‌వీ రమణ, జిల్లా పంచాయతీ అధికారి గొర్లె భాస్కర్, డివిజనల్ పంచాయతీ అధికారి ఎర్రంశెట్టి రాజు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకర్‌రావు, డ్వా మా పీడీ రాంప్రసాద్, ఏజెన్సీ డీఈఓ వై. మల్లేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదా నం, పీహెచ్‌ఓ నరేంద్రకుమార్, డీసీహెచ్‌ఎస్ సాంబశివరావు, రంపచోడవరం, అడ్డతీగల ఆసుపత్రుల సూపరింటెండెంట్లు సూర్యప్రకాశరావు, ప్రభాకర్‌రావు, ఈఈ ఐ. శ్రీనివాసరావు, సీపీఓ వెంకట్రావు, ఎంపీడీఓ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ హరిబాబు, ఉమ్మడి కూటమి నాయ కులు పి. శ్రీనివాసరావు, కె. రాజ్‌కుమార్‌రెడ్డి, అడబాల బాపిరాజు, సిద్ధ వెంకన్నబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఎబి ఫౌండేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన తుష్టి జోగారావు

❖ 60 నిరుపేద కుటుంబాలకు అన్నదానం మరియు చిన్నారులకు బిస్కెట్ల వితరణ ❖ భద్రాచలం ప్రవేట్ ఆసుపత్రిలో డయాలసిస్ తో బాధపడుతున్న వ్యక్తికి 3000 రూపాయలు ఆర్థిక సాయం ❖ కష్టాల్లో ఉన్న ప్రతి పేదవాడి గుండె చప్పుడు ఏబి ఫౌండేషన్ కావాలి: ఫౌండేషన్ చైర్మన్ కుంజా అనిల్



ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

మండలంలోని ఏబి ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్ కుంజా అనిల్ ఆధ్వర్యంలో కోతులు గుట్ట ఐటీడీఏ ఫామ్ లో నివాసముంటున్న సుమారు 60 కొండా రెడ్డి నిరుపేద కుటుంబాలకు భోజనాలు మరియు చిన్నారులకు బిస్కెట్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగిందని అన్నారు. భద్రాచలం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డయాలసిస్ వైద్యం చేయించుకుంటున్న చినార్కూర్ గ్రామానికి చెందిన పాయం పాపారావు కి అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం 3000 రూపాయలు మరియు కుటుంబ సభ్యులకు భోజనాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి ఏ రోజు ఏ అవసరం వచ్చిన మీ వెంట చిన్న సహాయం చేయడానికి ఏబి ఫౌండేషన్ ఎప్పుడు మీ ముం దు ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు లేకుండా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఏబి ఫౌండేషన్ తమ వెంట ఉంటుందని, కడుపు నిండిన వారికి కష్టం విలువ తెలియదు ఆకలి వేసిన వాడికి అన్నం విలువ తెలుస్తుంది. అన్న నానుడి లాగా మేము చేసే సహాయం చిన్నదైనా మీకు మీ కష్టానికి తోడ్పాటును ఇస్తే చాలు అనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ సంస్థ ప్రారంభించడం జరిగిందని కుంజా.అనిల్ ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించిన తుష్టి జోగారావు మాట్లాడుతూ సంస్థ చేస్తున్నటువంటి కార్యక్రమాలు మునుముందు మంచి గుర్తింపు తీసుకురావాలని నేడు ప్రారంభమైన ఈ సంస్థ రానున్న కాలంలో అత్యున్న శిఖరాలను అధిరోహించాలని ఈ సంస్థకు మునుముందు మంచి సాకారాలు అంది పెద్ద స్థాయికి ఎదగాలని మీరు చేసే సహాయాలు నిజమైన నిరుపేద ప్రజలకు అందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ సోడే ముత్తయ్య అధ్యక్షులు మచ్చ వినయ్ ప్రసాద్ ఉపాధ్యక్షులు కె.కిరణ్ బాబు , సంస్థ సభ్యులు తోడం వినోద్, ప్రజలు భూమిరెడ్డి తమ్మిరెడ్డి ముక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## వన్యప్రాణుల సంరక్షణ మన అందరి భాధ్యత

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అని, మానవ మనుగడకు, ప్రకృతి సమతుల్యతకు ఎంతో అవసరమని, ఇది కేవలం ప్రభుత్వాల బాధ్యతే కాదు, ప్రతి ఒక్కరు కలిసి చేయాల్సిన సామూహిక బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం వి.ఆర్.పురం రేంజ్ ములకపల్లి గ్రామం వద్ద వన్యప్రాణి అవగాహన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2 నుండి 8వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాలలో భాగంగా వి. ఆర్. పురం రేంజ్ సిబ్బంది అటవీ పరిసర ప్రాంతాల ప్రజలకు వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై స్తానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ ఆర్ ఓ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడితే భవిష్యత్ తరాలను కాపాడినట్లే అని, వన్యప్రాణులను కాపాడుట మన అందరి బాధ్యత, వన్యప్రాణులను వేటాడుట చట్టరీత్యా నేరము కావున చెట్లను నరుకుట, వన్య ప్రాణుల వేటాడుట చేయరాదనీ, జీవవైవిద్యం సమతుల్యతను కాపాడుట ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడిగుప్ప వీఆర్వో ఎం శ్రీనివాస్ రెడ్డి, తుమ్మి లేరు ఎఫ్ ఎస్ ఓ బి చుక్కయ్య, జీడి గొప్ప ఎఫ్బి ఓ ఆదిలక్ష్మి, దారపల్లి ఎఫ్బి ఓ పి భాస్కర్, తుమ్మి లేరు ఎఫ్బి ఓ ఐ నాగార్జున, పోచవరం ఎఫ్ బి ఓ ఎం సావిత్రి, దారపల్లి బేస్ క్యాంప్ వాలంటీర్లు, యానిమల్ ట్రాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ, శాస్త్రి జయంతి సందర్భంగా ఘన నివాళులు



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

మహాత్మా గాంధీ, భారతదేశ రెండవ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా మహనీయులకు నివాళులర్పించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి ఎస్పీ మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే సిద్ధాంతాలతో మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపారని తెలిపారు. గాంధీ ఆశయాలు, నైతిక విలువలు నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచారని తెలిపారు. దేశం పట్ల అంకితభావంతో సేవలందించిన ఆయన 'జై జవాన్–జై కిసాన్' నినాదంతో సైనికులు, రైతుల ప్రాధాన్యతను చాటిచెప్పారని గుర్తు చేశారు.మహనీయుల జీవితాలు, వారి నైతిక విలువలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎస్పీ అన్నారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం, భద్రత కల్పించడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ ఆశయాలను ఆచరించడమే నిజమైన నివాళి

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

గాంధీ జయంతి సందర్భంగా అడ్డతీగల మండల కేంద్రంలోని కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పార్కు, కాంప్లెక్స్ ప్రాంగణంలో శుక్రవారం ప్రత్యే క కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్కు, పరిసర ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పుడిగి ఆదిలక్ష్మి, వంక సతీష్, దంగేటి సత్తిబాబు, సాకేటి రాజా, బీర వెంకటలక్ష్మి, నెంబర్ అప్పారావు, రాము, మడకం పండుబాబు తదితర కూటమి నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

# ప్రజాభూమి

జనరల్ 13

శనివారం 3 అక్టోబరు 2026


**వెదిరేశ్వరం ఎస్సీ ఏరియాలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి**

గ్రామసభలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన స్థానికులు.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని వెదిరేశ్వరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ ఏరియాలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను సామాజిక కార్యకర్త బడుగు సుబ్బాయమ్మ, పాము నాగరాజు, బడుగు మహిమారావు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. గత పదేళ్లుగా ఎస్సీ ఏరియాలో ఆశించిన స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇందిరా గాంధీ విగ్రహం ఆవరణ పరిసరాల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ పంచాయతీ కార్యదర్శి వి. సబితకు వినతిపత్రం అందజేశారు. గ్రామసభల్లో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ తమ ప్రాంతంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై తగిన చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. ఈసారి నిర్వహించిన గ్రామసభ తీర్మానంలో ఎస్సీ ఏరియాలో రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారాన్ని ప్రత్యేకంగా పొందుపరిచి, ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు పొడిగింపు

**సీఐ మద్ది రామ శేషయ్య**

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 193 మద్యం షాపులకు గాను 168 మద్యం షాపుల లైసెన్సీదారులు వారి లైసెన్సును రెన్యువల్ చేసుకున్నారు. కాగా రెన్యువల్ కాకుండా మిగిలిన 25 మద్యం షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించడానికి ఇచ్చిన దరఖాస్తు గడువు షెడ్యూల్ అక్టోబర్ ఒకటో తారీకు అర్ధరాత్రితో ముగియగా దానిని అక్టోబర్ 6 తారీకు అర్ధరాత్రి వరకు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ వారు పొడిగించారు. అక్టోబర్ 7వ తారీఖున స్క్రూట్నీ చేసి, అక్టోబర్ 8వ తారీఖున జిల్లా కలెక్టర్ గారి సమక్షంలో



సదరు 25 షాపులకు లాటరీ నిర్వహించి షాపులు కేటాయించనున్నారు. నర్సాపురం స్టేషన్ పరిధిలో(3) షాపులు, భీమవరం ( 9), ఆకివీడు(6),తణుకు (5) తాడేపల్లిగూడెం (2) చొప్పున మొత్తం 25 షాపులు లాటరీ ప్రక్రియ ద్వారా పొందవచ్చు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా మరియు ఒక షాపుకి ఎన్ని దరఖాస్తులైన దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుముకింద నాన్ రిఫండబుల్ విధానంలో 3 లక్షల రూపాయలు మరియు ప్రాసెసింగ్ ఫీజు వెయ్యి రూపాయలు తో కలిపి మొత్తం 3,01,000 రూ గా కలదు .కావున వ్యాపార ఔత్సాహికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మద్ది రామశేషయ్య తెలిపారు.

# ఘనంగా 'సేవా సంకల్ప్ అభియాన్'

**మొక్కలు నాటిన మంత్రి కొలుసు పార్థసారథి**

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు పట్టణంలోని న్యూ ఎంప్లాయిస్ కాలనీ ఎన్టీఆర్ పార్కులో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గౌరవ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ప్రజాజీవితంలో, ప్రజాసేవలోవిజయవంతంగా 25 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా 'సేవా మేరా యోగ్ దాన్' పేరిట మంత్రి కొలుసు పార్థసారథి మొక్కలను నాటారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రధాని శ్రీ నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు దూరదృష్టి, ఎంతో అనుభవం ఉన్ననాయకులు ప్రజాసేవలపట్ల చూపుతున్న నిబద్ధతను, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటి, సంరక్షించే కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ప్రధానమంత్రి గడిచిన పాతికేళ్లుగా నిరంతరం ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. దేశాభివృద్ధితో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రజలు భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. "సేవా మేరా యోగ్ దాన్" ద్వారా ప్రతి ఒక్కరూ ప్రకృతి పరిరక్షణను ఒక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్- చైర్మన్ మరియు నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మున్సిపాలిటీ కమీషనరు కె.వీరయ్య, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, న్యూ ఎంప్లాయిస్ కాలనీ సభ్యులు, మున్సిపల్ శాఖ ఉద్యోగులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# ట్రిపుల్ ఐటీలో ఘనంగా గాంధీ జయంతి

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

గాంధీ జయంతి సందర్భంగా ఆర్జీయుకెటి నూజివీడులో ఎన్‌సిసి మరియు ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పిస్తూ, ఆర్జీయు కెటి. నూజివీడు ప్రాంగణం నేడు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన ప్రదర్శనకు సాక్ష్యంగా నిలిచింది. "నామ్ స్వచ్ఛతా ఉద్యమం"లో భాగంగా దేశవ్యాప్త "స్వచ్ఛతా కి సేవ" చొరవ కింద, విజయవాడలోని 4(ఎ) బాలికల బెటాలియన్‌కు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు భారీ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ స్పృహను పెంపొందించి, పరిశుభ్రమైన, పచ్చని భారతదేశానికి దోహదపడాలనే ఉమ్మడి లక్ష్యంతో, ఈ పవిత్రమైన రోజున క్యాడెట్లు మరియు ప్రముఖులు విజయవాడలోని వివిధ ప్రదేశాలలో 2,100 మొక్కలను నాటడానికి చేతులు కలిపారు. ఎన్‌సిసి 4(ఎ) గర్ల్స్ బెటాలియన్ కెప్టెన్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఈ మెగా డ్రైవ్ నిర్వహించబడింది. కల్నల్ ప్రవీణ్ యాదవ్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. విశ్వవిద్యాలయ కులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు, రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ శాఖాధిపతి సుబ్బలక్ష్మి ఇంకా ఎన్.సి.సి విద్యార్థులు పాల్గొన్నారు.ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో మొక్కల పెంపకంగాంధీ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించిన అనంతరం ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో మొక్కలు నాటడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జీయుకెటి కులపతి ఆచార్య ఎం.ఎల్.ఎన్. రావు ముఖ్యఅతిథిగా హాజరై క్యాంపస్ లోని గ్రౌండ్లో మొక్కలు నాటారు. క్యాంపస్ లోని పదిహేను ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు డా. లక్ష్మణరావు, డా. చిరంజీవి, ప్రదీప్, డా. పావని, డా. సునీల్ భగత్, సత్యదేవ్, డా. భానువినోలియా, శేషు కుమార్, డా. శరత్ కుమార్, ప్రతిమ మరియు ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా. వీవీ లక్ష్మణరావు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో బాధ్యతను పెంపొందించడంతో పాటు పరిశుభ్రమైన, పచ్చని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే సందేశాన్ని అందించాయి.



# తమ్మిలేరు నీటిని చేపల చెరువులకు మళ్లింపు

**ఆరోపిస్తూ తమ్మిలేరు 1వ తూమువద్ద ఆందోళన చేస్తున్న రైతులు.**



ప్రజాభూమి ప్రతినిధి–చాట్రాయి.

చాట్రాయి మండల పరిధిలోని మంకొల్లు మరియు పోలవరం గ్రామాల సరిహద్దులో గల తమ్మిలేరు రిజర్వాయర్ నీటిని అక్రమంగా చేపల పెంపకం దారులకు అమ్ముకుంటున్నారని శుక్రవారం రైతులు ఆరోపిస్తూ తమ్మిలేరు 1వ తూము వద్ద పోలవరం, పోతన పల్లి, మంకొల్లు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న రైతులు మాట్లాడుతూ మండలంలో ఎల్ నోని ప్రభావంతో వర్షాలు పడక చెరువుల్లో నీరు లేక పోవటంతో ఈ రెండు కొద్దిశాతం రైతులు మాత్రమే పంటలు వేశారని, వేసిన పంటలు చేతికి వస్తాయో లేదో కూడా తెలియని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో తమ్మిలేరు రిజర్వాయర్లో ఉన్న కొద్దిపాటి నీటిని చాపల చెర్వులకు టిఆర్పి ఏఈ అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు.తమ్మిలేరులో ఉన్న కొద్దిపాటి నీటికి తోడు వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిస్తే ఉన్న నీటికి మరికొంత నీరు తోడైతే రెండవ పంట లైనా పండించు కోవచ్చు నన్న ఆశతో రైతులు ఉండగా,వారి ఆశలపై తమ్మిలేరు ఏఈ నీళ్లు చల్లారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.తమ్మిలేరులో జేసీపీ తో 1వ తూముకు నీరు వెళ్ళ కుండా పోసిన కట్టను తొలగించి నీరును దాదాపు 20 గంటలకు పైగా గండిచెరువుకు తీసుకు వెళ్తున్నారని, ఇది ఏ ఈ సహ కారం లేకుండా జరగ దని, కేవలం గండి చెర్వులో చేపలు పేపకం దారులకు మేలు చేయటం కోసం తమ్మిలేరు నీటిని డబ్బులు తీసుకొని ఏఈ అక్రమంగా విడుదల చేస్తున్నారని, రైతులు ఆరోపిస్తున్నారు.ఉన్నదున్న నీరు ఎవ్వరు వదిలా రని రైతులు నిలదీయ గా, ఎవ్వరు వదిలారో తనకు తెలియదని సమాధానం చెప్పటం తో తూము వదలటా నికి సంబంధించిన రెంచ్, నీవద్ద ఉండ గా నీకు తెలియదా అంటూ రైతులు ఏఈ పై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై టిఆర్ పి ఏఈ లాజరున ఫోన్ చేసి విలేఖరులు వివరణ కోరగా తమ్మి లేరు నుంచి నేనుఎటు వంటి అనుమతి ఇవ్వలేదని, అనాధ్యులే గా వదిలారా నీ,ఇకమీదట ఇలా జరగకుండా కట్టు దిట్టం చేస్తానని ఏఈ తెలిపారు.గతంలో అక్రమంగా నీరు విడుదల చేసిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకున్నారు కదా... జేసీపీ తో కట్టను తొలగించి నీరును గండిచెర్వుకు వదిలిన వీడియోలు ఉన్నాయి వాటిని ఆధారంగా చేసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.అలా కాని పక్షంలో మరింతగా ఆందోళన చేపడతా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మట్టా వెంకటేశ్వర్రా వు,బిలుగూడి వసం తరావు, సత్తెనపల్లి మురళీకృష్ణ,పులపాక తిరుపతిరావు, సర సరస్వతి సూరవ రాజులు,కొక్కిరపాటి హరిబాబు తదిత రులు పాల్గొన్నారు.

# కూటమి పాలనపై ప్రజల్లో విశ్వాసం.. టీడీపీలోకి భారీగా చేరికలు

- నార్పెడ్‌మిల్లిలో వైసీపీకి షాక్, 80 కుటుంబాలు టీడీపీలో చేరిక.
- పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.
- 2029లోనూ కూటమి ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుకుంటున్నారు: ఎమ్మెల్యే.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన 80 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆత్రేయపురం మండలం నార్పెడ్‌మిల్లి గ్రామంలో గురువారం రాత్రి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు మద్దింశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బీర శ్రీను, మాజీ పంచాయతీ సభ్యులు రామాని వెంకటరత్నం, రామాని నాగేశ్వరరావు, రామాని పండు, వందే సుబ్బారావు, బీర వెంగలరావుతో పాటు చిటికెన శ్రీను, గుత్తుల శ్రీను, వైదా అన్నవరం, బాలం సత్యనారాయణ తదితరులు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. మొత్తం 80 కుటుంబాలు పార్టీలో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నూతనంగా పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. 2029లోనూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయిలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా పార్టీలో చేరిన వారి కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## పెన్షన్‌దారుల వద్దకే పింఛన్

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరసింగ పాలెం గ్రామానికి చెందిన దోమవరపు కుమారికి శుక్రవారం గ్రామ ఇంజనీరింగ్ సహాయకురాలు ఆవుల కృష్ణవేణి ఆసుపత్రికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేశారు. పెన్షన్‌దారుల పరిస్థితి దృష్టిలో ఉంచుకుని అవసరమైన సందర్భాల్లో వారి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నామని ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పెన్షన్‌దారులకు కూడా పింఛన్ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నా మని ఆయన పేర్కొన్నారు.

## గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి

**-ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**



ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఏలేశ్వరం నగర పంచాయతీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొని, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య సాధనలో పూజ్య బాపూజీ చేసిన త్యాగాలు, ఆయన బోధించిన అహింసా సిద్ధాంతం, సత్యనిష్ఠ నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాల్లో నడుస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ చేసిన నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యంగా యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో చురుగ్గా భాగస్వాములు కావాలని సూచించారు. పరిశుభ్రత, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి ఉన్నత విలువలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరణలో పెట్టాలని కోరారు.కార్యక్రమం అనంతరం బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే చేతుల మీదుగా స్థానిక పేదలకు దుప్పట్లు, పండ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



ప్రజాభూమి ప్రతినిధి– ప్రత్తిపాడు (ఏలేశ్వరం)

కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఏలేశ్వరం నగర పంచాయతీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఏలేశ్వరం టౌన్ పరిధిలోని షిరిడీ నగర్ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) పథకంలో మంజూరైన 22 కోట్ల నిధులలో భాగంగా, 150 మీటర్ల నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గౌరవ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రత్యేక పూజలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్దిష్ట గడువులోగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా**

**ఏలేశ్వరంలో ఘనంగా 'సేవా మేరా యోగ్‌దాన్' మొక్కలు నాటే కార్యక్రమం**

**పాల్గొన్న కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు**



ప్రజాభూమి ప్రతినిధి– ప్రత్తిపాడు (ఏలేశ్వరం)

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలు నాటి సంరక్షించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా పిలుపునిచ్చారు. "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో నిర్వహించిన "సేవా మేరా యోగ్‌దాన్" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె స్వయంగా మొక్కలు నాటారు.అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ... గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన 'సేవా మేరా యోగ్‌దాన్' కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమం ప్రజల్లో సామాజిక బాధ్యత, సేవా భావం మరియు పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. పచ్చదనం పెంచడం ద్వారానే ప్రకృతి సమతుల్యతను కాపాడగలమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం ఒక మొక్కనైనా నాటి చెట్టుగా పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులకు, ప్రజలకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రావులపాలెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

-సత్యం, అహింస మార్గంలో గాంధీజీ చూపిన బాట నేటి తరానికి ఆదర్శం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని రావులపాలెంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మహాత్మా గాంధీజీ దేశ స్వాతంత్ర్య సాధన కోసం సాగించిన పోరాటాన్ని, ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. సత్యం, అహింస, శాంతి, సమానత్వం వంటి గాంధీజీ ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. హింసకు తావులేని మార్గంలో సత్యం, అహింస ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ ప్రజల మధ్య ఐక్యత, సామాజిక సామరస్యం పెంపొందించడంతోపాటు పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టి, ఆయన చూపిన మార్గంలో నడవడమే జాతిపితకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.

## యువత మహాత్మా గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి...!

చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం.

జనసేన మండల యువత అధ్యక్షులు శివకృష్ణ.

గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన ప్రముఖులు.



ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

యువత మహాత్మా గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ,చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం మౌతోందని, నేటి బాలలే రేపటి తరానికి పౌరులని కాజులూరు మండలం జనసేన యువత అధ్యక్షులు కూనపరెడ్డి శివకృష్ణ అన్నారు. ఈమేకు శుక్రవారం మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా కాజులూరు మండలం శీల గ్రామంలో శివకృష్ణ ఆధ్వర్యంలో గాందీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ గత 27 సంవత్సరాల క్రితం గ్రామంలో మాధవరపు బాసికాపు స్ఫూర్తితో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టగా తదుపరి అబ్బుస్వామి, ప్రస్తుతం తన ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మహాత్మా గాంధీ ప్రపంచానికి సత్యం, అహింస, శాంతి సందేశాలను అందించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గమే భారతదేశ అభ్యున్నతికి బాటలు వేసిందని పేర్కొన్నారు.ప్రజల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం, గ్రామ స్వరాజ్య సాధన కోసం గాంధీజీ జీవితాంతం కృషి చేశారని శివకృష్ణ తెలిపారు. దేశ ప్రజలలో జాతీయ చైతన్యం నింపి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు.నేటి యువత మహాత్మా గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తేనే గాంధీజీకి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. పిల్లలందరూ చదువుకోవడం ద్వారానే ఈ సమాజాన్ని మార్చగలమని, మహాత్మా గాంధీ లాంటి వారు కూడా లండన్ లో బాగా చదువుకుని బ్రిటిష్ సామ్రాజ్యవాదం పోవాలని పోరాడారని సమావేశానికి హాజరైన పలువురు ప్రముఖులు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన చిన్నారులతో కేక్ కటింగ్ చేయించి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాజరైన వారందరికీ స్వీట్లు పంచిపెట్టారు.ఈకార్యక్రమంలో .చిట్నీడి సత్తిరాజు ,మాధవరపు నానాజీ, నల్లమిల్లి రామారెడ్డి,వాసిరెడ్డి శ్రీను ,గరగ కొండలరావు ,కోన బాబురావు ,కోదండ పాణి ,వాసిరెడ్డి వీరబాబు ,చిట్నీడి వెంకటరమణ, గుంటముకల వెంకటేశ్వరరావు,పేచేటి పాండురంగ ,కోన బుజ్జి ,కుంచనపలి సుబ్బయ్య ,వాసిరెడ్డి నూకరాజు ,కుంచనపల్లి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రామచంద్రపురంలో ఘనంగా జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం

-మంత్రి సుభాష్‌కు వినతి పత్రం అందజేసిన జర్నలిస్టులు.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జర్నలిస్టుల కోర్కెల దినం గా పాటించాలని ఐజేయు ఇచ్చిన పిలుపుమేరకు ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రపురంలో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం ఘనంగా నిర్వహించింది. రామచంద్రపురంలోని జర్నలిస్టులందరూ మంత్రి క్యాంప్ కార్యాలయానికి చేరుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాస్ కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి, జర్నలిస్టులకు భద్రత చట్టం చేయాలి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి, ప్రమాద బీమా పథకాన్ని వర్తింప చేయాలి, జర్నలిస్టుల పిల్లలకు విద్య లో 50% రాయితీ అందించాలి,జర్నలిస్టులకు పింఛన్లు ఇవ్వాలి, జర్నలిస్టులకు రెండో విడత అక్రిడేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి సుభాష్ కి అందజేసి తమ డిమాండ్లను ప్రభుత్వ దిష్టి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి సుభాష్ స్పందిస్తూ జర్నలిస్టుల కోర్కెలను తీర్చడానికి పూర్తిగా సహకరిస్తానని హామీనిచ్చారు.అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట కొద్దిసేపు తమ డిమాండ్ల సాధనకై నినాదాలు చేశారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి జర్నలిస్టుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని ఆర్డిఓ కార్యాలయం అధికారికి అందజేశారు. ఈకార్యక్రమంలోనియోజవర్గ ఎలక్ట్రానిక్, ప్రింటు మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాల సాధనకు పునరంకితం కావాలి

- గ్రామ స్వరాజ్య స్థాపనకు కూటమి ప్రభుత్వం కృషి
- కొత్తపేటలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

సత్యం, అహింసా మార్గాల్లో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపిన మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని గురువారం కొత్తపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి రాష్ట్ర బీసీ కార్పొరేషన్ వెల్ఫేర్ చైర్మన్ రెడ్డి అనంతకుమారితో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యం, న్యాయం పట్ల అచంచలమైన విశ్వాసంతో మహాత్మా గాంధీ యావత్ ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు. అహింసా మార్గంలో శాంతిని నెలకొల్పేందుకు గాంధీజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహోన్నత వ్యక్తిని స్మరించుకోవడంతో పాటు, ఆయన కలలు కన్న భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో సామాజిక అసమానతలు, కుల వ్యవస్థ, అంటరానితనం వంటి సమస్యల నిర్మూలనకు గాంధీజీ తన జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక సమానత్వం దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా, ఆయన చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను నిత్య జీవితంలో ఆచరించాలని ఎమ్మెల్యే సూచించారు.

## మహాత్ముడి ఆశయాలే ప్రగతికి మార్గదర్శకం

### ఘన నివాళులు అర్పించిన మంత్రి సుభాష్



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురంలో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కుమ్మరవీధి, మున్సిపల్ కార్యాలయం వద్దఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి మంత్రి సుభాష్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఏ వి ఆర్ ఆర్ రాజులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం చల్లావారి వీధిలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రపంచానికి సత్యం, అహింస, శాంతి సందేశాలను అందించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గమే భారతదేశ అభ్యున్నతికి బాటలు వేసిందని పేర్కొన్నారు.ప్రజల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం, గ్రామ స్వరాజ్య సాధన కోసం గాంధీజీ జీవితాంతం కృషి చేశారని మంత్రి తెలిపారు. దేశ ప్రజలలో జాతీయ చైతన్యం నింపి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు.నేటి యువత మహాత్మా గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తేనే గాంధీజీకి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, కూటమి పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



### గాంధీ జయంతి సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

గాంధీ జయంతిని పురస్కరించుకుని సూర్యోదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రౌతులపూడి ప్రజా వైద్యశాలలో గురువారం మానవతా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేసి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.మహాత్మా గాంధీజీ సేవా స్ఫూర్తితో సమాజంలో అవసరమైన వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మాదన సుబ్బారావు, సలాది వినోద్, పన్నీర్ రమేష్, నక్క లోవరాజు, రొంగల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం మున్సిపాలిటీలో రూ. 22 కోట్లతో అభివృద్ధి పనుల జోరు

- కిలోమీటరు మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన నేత మెడిశెట్టి బాబీ
- పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు (ఏలేశ్వరం)

ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. హ్యామ్ (నాబార్డు) పథకం కింద మంజూరైన రూ. 22 కోట్ల నిధులతో పట్టణంలో చేపట్టనున్న నూతన అభివృద్ధి పనులకు శుక్రవారం జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెడిశెట్టి బాబీతో కలిసి ఆమె ఘనంగా శంకుస్థాపన చేశారు.ఇందులో భాగంగా దిబ్బలపాలెం రామాలయం నుంచి గొల్లలమెట్ట ఆర్అండ్‌బీ రహదారి వరకు సుమారు 850 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి, అలాగే శిరిడీ నగర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో సుమారు 150 మీటర్ల సీసీ రోడ్డు పనులకు వారు భూమిపూజ నిర్వహించారు. మొత్తం కిలోమీటరు మేర నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు దశలవారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించి ఏలేశ్వరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మూది నారాయణ స్వామి, బొదిరెడ్డి గోపి, సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్, నాయకులు వాగు రాజేష్, ఎండగుడి నాగబాబు, రుచి రమేష్, కోణాల వెంకట రమణ, గట్టిం వెంకటరమణ, మామిడి లలిత, వైబోగుల సుబ్బారావు, కరోతి గాంధీ, మాగాపు వీరబాబు, కోట్ల కృష్ణ, శంఖాన్ని బాబ్జీ, పెంద్ర శ్రీను, రాయుడు చిన్న, పతివాడ అఖిలేష్, మున్సిపల్ కమిషనర్ ఎన్. ప్రకాష్, మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తికి స్వచ్ఛ పురస్కారం

### కలెక్టర్ చేతులమీదుగా ఫౌండేషన్ చైర్మన్ సత్యంకు పురస్కారం

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం.

సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల కార్యక్రమంలో ఉత్తమ స్వచ్ఛ ఎన్ జి ఓ అవార్డును డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అందుకున్నారు.సమాజ సేవే లక్ష్యంగా, ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నిర్వహిస్తున్న విస్తృత సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ముఖ్యంగా స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనంతో పాటు విద్య, ఉపాధి, మహిళా సాధికారత, పేదలకు ఆర్థిక సహాయం వంటి అనేక రంగాల్లో ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరమవుతున్న నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడం,నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషించడం ,మహిళలు స్వయం ఆధారంగా నిలబడాలనే ఉద్దేశంతో వారికి వృత్తి నైపుణ్య శిక్షణలు అందిస్తూ, శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించేలా ఫౌండేషన్ చర్యలు తీసుకోవడం,మహిళా సాధికారతే కుటుంబ సాధికారత అనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు స్వచ్ఛతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఫౌండేషన్ పెద్దపీట వేసి వేలాది మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించడం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేయడంతో గాంధీ జయంతి సందర్భంగా లభించిన ఉత్తమ స్వచ్ఛ





పురస్కారం ఈ సేవలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందని ఈసందర్భంగా పేర్కొన్నారు.మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనలతో రామచంద్రపురం నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోనూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను విస్తరిస్తోందని ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నాం అంటూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

## ప్రెసిడెంట్, యానిమేటర్‌పై రూ.13.53 లక్షల దుర్వినియోగం ఆరోపణలు.

### ఏపీఎంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన అశోకా గ్రూప్ సభ్యులు.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలోని డ్వాక్రా సంఘంలో రూ.13.53 లక్షలకు పైగా నిధులు దుర్వినియోగమైనట్లు సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామంలోని అశో కా గ్రూప్ సభ్యులు గురువారం డ్వాక్రా ఏపీ ఎం పి. భూషణంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**రూ.20 లక్షల రుణం**

పొడగట్లపల్లి గ్రామానికి చెందిన అశోకా గ్రూప్‌లో మొత్తం 10 మంది సభ్యులు ఉన్నారు. గ్రూప్‌కు కొల్లాపు సూర్యకళ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సంఘం ఇండియన్ బ్యాంక్, గోపాలపురం శాఖ నుంచి రూ.20 లక్షల డ్వాక్రా రుణం తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు. రుణ వాయిదాలు చెల్లించేందుకు ఒక్కో సభ్యురాలు నెలకు రూ.6,100 చొప్పున ప్రతి నెలా 10వ తేదీలోపు ప్రెసిడెంట్‌కు చెల్లిస్తూ వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే సభ్యుల నుంచి వసూలు చేసిన మొత్తాలను బ్యాంకులో జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు ఆరోపించారు.

**పొదుపు సొమ్ములపైనా ఆరోపణలు**

సుమారు 39 నెలలుగా బ్యాంకుకు నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లించకపోయినా ఈ విషయం సభ్యులకు తెలియకుండా దాచిపెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రెసిడెంట్ కొల్లాపు సూర్యకళ, యానిమేటర్ కొల్లాపు మంగ కలిసి వ్యవహరించి, బ్యాంకు అధికారులకు సైతం సరైన సమాచారం అందకుండా చేశారని సభ్యులు ఆరోపించారు. వాయిదా సొమ్ముతో పాటు సభ్యుల పొదుపు మొత్తాలను కూడా అక్రమంగా మళ్లించినట్లు వారు పేర్కొన్నారు.

**రూ.13.53 లక్షలు రికవరీ చేయాలి**

గ్రూప్ నిధుల్లో రూ.13,53,612.13 మేర దుర్వినియోగం జరిగినట్లు సభ్యులు పేర్కొంటూ, ఆ మొత్తాన్ని ప్రెసిడెంట్ కొల్లాపు సూర్యకళ, యానిమేటర్ కొల్లాపు మంగ నుంచి తక్షణమే రికవరీ చేయాలని ఏపీఎం పి. భూషణంను కోరారు. అలాగే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్ కొల్లాపు మంగను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సభ్యులు హెచ్చరించారు.



**నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించాం: ఏపీఎం**

ఈ విషయంపై ఏపీఎం పి. భూషణంను వివరణ కోరగా, పొడగట్లపల్లి అశోకా గ్రూప్‌లో రూ.13.53 లక్షలకు పైగా నిధుల దుర్వినియోగం జరిగిన విషయం వాస్తవమేనని తెలిపారు. ప్రెసిడెంట్ కొల్లాపు సూర్యకళ, యానిమేటర్ కొల్లాపు మంగల నుంచి సంబంధిత మొత్తాన్ని బ్యాంకులో జమ చేయించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. సొమ్మును చెల్లించని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏపీఎం భూషణం తెలిపారు.

# గాంధీ ఆశయాలతోనే సమాజాభివృద్ధి

## -ఘనంగా జాతిపిత జయంతి వేడుకలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, సేవ, స్వచ్ఛత మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా శుక్రవారం హిందూపురం పట్టణ, మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గాంధీజీతో పాటు మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని కూడా నిర్వహించి వారి దేశసేవను స్మరించుకున్నారు. హిందూపురం మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొని గాంధీజీ సేవలను స్మరించుకున్నారు. హిందూపురం రూరల్ మండలం కిరికెర పంచాయతీ పరిధిలోని బసవనపల్లి హైస్కూల్ మైదానంలో గాంధీజీ జయంతి సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏలు వీరయ్య, బాలాజీ, మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వరరావు, టీడీపీ మండల కన్వీనర్






హెచ్.ఎన్.రాము, మార్కెట్‌యార్డు చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవినహళ్లి ఆనంద్, ఐటీడీపీ రామాంజి, రామకృష్ణరెడ్డి, హనుమంత్‌రాయుడు, మాజీ ఎంపీటీసీలు అంజి, ఆంజనేయులు, మదన్‌గోపాల్‌రెడ్డి, రామగిరి సూరి, ముజీబ్, నాగేంద్రబాబు, మధు, వంశీ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జమీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమానుల్లా, సమీవుల్లా, పీరు సాబ్, ఎంఈ సమీవుల్లా, సంజీవప్ప, బాబన్న, తిరుపాల్ తదితరులు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు. ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహంలో కూడా గాంధీజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి తదితరులు పాల్గొన్నారు. బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. హిందూపురంలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్‌లోని అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జియావుల్లాఖాన్, ఎస్ఐఎస్ మ్యాన్‌పవర్ సప్లయర్ రామారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అశ్వత్థనారాయణ, హరీష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. యస్.డీ.జీ.యస్ కళాశాలలోనూ గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కమిటీ సెక్రటరీ, కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్ సహకారంతో జరిగిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ ఈ.అశ్వర్థనారాయణ అధ్యక్షత వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త బి.రాజన్న, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఎం.ఆర్.పనింద్ర, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్, గణిత అధ్యాపకుడు రాము, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ సత్యాగ్రహం, అహింస, స్వదేశీ, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల ద్వారా కీలక పాత్ర పోషించారని తెలిపారు. గాంధీజీ సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా అనేక సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు, క్రమశిక్షణ, దేశభక్తి, పట్టుదలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గాంధీజీ, శాస్త్రి ఆశయాల ను ఆచరిస్తూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# మహాత్మా గాంధీ,లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఎస్టీయూ ఘన నివాళులు



ప్రజాభూమి పోరుమామిళ్ల :
జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్ టి యు) ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి,ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్టియు పోరుమామిళ్ల రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్ఇటిఓ) జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి, ఎస్టీయు రాష్ట్రకమిటీ కన్వీనర్ వాకా చంద్రశేఖర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ సత్యం, అహింస, సత్యాగ్రహం వంటి విలువలతో దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించి,ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస,మానవతా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా లాల్ బహుదూర్ శాస్త్రి నిరాడంబరత, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచారని,దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన "జై జవాన్- జై కిసాన్" నినాదందేశ రక్షణలో సైనికుల,దేశ అభివృద్ధిలో రైతుల ప్రాధాన్యతను చాటిచెప్పిందన్నారు. దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, గాంధీజీ, శాస్త్రిజీ వంటి మహనీయుల ఆశయాలను విద్యార్థులకు తెలియజేస్తూ వారిలో సత్యం, నైతిక విలువలు,దేశభక్తి, సేవాభావం పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు సీనియర్ నాయకులు బి.బాలరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఓ.చంద్రహాసరెడ్డి,పుల్లయ్య, జిల్లాకార్యవర్గసభ్యులు వెంకటరెడ్డి,గురయ్య, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, పోరుమామిళ్ల మండలశాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జయరామిరెడ్డి,అబ్దుల్ హుస్సేన్ తదితర ఎస్టీయు నాయకులు, కార్యవర్గసభ్యులు,కార్యకర్తలు పాల్గొని మహాత్మాగాంధీ,లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి,ఘన నివాళులు అర్పించారు.

# పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత

## -మొక్కలు నాటి సంరక్షణకు ప్రజలు ముందుకు రావాలి

## -ఎమ్మెల్యే పీఏ వీరయ్య



ప్రజాభూమి, హిందూపురం టౌన్
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే పీఏ వీరయ్య పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హిందూపురం పట్టణంలోని ఎంజీఎం పాఠశాల మైదానంలో నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏలు వీరయ్య, బాలాజీ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడంద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమాజహిత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రమేష్, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీలో గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

## - గాంధీజీ ఆశయాలను నిత్య జీవితంలో ఆచరించాలని సూచన- డైరెక్టర్ విజయ ప్రకాష్



ప్రజాభూమి, వేంపల్లె
ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ ప్రకాష్ మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ ప్రతిపాదించిన సత్యం, అహింస, నైతిక విలువలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు గాంధీజీ ఆశయాలను నిత్య జీవితంలో ఆచరించాలని సూచించారు. పరిపాలన అధికారి డా. రత్నకుమారి మాట్లాడుతూ లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత, క్రమశిక్షణ, దేశసేవకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డా. డి. కోనప్ప మాట్లాడుతూ శాస్త్రి రైతుల సంక్షేమం, దేశాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. విద్యార్థులు ఆయన జీవితం నుంచి కర్తవ్యనిబద్ధత, దేశభక్తి, ప్రజాసేవ వంటి విలువలను నేర్చుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. జే. దీప్తి మాట్లాడుతూ జాతీయ నాయకుల ఆశయాలను యువతలోకి తీసుకెళ్లడం, సమాజ సేవ పట్ల బాధ్యతాయుత దృక్పథాన్ని పెంపొందించడం ఎన్ఎస్ఎస్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు రమేష్ కైలాష్, పి. రవికుమార్, కోటేశ్వరి, డా. తిరుపతి రెడ్డి, టి. గోవర్ధన్, సుబ్బారాయుడు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ రమణా రెడ్డి, దీపిక బాలతో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి వేడుకలు




ప్రజాభూమి, పులివెందుల
గాంధీ జయంతి సందర్భంగా పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనిత, అధ్యాపకులు ఓబుల్ రెడ్డి, రొటేరియన్ నాగేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్ వల్లి, సేవాసమితి అధ్యక్షుడు ముమ్మెల రాజు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహింస, సత్యం, సేవా భావం వంటి గాంధీ ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని, విద్యార్థినులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో అధ్యాపకులు శివరాంరెడ్డి, సుగుణ, వినోద, ప్రవళిక, శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్సీ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# శింగనమల సీహెచ్‌సీకి ఉత్తమ ఆసుపత్రి అవార్డు

## ఎంపీ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మెడికల్ వైద్యాధికారి డాక్టర్ రోహినాథ్



ప్రజా భూమి శింగనమల
స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర అవార్డులు--2026లో భాగంగా సింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు జిల్లా స్థాయిలో ఉత్తమ ఆసుపత్రి అవార్డు లభించింది. అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, ఆసుపత్రి సేవల జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు తదితరుల చేతుల మీదుగా వైద్యాధికారి డాక్టర్ రోహినాథ్ అవార్డును అందుకున్నారు.పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, రోగుల సౌకర్యాలు, ఆసుపత్రి ప్రాంగణ నిర్వహణ, సంక్రమణ నియంత్రణ, ప్రజారోగ్య సేవల నాణ్యతలో చూపిన ప్రగతికి గుర్తింపుగా ఈ అవార్డు అందజేశారు. జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ అవార్డు ఆసుపత్రిలోని వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు,ఫార్మసిస్టులు, శానిటేషన్, సెక్యూరిటీ, కార్యాలయ, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమష్టి కృషి ఫలితమని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి సహా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఇకపై కూడా పరిశుభ్రత, అత్యవసర, ప్రసూతి సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాలను మరింత మెరుగుపరుస్తూ స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తామని మెడికల్ వైద్యాధికారి డాక్టర్ రోహినాథ్ తెలిపారు.

# నార్పల పీహెచ్‌సీకి ఉత్తమ ఆసుపత్రి అవార్డు

## ఎంపీ, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న వైద్యాధికారి డాక్టర్ యామిమ్ భూషణ్



ప్రజా భూమి - నార్పల
స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర అవార్డులు--2026లో భాగంగా నార్పల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా స్థాయిలో ఉత్తమ ఆసుపత్రి అవార్డు లభించింది. అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, ఆసుపత్రి సేవల జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు తదితరుల చేతుల మీదుగా నార్పల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యామిమ్ భూషణ్ అవార్డును అందుకున్నారు.ఆసుపత్రిలో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆసుపత్రి ప్రాంగణ నిర్వహణ, సంక్రమణ నియంత్రణతోపాటు ప్రజారోగ్య సేవల నాణ్యతలో చూపిన ప్రగతికి గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. అవార్డుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ అవార్డు ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, శానిటేషన్, సెక్యూరిటీ, కార్యాలయ సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమష్టి కృషికి దక్కిన గుర్తింపుగా ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీతో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై కూడా పరిశుభ్రతతో పాటు అత్యవసర, ప్రసూతి సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాలను మరింత మెరుగుపరుస్తూ స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తామని వైద్యాధికారి డాక్టర్ యామిమ్ భూషణ్ తెలిపారు.

# డాక్టర్ రామిశెట్టి శివశంకర్ కు మహాత్మా గాంధీ స్మారక విశిష్ట సేవా పురస్కారం



ప్రజాభూమి, పులివెందుల
స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ రామిశెట్టి శివశంకర్ కు మహాత్మా గాంధీ స్మారక విశిష్ట సేవా పురస్కారం లభించింది. పట్టణంలోని పుల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో గాంధీ జయంతి సందర్భంగా ఏపీ దివ్యాంగుల నెట్ వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ చక్రపాణి, సీనియర్ పాత్రికేయుడు రంగనాయకులు, సేవకుడు నక్కలపల్లి కొండారెడ్డి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి, డాక్టర్ ఆర్ఎస్ఎస్ ను జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ స్వదేశీ ఆవుల నుంచి సేంద్రీయ ఎరువులు, మందులు తయారు చేసి రైతులకు అందిస్తూ, డా. ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై పరిశోధనలు చేస్తున్న ఆర్ఎస్ఎస్ సేవలు అభినందనీయమని, ఈ పురస్కారానికి వందశాతం అర్హుడని అన్నారు. అనంతరం డాక్టర్ ఆర్ఎస్ఎస్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో దివ్యాంగులకు చేతివృత్తుల ద్వారా ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 30 మంది మానసిక దివ్యాంగ విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక నగదు పురస్కారాలు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో దివ్యాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, రంగనాథ స్వామి ట్రస్ట్ చైర్మన్ అల్లం రంగనాయకులు, టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఇక భౌతిక విచారణ అవసరం లేదు..

## -ఎస్ఐఆర్--2026లో ఈసీఐ కీలక మార్గదర్శకాలు

## -తహసీల్దార్ వెంకటేష్



ప్రజాభూమి, హిందూపురం టౌన్
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర నవరణ (ఎన్ఐఆర్--2026) ప్రక్రియలో భాగంగా ఓటర్లకు మరింత సౌలభ్యం కల్పిస్తూ భారత ఎన్నికల సంఘం కీలక మార్గదర్శకాలు జారీ చేసిందని తహసీల్దార్ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐఆర్‌లో అన్‌మ్యాప్డ్ లేదా లాజికల్ డిస్క్రెపెన్సీస్ ఉన్న ఓటర్లను ఇకపై విచారణ పేరుతో కార్యాలయాలకు పిలిపించాల్సిన అవసరం లేదన్నారు. సంబంధిత వివరాలు, ధ్రువపత్రాలను బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓ) ఇంటింటికీ వెళ్లి సేకరించి ఈసీఐ నెట్‌లో అప్‌లోడ్ చేస్తారని వివరించారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో అన్‌మ్యాప్డ్ లేదా లాజికల్ డిస్క్రెపెన్సీస్ ఉన్న ఓటర్లకు నోటీసులు అందినప్పటికీ, వారు స్వయంగా ఈఆర్ఓ, ఏఈఆర్ఓ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి ఈసీఐ నెట్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. అనంతరం సంబంధిత ఈఆర్ఓ వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఈఆర్ఓ నిర్ణయం మేరకు విచారణ నిర్వహిస్తారని తెలిపారు. అటువంటి సందర్భాల్లోనూ వీలైనంత వరకు ఆన్‌లైన్ ద్వారా విచారణ చేపట్టేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. దీంతో ఓటర్లు అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అనుమానాలు లేదా పొరపాట్లు ఉంటే బీఎల్‌ఓలను సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి ద్వారా అవసరమైన వివరాలు అందించే అవకాశం కూడా ఉందన్నారు. ఓటర్ల జాబితా నిరంతర నవీకరణ ప్రక్రియలో భాగంగా ఎస్ఐఆర్‌లో పేరు నమోదు కాకుండా మిగిలిపోయిన అర్హులు, 18 సంవత్సరాలు నిండిన యువత, తొలిసారి ఓటు హక్కు పొందుతున్న వారు తమ పేర్లను జాబితాలో చేర్చుకునేందుకు సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను సంప్రదించాలని వెంకటేశు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# కూటమి పాలనలో ప్రజలు అష్టకష్టాలు

## హామీల అమలులోకూటమి ప్రభుత్వంవిఫలం

## - ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల
రాష్ట్రంలో కూటమి నాయకుల దౌర్జన్యాలు రోజురోజుకూ ఎక్కువవు తున్నాయని, ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మండిపడ్డారు. గురువారం పులివెందులలోని తన నివాస ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో రైతులతో పాటు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార ని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకులు, వంట నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, మనకు మంచి రోజులు తప్పక వస్తాయని, అందరూ సహనంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా ప్రధాన లక్ష్యమ ని స్పష్టం చేశారు.అంతకుముందు పులివెందుల నియోజకవర్గం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎంపీని కలిసి వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యలను నేరుగా వివరించారు. వాటిని సావధానంగా విన్న ఎంపీ, పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు.

# మైనార్టీలకు జగన్ పెద్దపీట వేశారు: ముస్లిం నాయకులు



ప్రజాభూమి, పులివెందుల
వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైనార్టీలకు పెద్దపీట వేశారని, తమ మద్దతు ఎప్పటికీ వైసీపీకేనని ముస్లిం మైనార్టీ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ వైసీపీ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ చైర్మన్లు వరప్రసాద్, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, దేరంగుల చంద్రమౌళి బలిజ సంఘం వీధి, జెండామాను వీధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ముస్లింనాయకుడు నూరుల్లా తదితరులువారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్‌హయాంలో మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యత లభించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీలను విస్మరించిందని విమర్శించారు. తాము వైసీపీని వీడే ప్రసక్తే లేదని, వైఎస్ జగన్, వైఎస్ అవినాష్ రెడ్డి నాయకత్వంలోనే పనిచేస్తామని తెలిపారు.

# అరవిందనాథ్ రెడ్డి ఆరోగ్యంపై ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకుడు అరవిందనాథ్ రెడ్డిని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరామర్శించారు.ఇటీవల మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి శుక్రవారం సింహాద్రిపురంలోని ఆయన నివాసానికి వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన విధంగా మందులు వాడుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.